జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శనివారం 23 మే 2026 | సంపుటి: 19 | సంచిక: 76 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , జ్యేష్ఠ మాసము , తిథి: అష్టమి - 28:29:45 వరకు నక్షత్రంమాఘ - 26:10:04 వరకు కరణంవిష్టి - 16:43:10 వరకు, బవ - 28:29:45 వరకు పక్షంశుక్ల యోగంధ్రువ - 06:13:11 వరకు, వ్యాఘాత - 28:42:13 వరకు వారం

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## కేంద్రానికి ఆర్‌బిఐ శుభవార్త

**రూ.2.87 లక్షల కోట్లు డివిడెండ్ ప్రకటన**

ముంబయి,మే22(ప్రజాజ్యోతి): కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుడ్‌న్యూస్ చెప్పింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.2.87 లక్షల కోట్లు డివిడెండ్ రూపంలో చెల్లించనున్నట్లు శుక్రవారం ప్రకటించింది. ఆర్‌బీఐ ఏటా మిగులు నిధులను కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్ రూపంలో

మిగతా1 2లో..

## నేడు యాదగిరిగుట్టకు సీఎం రేవంత్

హైదరాబాద్,మే22(ప్రజాజ్యోతి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం నాడు యాదగిరిగుట్టలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. వేద పాఠశాలకు భూమిపూజ, లక్ష్మీనరసింహ స్వామి దర్శనం చేసుకోనున్నారు. ఈ మేరకు

మిగతా 2లో..



## పదేపదే కొందరికే రిజర్వేషన్లు ఇస్తే ఎలా?

- మిగతా వారికి కూడా ఈ ప్రయోజనం అందవద్దా?
- కొందరికే రిజర్వేషన్లు దక్కితే మిగతా ప్రజలు ఏం కాను
- ఇలా అయితే దేశంలో రిజర్వేషన్ల నుంచి బయటపడేనా
- ఐఎఎస్ తల్లిదండ్రుల పిల్లలకు రిజర్వేషన్లు అవసరమా
- సుప్రీం ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు




న్యూఢిల్లీ,మే22(ప్రజాజ్యోతి): రిజర్వేషన్లపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు చేసింది. కొందరే వీటిని పదేపదే అనుభవించడం ద్వారా మిగతా వారికి అడ్డుపడుతున్నారని అభిప్రాయపడింది. గతంలో సిజెఐగా పనిచేసిన బిఆర్ గవాయ్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా ఇప్పుడు సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఉన్నత స్థితికి చేరుకున్న కుటుంబాలు పదేపదే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడంపై

మిగతా 12లో..

## వివాదంగా త్రిభాషా విధానం

- మూడు భాషలు తప్పనిసరి చేయడంపై సవాల్
- సుప్రీంలో ప్రజాప్రయోజన వాజ్యం దాఖలు

న్యూఢిల్లీ,మే22(ప్రజాజ్యోతి): సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ తొమ్మిదో తరగతి విద్యార్థులకు మూడు భాషల బోధనను తప్పనిసరి చేస్తూ తీసుకువచ్చిన నూతన విద్యా విధానం ఇప్పుడు న్యాయ వివాదానికి దారితీసింది. బోర్డు తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల తరఫున దాఖలైన ఈ పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం విచారణకు

మిగతా 2లో..

## అగ్ని-1 బాలిస్టిక్ క్షిపణ పరీక్ష విజయవంతం

చాందీపూర్,మే22(ప్రజాజ్యోతి): స్వల్పశ్రేణి లక్ష్యాలను ఛేదించే అగ్ని-1 బాలిస్టిక్ క్షిపణ పరీక్ష విజయవంతమైంది. ఒడిశా తీరంలోని చాందీపూర్‌లోనున్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి వ్యూహాత్మక దళాల కమాండ్ (ఎస్ఎఫ్‌సీ) ఆధ్వర్యంలో శుక్రవారంనాడు ఈ క్షిపణ పరీక్ష జరిగింది. ఉపరితలం నుంచి ఉపరితలం పైకి దాడి చేసే స్వల్పశ్రేణి బాలిస్టిక్ క్షిపణి పరీక్షను ఎస్ఎఫ్‌సీ విజయవంతంగా ప్రయోగించినట్టు రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పరీక్షతో అన్ని కార్యాచరణ,

మిగతా 2లో..






# 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

- తెలంగాణ వృద్ధి రేటు 10.7 శాతం
- దేశ సగటు కంటే వేగంగా వృద్ధి రేటు
- పట్టణీకరణతో సేవల రంగానికి భారీ అవకాశాలు
- విద్యార్థుల రుణాలు భవిష్యత్ పెట్టుబడులు
- రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు వడ్డీ లేని రుణాలు
- బ్యాంకర్ల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలి
- వ్యవసాయాధార పరిశ్రమలకు రుణాలు పెంచాలి
- సంప్రదాయ వ్యవసాయ రునాలకే పరిమితం కారాదు
- బ్యాంకర్ల సమావేశంలో మంత్రి తుమ్మల సూచన



హైదరాబాద్,మే22(ప్రజాజ్యోతి): సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మహిళా సాధికారత, మూసీ పునరుజ్జీవంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతలను ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శుక్రవారం మహాత్మాజ్యోతి రావు ఫూలే ప్రజాభవన్ లో జరిగిన 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ బ్యాంకర్ల సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ దాన కిషోర్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఫైనాన్స్ - ఎ÷-లానింగ్ సెక్రెటరీ గౌరవ్ ఉప్పల్, ఆర్బీఐ రీజనల్ డైరెక్టర్ చిన్మయ మోహన్, ఎస్బీఐ

మిగతా 2లో..

## తెలంగాణ విద్యా రంగంలో సంచలనం

**విద్యా కమిషన్ ఛైర్మన్ పదవికి ఆకునూరి మురళి రాజీనామా**

**విద్యారంగంలో అనేక మార్పులు సూచిస్తూ నివేదిక**

**అంతలోనే రాజీనామా చేయడంపై సర్వత్రా చర్చ**



హైదరాబాద్,మే22(ప్రజాజ్యోతి): తెలంగాణ విద్యా రంగంలో సంచలనం చోటుచేసుకుంది. రాష్ట్ర విద్యా కమిషన్ ఛైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తన పదవికి రాజీనామా చేశారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకు రావాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను ఈ కీలక బాధ్యతల్లో నియమించింది. అయితే, తన పదవికి నాలుగు నెలల ముందుగానే రాజీనామా లేఖను ప్రభుత్వానికి సమర్పించడం రాష్ట్ర రాజకీయ, విద్యా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ

మిగతా 12లో..

## అదనపు ఆదాయ వనరుల పెంపుపై

# దృష్టి పెట్టండి

లీకేజీలను అరికట్టి, బడ్జెట్ లక్ష్యాలను అందుకోవాలి

**క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



హైదరాబాద్,మే22(ప్రజాజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పురోగతిని పరుగులు పెట్టించేందుకు, ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అవసరాలకు అనుగుణంగా అదనపు ఆదాయ వనరులను సమకూర్చుకోవడంపై అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన 'రిసోర్స్ మొబిలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ' ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ కీలక భేటీకి కమిటీ సభ్యులైన నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అదనపు ఆదాయ మార్గాల అన్వేషణ, వివిధ శాఖల ప్రగతిపై మంత్రుల బృందం అధికారులతో

మిగతా 2లో..

**డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్‌లో రోల్ మోడల్ గా**

# తెలంగాణ

**పౌర సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా 'కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్'**

**ఇన్నోవేషన్స్, టాలెంట్, ఎకనామిక్ గ్రోత్ ను అనుసంధానించేలా 'ఎకో సిస్టం'**

**'డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ ఫైనాన్స్ సమ్మిట్ 2026'లో మంత్రి శ్రీధర్ బాబు**




హైదరాబాద్,మే22(ప్రజాజ్యోతి): డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఇందులో భాగంగా... ప్రభుత్వ పౌర సేవల్ని మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా ప్రజల ముంగిటకే చేర్చేలా ఒక ప్రత్యేక కాంప్రహెన్సివ్ రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. దిఇన్స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఆధ్వర్యంలో శుక్రవారం నోవాటెల్ హెచ్ఐసీసీలో నిర్వహించిన 'డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ ఫైనాన్స్ సమ్మిట్ 2026'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

మిగతా 12లో..

## పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల కారణం

**ఆయిల్ మార్కెట్‌లో ప్రమాదకరమైన 'రెడ్ జోన్'**

న్యూఢిల్లీ,మే22(ప్రజాజ్యోతి): పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ప్రపంచ ఆయిల్ మార్కెట్ త్వరలో తీవ్ర ప్రమాదకరమైన 'రెడ్ జోన్'లోకి ప్రవేశిస్తుందని ఇంటర్‌నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ చీఫ్ ఫాతిహ్ బిరోల్ హెచ్చరించారు. హోర్ముజ్ జలసంధి మూసివేత భయాలు, వేసవి కాలంలో పెరగనున్న డిమాండ్ కారణంగా క్రూడ్ ఆయిల్ సప్లై స్తంభించి.. ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ ఆయిల్ సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని అన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఆయిల్, గ్యాస్ కొరత ఏర్పడ్డ సంగతి తెలిసిందే. రోజు రోజుకు సమస్య తీవ్రతరం అవుతోంది. యుద్ధం కారణంగా పశ్చిమాసియాలో ఆయిల్, గ్యాస్ ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది.

మిగతా 2లో..

# సంపాదకీయం

## వ్యవసాయం ఈజీ.. ధాన్యం అమ్మడం కష్టం

తెలుగు రాష్ట్రాల్లో ధాన్యం కొనుగోళ్లు,తరలింపు ప్రహసనంగా మారింది. కల్లాల్లో రైతుల దీనస్థితి టీవీల్లో కనిపిస్తున్నా, పత్రికల్లో వార్తలుగా వస్తున్నా..ప్రభుత్వాల్లో చలనం కానరావడం లేదు. పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్న పాలకులకు సామన్య రైతుల వేదన కనిపించడం లేదు. ఎవరు పాలనలో ఉన్నా ఇదే దుస్థితి ఉంది. తమ హయాంలో గొప్పగా చేశామని చెప్పుకుంటున్న బిఆర్ఎస్ హాయంలోనూ ఇవే దృశ్యాలు కనిపించాయి. రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయడం ప్రభుత్వాల బాధ్యత. లేదా ఏ పంటను కొంటారో చెప్పి అవే పంటలను పండించేలా ప్రణాళికలు సిద్దం చేయాలి. కానీ అలా జరగడం లేదు. కెసిఆర్ హయాంలో వరేస్తే ఉరే అంటూ చెప్పిన మాటలను అప్పుడే మర్చిపోతే ఎలా. దీనికి కెటిఆర్ సమాధానం చెప్పాలి. కానీ ప్రభుత్వంపై నిందలు మోపడం తప్ప గ్రామాలకు వెళ్లి, ప్రభుత్వాన్ని ఒప్పించి కొనుగోళ్లు చేయించే పాత్రను ప్రతిపక్షం తీసుకోవడం లేదు. ఇకపోతే ఇప్పుడేమో మంత్రులు చెప్పేదొకటి గ్రామాల్లో కనిపిస్తున్నదొకటి. వర్షాకాలం దగ్గర పడడంతో పాటు, అకాల వర్షాలతోనూ రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల కల్లాల్లో ధన్యం తడిసి కొట్టుకుపోయింది. రోజులతరబడి కొనుగోలు కేంద్రాల్లో రాత్రనక పగలనకా గోస పడుతున్నా.. అధికారులు కనికరిస్తలేరని అన్నదాతలు ఆవేదన చెందుతున్న తీరును ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఈ దేశంలో రైతులంటే అందిరికీ చులకనగా మారింది. ధాన్యం సేకరణపై ఇటీవల సిఎం రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్షించారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. ధాన్యం కాంటా వేయడం లేదు. వేసిన ధాన్యం లారీలకు ఎక్కడం లేదు. లారీలకు ఎక్కేవరకు రైతులే కాపలాగా ఉండాల్సి వస్తోంది. ఆరుగాలం కష్టించి పండించిన పంటను అష్టకష్టాలు పడి కొనుగోలు కేంద్రాలకు తెస్తే రోజుల తరబడి వేచి చూసేలా చేయడం పాలకుల వైఫల్యం తప్ప మరోటి కాదు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పక్కా ప్రణాళిక లేకపోవడమే ఈ దుస్తితికి కారణం. ఇకపోతే తెచ్చిన ధాన్యం అకాల వర్షాలకు ఎక్కడ తడుస్తుందోనని ఆందోళన చెందుతున్నరు. మరోవైపు తాలు, తడిసిందన్న కారణాలతో రకరకాల కొర్రీలు పెడుతూ నిలుపు దోపిడీ చేస్తున్న తీరు ఏ గ్రామం వెళ్ళినా కనిపిస్తుంది. కొనుగోలు కేంద్రంలో యంత్రాల కోసం గొడవలు, సీరియల్ నంబర్, వంతుల పేరిట నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక పండిన ధాన్యం రోడ్డుపైన ఆరబెట్టేందుకు ఉదయం రోడ్డుపై నేర్పుకోవాలి, సాయంత్రం టార్పాలిన్ కప్పి కాపలాకాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాలకు తడుస్తున్న వడ్లు మొలకెత్తుతుంది. కొనేటప్పుడు ఏం పరిస్థితి ఉంటుందోననే భయం పట్టుకున్నది. తడిసిన వడ్లను కూడా ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాల్సిన బాధ్య ఉంది. ఇలాంటి కష్టాల వల్ల సన్నకారు రైతుల నడ్డి విరుగుతోంది. ఎప్పుడు కొనుగోలు చేస్తారోనన్న ఎదురుచూపులకే రోజులు గడిచిపోతున్నాయి. ఎప్పుడు వానొస్తదో తెలియక భయంతో బతుకుతున్నారు. ముఖ్యంగా లారీలు రావడం లేదని ధాన్యం తరలించడం లేదు. చాలాచోట్ల కడుపు మండిన రైతులు రోడ్డెక్కుతున్నరు. తెచ్చిన ధాన్యం కాంటా వేసి, లారీల్లో తరలించే ఏర్పాట్లు చేస్తే ఈ దుస్థితి రాదు. తక్షణం ప్రభుత్వం స్పందించి ఒకటి,రెండు రోజుల్లో అన్‌లోడ్ చేయించేలా చర్యలు తీసుకోవాలి. లారీలు, హమాలీల కొరత కారణంగా రవాణాలో జాప్యం జరుగుతున్నది. ప్రజాప్రతినిధులు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదు. ధాన్యం అమ్ముకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులను పాలకపక్ష నేతలు పరామర్శించడం లేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు. వర్షం పడితే ధాన్యం తడిసిపోతుంది. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయకపోవడంతో ఎండలో ఆరబోస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తూకం వేసిన గన్నీ బస్తాలు ఉండటం లేదు. లారీలు సకాలంలో రావడం లేదు. దీంతో ధాన్యం మిల్లులకు తరలించే వరకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నరు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. లారీల సమస్య తీవ్రంగా ఉన్నదని, అదనంగా డబ్బులు ఇవ్వాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు చెప్తున్నారు. ఈ యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లలో అడుగడుగునా రవాణా కష్టాలు నిత్యం ఎదురవుతున్నాయి. హమాలీలు అందుబాటులో లేకపోవడంతో పాటుగా లారీల కొరత వేధిస్తుండటంతో కల్లాల్లో ధాన్యం నిలిచి పోతుంది. రోజుల తరబడి వేచి చూస్తే కానీ ధాన్యం అమ్ముకునే పరిస్థితి లేకుండా పోయింది. దొడ్డు ధాన్యాన్ని దించుకునేందుకు రైస్ మిల్లర్లు తీవ్రంగా సతాయిస్తున్నారు. నాలుగైదు కిలోలు తరుగు పేరిట దోచేస్తున్నారు. లేదంటే లారీల్లోని ధాన్యం సంచులు దించుకునేందుకు ససేమిరా అంటున్నారు. లారీల యజమానులు సైతం సంచికి రూ.4వరకు వసూళ్లకు పాల్పడుతున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైస్ మిల్లర్లకు తోడుగా పీఏసీఎస్ సెంటర్లలో సహకార సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రైతులను నిలువునా ముంచేస్తున్నారు. ధాన్యం తరలించడంలో జాప్యం జరుగుతుండటం తో రైతులు రోడ్డు ఎక్కి ఆందోళనలు చేయాల్సి వస్తోంది. ఎక్కడ చూసినా గన్నీ సంచులు లేవని, లారీలు వస్తలేవని మక్కలు కాంటా వేస్తలేరని రైతులు వాపోతున్నారు. కాంటా పెట్టాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. గన్నీ సంచులు లేవు మీరే కొనుక్కోవాలని అంటున్నారు. రైతులకు ఇది జీవన్మరణ సమస్యగా మారింది. ప్రభుత్వం వెంటనే దీనిపై దృష్టి సారించాలి. కలెక్టర్లు కూడా పెద్దగా పట్టించుకోవడం లేదని పరిస్థితులు చెబుతున్నాయి. ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తారన్నది పాలకుల చిత్తశుద్ధిపై ఆధారపడి ఉంది.

## వివాదంగా త్రిభాషా విధానం

మొదటిపేజీ తరువాయి..



స్వీకరించింది. ఈ వ్యవహారాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ప్రస్తావించారు. విద్యా సంవత్సరం మధ్యలో అకస్మాత్తుగా తొమ్మిదో తరగతి నుంచి మూడు భాషలను తప్పనిసరి చేయడం వల్ల విద్యార్థులపై తీవ్రమైన మానసిక, విద్యాపరమైన భారం పడుతుందని రోహత్గి కోర్టుకు వివరించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న విద్యా విధానానికి ఇది పూర్తిగా భిన్నంగా ఉందని, దీనివల్ల అటు విద్యార్థుల్లో, ఇటు విద్యాసంస్థల్లో తీవ్ర గందరగోళం నెలకొందని ఆయన పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై త్వరితగతిన విచారణ జరపాలని ఆయన ధర్మాసనాన్ని అభ్యర్థించారు. జాతీయ విద్యా విధానం (ఔఇఖ) సిఫార్సుల మేరకు సీబీఎస్ఈ విద్యా చట్రంలో మార్పులు చేస్తూ,9, 10 తరగతుల్లో విద్యార్థులు కచ్చితంగా మూడు భాషలను అందులో రెండు భారతీయ భాషలను చదవాలనే నిబంధనను తీసుకు వచ్చింది. అయితే, తగిన ముందస్తు ప్రణాళిక లేకుండా, కోర్సుల మధ్యలో ఈ నిబంధనను రుద్దడం సమంజసం కాదని పిటిషనర్లు వాదిస్తున్నారు. ఈ వాదనలను పరిశీలించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం, ఈ పిటిషన్‌పై వచ్చే వారం సమగ్ర విచారణ జరిపేందుకు అంగీకారం తెలిపింది. ఈ విచారణపై దేశవ్యాప్తంగా ఉన్న సీబీఎస్ఈ పాఠశాలలు, విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఉత్కంఠ నెలకొంది.

## అదనపు ఆదాయ వనరుల పెంపుపై

# దృష్టి పెట్టండి

మొదటిపేజీ తరువాయి..

కలిసి లోతుగా సమీక్షించింది. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించనున్న బ్జడెట్ అంచనాలకు అనుగుణంగా నిధుల సమీకరణ జరగాలని స్పష్టం చేశారు. బడ్జెట్ లక్ష్యాలను చేరుకోవడానికి అధికారులు లీకేజీలను పూర్తిగా అరికట్టాలని, అందుబాటులో ఉన్న అన్ని రకాల ఆదాయ వనరులను పూర్తి స్థాయిలో అందిపుచ్చుకోవాలని ఆదేశించారు. ముందస్తుగా నిర్దేశిరచుకున్న టైమ్ లైన్ ప్రకారమే అన్ని శాఖల అధికారులు ఆదాయాన్ని పెంపొందించేందుకు శ్రమించాలని స్పష్టం చేశారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ఈ సమావేశం ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖల ఉన్నతాధికారులు తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరు కావాలన్నారు. అనివార్య కారణాలవల్ల ఈ సమావేశానికి రానటువంటి వారు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరవ్వాలని ఆదేశించారు. రాష్ట్ర ఖజానాకు గండి కొడుతున్న అక్రమార్కులపై కఠినంగా వ్యవహరించాలని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధికారులను అధికారులను ఆదేశించారు . రాష్ట్ర క్యాబినెట్ గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు.. మే 28 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సవరించిన భూముల మార్కెట్ విలువలు అమలులోకి రానున్నాయని అధికారులు ఈ సమావేశం లో మంత్రుల బృందానికి వివరించారు. దీని ద్వారా రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అలాగే పరిశ్రమల శాఖకు సంబంధించిన 'హిల్ట్ పాలసీ గైడ్‌లైన్స్' సిద్ధమయ్యాయని, వీటికి సంబంధించిన ఉత్తర్వులు తక్షణమే వెలువడనున్నాయని అధికారులు వెల్లడించారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ , పరిశ్రమలు, రిజిస్ట్రేషన్లు, మైనింగ్, రెవెన్యూ, రవాణా తదితర కీలక శాఖలలో ప్రస్తుత వనరుల పురోగతి, రాబోయే రోజుల్లో సాధించాల్సిన ఆదాయ లక్ష్యాలపై మంత్రుల బృందం అధికారులకు దిశా నిర్దేశర చేసింది. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, ఆర్ అండ్ బి స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ÷నాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, మైన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, రెవిన్యూ సెక్రటరీ లోకేష్ కుమార్, టీజీఐఐసీ వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

# 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి..

సీజీఎం నీలేష్ ద్వివేది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. 20147 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా నిలిపేందుకు ప్రజా ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని డిప్యూటీ సీఎం స్పష్టంగా చెప్పారు. రాష్ట్రంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు దాదాపు రూ.9.43 లక్షల కోట్లకు చేరుకోవడం, అడ్వాన్సులు రూ.12.34 లక్షల కోట్లకు చేరుకోవడం గొప్ప విషయమని చెప్పారు. రాష్ట్రం 130.78 శాతం క్రెడిట్-డిపాజిట్ నిష్పత్తితో ముందుకు సాగడం అద్వితీయ విషయని ఆయన చెప్పారు. వ్యవసాయ రుణాల విషయంలో లక్ష్యాలను మించి బ్యాంకులు రుణాలు ఇవ్వడం సంతోషకరమని అన్నారు. రూ.1,65,297 కోట్ల లక్ష్యానికి గాను రూ.1,68,401 కోట్ల వ్యవసాయ రుణాలు పంపిణీ చేసి 101.88 శాతం సాధించడం గర్వించదగ్గ విషయంగా చెప్పారు. వ్యవసాయం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. రైతులు, పాడి రైతులు, మత్స్యకారులు మరియు అనుబంధ రంగాలకు కిసాన్ క్రెడిట్ కార్డు సహా వివిధ పథకాల ద్వారా బ్యాంకులు అందిస్తున్న మద్దతు అభినందనీయం అని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం పారిశ్రామిక రంగంలో దేశంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటని డిప్యూటీ సీఎం చెప్పారు. ఈ నేపథ్యంలో బ్యాంకులు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మహిళ, దళిత, గిరిజన యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీపై బ్యాంకులు మరింత దృష్టి పెట్టాలని అన్నారు. విద్యార్థులకు ఇచ్చే రుణాల విషయంలో బ్యాంకులు మరింత సానుకూల దృక్పథంతో ముందుకు రావాలని ఆయన చెప్పారు. విద్యార్థులకు ఇచ్చే రుణాలు యువతపై మనం పెట్టే భవిష్యత్ పెట్టుబడి అని ఆయన చెప్పారు. సంక్షేమం-అభివృద్ధి విక్రమార్క తెలిపారు. తెలంగాణలో వేగంగా పట్టణీకరణ జరుగుతోందని అన్నారు. ఈ నేపథ్యంలో సేవల రంగాని అధిక అవకాశాలు ఉంటాయని ఆయన చెప్పారు. హిళా ఆర్థిక సాధికారత కోసం రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల వడ్డీ లేని రుణాలు రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచుతున్నట్లు ఈ సందర్భంగా చెప్పారు. ఈ సంవత్సరం హైదరాబాద్ నగరంలో మహిళా సంఘాలకు రుణ పంపిణీ యుద్ధప్రాతిపదికన దృష్టి సారించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. హైదరాబాద్ నగరం మహిళలకు వ్యాపార రంగంలో, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల్లో ఎదగడానికి ఎన్నో అవకాశాలను ఇస్తోందని చెప్పారు. నగరంలోని మురికివాడల్లోని యువ మహిళా పారిశ్రామికవేత్తలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో త్వరలోనే అనేక ఇండస్ట్రియల్ హబ్‌లు, క్లస్టర్లను తీసుకువస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇందులో భాగంగా ఫార్మా, ఫ్యాబ్ సిటీ, స్టీల్, లెదర్, టెక్స్‌టైల్ వంటి వివిధ రంగాలను డిజైన్ చేస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు.

తెలంగాణ రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో బ్యాంకులు చురుకైన భాగస్వాములు కావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రజా భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. బ్యాంకర్లు కేవలం సాంప్రదాయ పంట రుణాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి రుణాల పంపిణీని భారీగా పెంచాల్సిన అవసరం ఉందని




రెండింటిని జోడెడ్లుగా పరుగులు తీయగలవని ప్రజాప్రభుత్వం చేతల్లో నిరూపించిందని అన్నారు. సమగ్రాభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, ఉపాధి సృష్టి పట్ల మా ప్రభుత్వం కట్టుబడి ఉందని మరోసారి ఆయన పునరుద్ఘాటించారు. నేడు ప్రపంచమంతా పునరుత్పాదక ఇంధనరంగంపై దృష్టి సారిస్తోందన్నారు. అందులో భాగంగా ప్రజాప్రభుత్వం కూడా సౌరశక్తి విభాగంలోస్థిరమైన ప్రగతిని సాధిస్తోందన్నారు. సౌరశక్తి ప్రాజెక్టులు, రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు మరియు ఇతర పర్యావరణ అనుకూల కార్యక్రమాలకు బ్యాంకులు చురుగ్గా రుణ సహాయం అందించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. సామాజిక భద్రత,
బీమా పథకాల పరిధిలోకి రాష్ట్ర ప్రజలను తీసుకురావాలన్నారు. బ్యాంకులు కేవలం డబ్బు డిపాజిట్ చేసే, రుణాలు ఇచ్చే ఆర్థిక సంస్థలుగానే కాకుండా, రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధి భాగస్వాములుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రజల డబ్బు అంతా బ్యాంకులకే చేరుతుంది, కాబట్టి ఆ నిధులను ఏ రంగాల అభివృద్ధికి రుణాలుగా ఇస్తున్నామనేది చాలా ముఖ్యం. రాష్ట్ర ఆర్థిక వృద్ధికి, ఉపాధికి ఏ రంగం ఎక్కువ దోహదపడుతుందో ఆలోచించి బ్యాంకులు వ్యూహాత్మకంగా రుణాలు అందించాలన్నారు.

ప్రజాప్రభుత్వం 2047 ఆర్థిక సంవత్సరం నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది పెద్ద కల. తెలంగాణ ప్రస్తుత వృద్ధి రేటు చూస్తుంటే ఇది ఖచ్చితంగా సాధ్యమేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశ సగటు వృద్ధి రేటు 8.2? గా ఉంటే, తెలంగాణ వృద్ధి రేటు 10.7 శాతంతో దూసుకుపోతోందని చెప్పారు. దేశ సగటు తలసరి ఆదాయం ?2.1 లక్షలుగా ఉంటే, తెలంగాణ తలసరి ఆదాయం ?4.18 లక్షలతో దేశంలోనే అగ్రగామిగా ఉందని ఉప ముఖ్యమంత్రి గర్వంగా ప్రకటించారు. తెలంగాణ ప్రజాప్రభుత్వం మూసీ నది పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం అత్యంత వేగంగా పూర్తి చేయడంకూడా ప్,ధాన లక్ష్యాలుగా నిర్దేశిరచుకుని ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి స్పష్టం చేశారు. గ్రామీణ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ఇదే సరైన సమయమని, ఈ అవకాశాన్ని బ్యాంకులు ఉపయోగించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణలో క్రెడిట్-డిపాజిట్ నిష్పత్తి రికార్డు స్థాయిలో 130.78 శాతం నమోదు కావడం గొప్ప విశేషం అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో బ్యాంక్ డిపాజిట్లు రూ.9.43 లక్షల కోట్లుగా ఉంటే, అడ్వాన్సులు (రుణాలు) రూ.12.33 లక్షల కోట్లకు చేరాయి. వ్యవసాయ రంగానికి రుణాల పంపిణీలో రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని సాధించింది. నిర్ణీత లక్ష్యం కంటే ఎక్కువగా 102 శాతం ప్రగతిని నమోదు చేయడం హర్షణీయం.

రాష్ట్రంలో పంట రుణాల పంపిణీ రూ.75,486 కోట్లకు చేరిందని, వ్యవసాయ రంగానికి మొత్తంగా రూ.1.68 లక్షల కోట్ల రుణాలను బ్యాంకులు అందజేశాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో రుణ సంస్కృతి తిరిగి పునరుద్ధరించబడింది. ప్రభుత్వ నిర్ణయాల వల్ల బ్యాంకులలో వ్యవసాయ నిరర్ధక ఆస్తులు 5.23 శాతం నుంచి 4.71 శాతానికి తగ్గాయి. తెలంగాణలో ఉద్యానవన రంగంతో పాటు ఆయిల్ పామ్ సాగుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని మంత్రి అన్నారు. ఈ రంగాలకు బ్యాంకులు పెద్దపీట వేయాలి. పంట నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు, సైలోల నిర్మాణానికి బ్యాంకులు ఉదారంగా రుణాలు ఇవ్వాలి. అలాగే రాష్ట్రంలో ఉన్న దాదాపు వెయ్యి రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు తగిన ఆర్థిక మద్దతు అందించాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉంది. వ్యవసాయాన్ని ఆధునీకీకరించేందుకు, యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు గానూ ప్రభుత్వం రూ.147.91 కోట్ల బ్జడెట్‌ను కేటాయించింది. కౌలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో పంట రుణాలు అందేలా బ్యాంకులు బాధ్యత తీసుకోవాలి. వీటితో పాటూ పర్యావరణ హితమైన సోలార్ వ్యవసాయం, మైక్రో ఇరిగేషన్ పద్ధతులకు రుణ సదుపాయాన్ని గణనీయంగా పెంచాలని మంత్రి తెలిపారు.

## నేడు యాదగిరిగుట్టకు సీఎం రేవంత్

మొదటిపేజీ తరువాయి..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన షెడ్యూల్ విడుదలైంది. శనివారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్ బేగంపేట నుంచి హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టకు సీఎం రేవంత్ రెడ్డి బయలుదేరుతారు. అనంతరం 9:15 గంటలకు ప్రతిపాదిత వేద పాఠశాల స్థలానికి చేరుకుంటారు. 9:15 నుంచి 9:45 మధ్య వేద పాఠశాలకు భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొంటారు. సరిగ్గా ఉదయం 9:37 గంటలకు ఎస్ఎల్ఎన్ఎస్‌డీ వేద పాఠశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. 9:50కు వేద పాఠశాల స్థలం నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి బయలుదేరుతారు రేవంత్ రెడ్డి. 10 గంటలకు దేవాలయానికి చేరుకుంటారు. 10 నుంచి 10:30 వరకూ స్వామివారిని దర్శించుకుంటారు. 10:30కు ప్రెసిడెన్షియల్ సూట్‌కు బయలుదేరి 10:40కి అక్కడికి చేరుకుంటారు. దయం 10:40 నుంచి 11 గంటల వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశ్రాంతి తీసుకుంటారు. 11 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 11:10కి హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అనంతరం 11:15కు యాదగిరిగుట్ట నుంచి హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు.

## కేంద్రానికి ఆర్‌బిఐ శుభవార్త

మొదటిపేజీ తరువాయి..

చెల్లిస్తుంది. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చిత పరిస్థితుల్లో ప్రభుత్వానికి ఈ మొత్తం ఊరట కల్పించే అంశం. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు డైరెక్టర్లు నిర్వహించిన 623వ సమావేశంలో డివిడెండ్ చెల్లింపులపై నిర్ణయం తీసుకున్నారు. ఈ స్థాయిలో డివిడెండ్ చెల్లించడం ఇదే తొలిసారి. దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, భయాందోళనల ముప్పును సమీక్షించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్‌బీఐ ఓ ప్రకటనలో పేర్కొంది. దేశ, విదేశీ సెక్యూరిటీలపై వడ్డీ, సేవలపై రుసుములు, కమీషన్లు, విదేశీ మారకపు ద్రవ్యం లావాదేవీలపై లాభం, అనుబంధ సంస్థల నుంచి ప్రతిఫలం రూపేణ ఆర్‌బీఐకు ఆదాయం లభిస్తుంది. కరెన్సీ నోట్ల ముద్రణ, డిపాజిట్లు-రుణాలపై వడ్డీల చెల్లింపులు, సిబ్బంది జీతభత్యాలు-పింఛన్లు, కార్యాలయాల నిర్వహణ ఖర్చులు, ఆకస్మిక పరిస్థితులు- తరుగుదలకు కేటాయింపులు వంటి వ్యయాలు ఉంటాయి. ఈ ఆదాయ, వ్యయాల మధ్య తేడానే మిగులు నిధులుగా వ్యవహరిస్తారు. ఈ మిగులు నిధులను కేంద్రానికి ఏటా బదిలీ చేస్తుంది. ఆర్‌బీఐ, ప్రభుత్వ రంగ బ్యాంకుల డివిడెండ్ల రూపంలో ఖజానాకు రూ.3.16 లక్షల కోట్లు సమకూరుతాయని బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేసింది.

## పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల కారణం

మొదటిపేజీ తరువాయి..

అంతేకాదు.. ప్రపంచ వ్యాప్తంగా 20 శాతం నౌకలు ఆయిల్, గ్యాస్ రవాణా చేసే హోర్ముజ్ జలసంధి కూడా మూతపడింది. అమెరికా-ఇరాన్ యుద్ధం, హోర్ముజ్ జలసంధి మూత పడటం కారణంగా ప్రపంచ మార్కెట్‌లో ప్రతీరోజూ 13 నుంచి 14 మిలియన్ బ్యారెళ్ల క్రూడ్ ఆయిల్ సప్లై నిలిచిపోయిందని ఇంటర్ నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ చీఫ్ ఫాతిహ్ బిరోల్ తెలిపారు. హోర్ముజ్‌ను మళ్లీ తెరవకపోవటం.. నౌకలు ప్రయాణించడానికి ప్రత్యామ్నాయ దారులు లేకపోవటంతో సప్లై మరింత దారుణంగా పడిపోయిందని బిరోల్ అన్నారు. సప్లై నిలిచిపోవటం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఆయిల్ నిల్వలు వేగంగా కరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మార్చి నెలలో ఐఈఏ, 32 సభ్య దేశాలు కలిసి మార్కెట్లోకి విడుదల చేసిన రికార్డు స్థాయి 400 మిలియన్ బ్యారెళ్ల అత్యవసర చమురు నిల్వలు కూడా పూర్తిగా హరించుకుపోయాయని ఆయన పేర్కొన్నారు.

## అగ్ని-1 బాలిస్టిక్ క్షిపణ పరీక్ష విజయవంతం

మొదటిపేజీ తరువాయి..

సాంకేతిక పరిమితులను విజయవంతంగా ధ్రువీకరించినట్టు పేర్కొంది. గత ఏడాది జూలైలోనూ ఇదేతరహా పరీక్షను డీఆర్‌డీఓ విజయవంతంగా నిర్వహించింది. ఈ క్షిపణి 700 నుంచి 1,200 కిలోమీటర్ల లక్షాలను సునాయాసంగా ఛేదించగలదు. అణ్వాయుధాలను మోసుకెళ్లే శక్తివంతమైన క్షిపణిగా దీనిని డీఆర్‌డీఓ అభివృద్ధి చేసింది. కాగా, ఈనెల మే 8న అడ్వాన్స్ అగ్ని మిజైల్‌ను ఒడిస్సాలోని అబ్దుల్ కలాం ఐలాండ్ నుంచి ఇండియా విజయవంతంగా పరీక్ష చేసింది. మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టా÷-గ్గ÷టెడ్ రీ-ఎంట్రీ వెహికల్ సిస్టమ్ (ఎంఐఆర్‌వీ)తో ఈ క్షిపణి పరీక్ష నిర్వహించారు.

## సింగరేణిలో మండుతున్న ఎండలు..

### కార్మికుల కష్టాలు మరింత తీవ్రం

- పనివేళలు మార్చి మజ్జిగ, ఓఆర్ఎస్ పంపిణీ చేయాలి
- టీజీబీకేఎస్ కన్వీనర్ కెంగర్ల మల్లయ్య

**మంచిర్యాల, 22, మే (ప్రజా జ్యోతి) :** రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా సింగరేణి కార్మికుల ప్రాణాలను కాపాడేందుకు వెంటనే పనివేళల్లో మార్పులు చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సమాఖ్య (టీజీబీకేఎస్) కన్వీనర్ కెంగర్ల మల్లయ్య సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, ఉమ్మడి సింగరేణి జిల్లాల్లో ముఖ్యమంత్రి స్వయంగా రెడ్ అలర్ట్ ప్రకటించినప్పటికీ యాజమాన్యం కార్మికుల ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని విమర్శించారు.రాష్ట్ర వ్యాప్తంగా వడదెబ్బ కారణంగా ఇప్పటికే 27 మంది మరణించారని, ఇటువంటి తీవ్ర పరిస్థితుల్లో ఓపెన్‌కాస్ట్ గనుల్లో కార్మికులు ఎనిమిది గంటల పాటు నిప్పుల కొలిమిలో పనిచేయాల్సి రావడం ఆందోళనకరమని అన్నారు. ముఖ్యంగా మొదటి, రెండో షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తు న్న కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని అన్నారు. కార్మికుల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని మొదటి, రెండో షిఫ్ట్‌ల పనివేళలను కనీసం రెండు గంటలు మార్చాలని ఆయన సూచించారు. అలా చేయడం వల్ల సంస్థకు ఎలాంటి నష్టం ఉండదని, పైగా కార్మికులు ఆరోగ్యంగా ఉంటే మరింత ఉత్సాహంతో పనిచేసి అధిక ఉత్పత్తి సాధించగలరని తెలిపారు. సర్ఫేస్ మరియు అండర్‌గ్రౌండ్ కార్మికులందరికీ వెంటనే మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ అందించడంతో పాటు గనుల ప్రాంతాల్లో చలువ పందిర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎండల నుంచి ఉపశమనం కల్పిస్తే కార్మికులు రెట్టించిన ఉత్సాహంతో పనిచేసి సంస్థకు మరింత లాభాలు తీసుకువస్తారని తెలిపారు. కార్మికుల ఆరోగ్యం విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించిన కెంగర్ల మల్లయ్య, ఎండల కారణంగా కార్మికులకు ఏదైనా అపాయం జరిగితే దానికి పూర్తి బాధ్యత సింగరేణి యాజమాన్యమే వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వెంటనే యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి కార్మికులకు రక్షణ చర్యలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సిపిఆర్ఎంఎస్ కార్డుల పరిమితి పెంచాలి

- సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్



**మంచిర్యాల, 22, మే (ప్రజాజ్యోతి) :** సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సిపిఆర్ఎంఎస్ మెడికల్ కార్డుల పరిమితిని పెంచాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలోని సంస్థల్లో సేవలందించి విశ్రాంతి పొందిన సింగరేణి ఉద్యోగులు, వారి జీవిత భాగస్వాములకు సింగరేణి యాజమాన్యం ఒప్పందం చేసుకున్న ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల్లో జీవితాంతం 8 లక్షల వరకు మాత్రమే వైద్య సౌకర్యం కల్పిస్తోందని తెలిపారు. అయితే ప్రస్తుత పెరిగిన వైద్య ఖర్చులకు ఈ పరిమితి ఏమాత్రం సరి పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర రోడ్ రవాణా సంస్థ విశ్రాంత ఉద్యోగుల మెడికల్ కార్డు పరిమితిని 4 లక్షల నుంచి 6 లక్షలకు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అన్-స్కిల్డ్, స్కిల్డ్ కార్మికుల వేతనాలను కూడా పెంచిన నేపథ్యంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సిపిఆర్ఎంఎస్ కార్డు పరిమితిని కూడా పెంచాలని కోరారు.సింగరేణి అధికారుల సిపిఆర్ఎంఎస్ కార్డు పరిమితి 25 లక్షల వరకు ఉండగా, కార్మికులకు మాత్రం 8 లక్షల పరిమితి మాత్రమే ఉండటం అన్యాయమని వేణుమాధవ్ అన్నారు. పెరుగుతున్న వైద్య ఖర్చులను దృష్టిలో ఉంచుకొని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల మెడికల్ కార్డు పరిమితిని గణనీయంగా పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, సింగరేణి యాజమాన్యాన్ని ఆయన విజ్ఞప్తి చేశారు.

## దళిత వర్గాల ఉన్నతికి పాటుపడిన గొప్ప వ్యక్తి మాదరి భాగ్యరెడ్డి వర్మ

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా







**నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 22, (ప్రజాజ్యోతి) :** జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో భాగ్యరెడ్డి వర్మ 138 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్, పలువురు అధికారులతో కలిసి భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమాజంలోని అసమానతలను తొలగించేందుకు జీవితాంతం పాటుపడిన గొప్ప వ్యక్తి భాగ్యరెడ్డి వర్మ అని అన్నారు. దళిత బాలికల కోసం నాటి నిజాం కాలంలోనే 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించారని గుర్తుచేశారు. కుల వివక్షత నిర్మూలన, మూఢనమ్మకాలపై చైతన్యం, దేవదాసీ వ్యవస్థ నిర్మూలన, మద్యపాన నిషేధం, బాలిక విద్యా, అనేక విషయాల్లో ప్రజలను చైతన్యం చేశారని గుర్తు చేశారు. ఆది హిందూ సోషల్ లీగ్ సంస్థను ఏర్పరిచి జాతుల మధ్య అంతరాలు తొలగించారని తెలిపారు. భాగ్యరెడ్డి వర్మ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నేటి యువత భాగ్యరెడ్డి వర్మను మార్గదర్శకంగా తీసుకోవాలని సూచించారు. సమాజంలో విశిష్ట మార్పులకు కృషిచేసిన మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలు ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయం అని చెప్పారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా గొప్ప వ్యక్తుల విశేషాలను నేటి తరాలకు అందించిన వారమఅవుతామని తెలిపారు. ఈ జయంతి వేడుకల్లో జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద్, ఈడి ఎస్సీ కార్పొరేషన్ శంకర్, బిసి, ఎస్టీ మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు శ్రీనివాస్, అంబాజీ, మోహన్ సింగ్, సిపిఓ జీవరత్నం, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, జిల్లా పౌర సంబంధాల అధికారి విష్ణువర్ధన్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నేరడిగొండలో బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్



**నేరడిగొండ, మే 22 (ప్రజాజ్యోతి) :** మండల కేంద్రమైన నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈరోజు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు గాను ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ క్యాంపులో మొత్తం 17 మంది బాలికలకు హెచ్‌పీవీ టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (హెచ్ ఈ ఓ) పవార్ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ పాల్గొని బాలికలకు, వారి తల్లిదండ్రులకు వ్యాక్సిన్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. బాలికల ఆరోగ్య రక్షణకు ఈ టీకా ఎంతో దోహదపడుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు రాణి, గంగామణి, అమ్మీబాయి, శ్యామల, సంగీతలతో పాటు ఆశా కార్యకర్తలు పాల్గొని వ్యాక్సినేషన్ ప్రక్రియను విజయవంతం చేశారు.

### ఆపదలో ఉన్న ప్రజలకు సీఎం సహాయనిధి ద్వారా

## అండగా నిలబడటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం





- ప్రభుత్వ విద్య బలోపేతానికి నిరంతర కృషి చేస్తున్నాం
- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు

**మంచిర్యాల, 22, మే (ప్రజాజ్యోతి):** ఆపదలో ఉన్న ప్రజలకు సీఎం సహాయనిధి ద్వారా అండగా నిలబడటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తూ వారి కుటుంబాలకు భరోసాగా నిలుస్తోందన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖతో కలిసి మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్, లక్సెట్టిపేట్, దండేపల్లి మండలాలకు చెందిన 61 మంది లబ్ధిదారులకు రూ.40 లక్షల 71 వేల 400 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు ప్రభుత్వం అండగా నిలవడం తమ బాధ్యత అని అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలుగుతోందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో చికిత్స పొందలేని కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంలా మారిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందు బాటులో ఉంటామన్నారు. అదేవిధంగా మంచిర్యాల నియోజకవర్గంలో ప్రభుత్వ విద్య బలోపేతానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్నీ మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య-మహేష్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు, మహిళా నాయకురాళ్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి నిర్మూలనకు ప్రజల సహకారం అవసరం





- మంచిర్యాల డిసిపి ఏ.భాస్కర్

**మంచిర్యాల, 22, మే (ప్రజా జ్యోతి):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్‌లో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజల సహకారం ఎంతో అవసరమని మంచిర్యాల డిసిపి ఏ. భాస్కర్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వం ఏర్పాటు చేసిన డి-అడిక్షన్ సెంటర్‌ను డిసిపి ఏ. భాస్కర్, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్ లు కలిసి సందర్శించారు. మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డి-అడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న యువకులతో మాట్లాడిన డిసిపి, వారి ఆరోగ్య పరిస్థితి, చికిత్స విధానం గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు బానిసలైన వారిని గుర్తించి నార్కోటిక్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వారిని గౌరవ కోర్టు ఆదేశాల మేరకు 15 రోజుల పాటు డి-అడిక్షన్ సెంటర్‌కు పంపిస్తున్నామన్నారు. అక్కడ వారికి వైద్య చికిత్సతో పాటు మానసిక మార్పు కోసం ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు మంచిర్యాల జోన్ పరిధిలో 19 మందికి నార్కోటిక్ పరీక్షలు నిర్వహించి, పాజిటివ్ వచ్చిన వారిని డి-అడిక్షన్ సెంటర్లకు తరలించినట్లు వివరించారు. గంజాయి సరఫరా చేసే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, అలాగే గంజాయి సేవించే వారిని గుర్తించి ఆ అలవాటు నుంచి దూరం చేస్తే సరఫరా కూడా తగ్గే అవకాశముందని డిసిపి పేర్కొన్నారు. తల్లిదండ్రులు, పెద్దలు తమ పరిసరాల్లో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నా లేదా సేవిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పోలీసులు స్పందించి నిందితులపై కేసులు నమోదు చేసి నార్కోటిక్ పరీక్షలు నిర్వహిస్తారని, పాజిటివ్ వచ్చిన వారిని డి-అడిక్షన్ సెంటర్లకు పంపించి చికిత్స అందిస్తామని తెలిపారు. చికిత్స అనంతరం కూడా మళ్లీ మత్తు పదార్థాలకు బానిసై పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుని జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. నిపుణులైన వైద్యుల సహాయంతో మత్తు బారిన పడిన వ్యక్తులు తిరిగి సాధారణ జీవితంలోకి వచ్చే అవకాశం ఉందని, డ్రగ్స్ రహిత మంచిర్యాల నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని డిసిపి ఏ. భాస్కర్ పిలుపునిచ్చారు.

### శిక్షణ పొందిన బాల బాలికలు భవిష్యత్తులో

## ప్రతిభావంతమైన క్రీడాకారులుగా తయారు కావాలి

- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి సింగరేణి సంస్థకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి
- శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్








**మంచిర్యాల, 22, మే (ప్రజా జ్యోతి):** శిక్షణ పొందిన బాల బాలికలు భవిష్యత్తులో ప్రతిభావంతమైన క్రీడాకారులుగా ఎదిగి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి సింగరేణి సంస్థకు, తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ ఆకాంక్షించారు.సింగరేణి యాజమాన్యం శ్రీరాంపూర్ ఏరియా ఆధ్వర్యంలో ఏప్రిల్ 25 నుంచి మే 20 వరకు నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ముగింపు కార్యక్రమం శుక్రవారం శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలోని సీఈఆర్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు. 25 రోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమాలు శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని ప్రగతి స్టేడియం, ప్రాణహిత స్టేడియం, మనోరంజన్ సముదాయంలో కొనసాగాయి. ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్, బాక్సింగ్ విభాగాల్లో మొత్తం 110 మంది బాల బాలికలకు ప్రత్యేక శిక్షణ అందించారు.ఈ సందర్భంగా 25 రోజుల శిక్షణ పూర్తి చేసిన చిన్నారులకు జీఎం మునిగంటి శ్రీనివాస్ చేతుల మీదుగా క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ,సింగరేణి సంస్థ ప్రతి సంవత్సరం వేసవి సెలవుల్లో కార్మికుల పిల్లలు సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తోందని తెలిపారు. శిక్షణ పొందిన విద్యార్థులు భవిష్యత్తులో ప్రతిభావంతమైన క్రీడాకారులుగా ఎదిగి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆకాంక్షించారు.

ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల వినోదం మరియు ఆరోగ్య పరిరక్షణ కోసం సింగరేణి సంస్థ ప్రతి ఏరియాలో పార్కులు, స్టేడియంలు, క్లబ్బులు, స్విమ్మింగ్ పూల్స్, జిమ్‌లు తదితర క్రీడా వసతులను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ఈ సౌకర్యాలను ఉద్యోగులు, కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌ఓ టు జీఎం ఎన్. సత్యనారాయణ, గుర్తింపు సంఘం నాయకుడు చంద్రమోహన్, డీజీఎం పర్సనల్ డాక్టర్ ఎస్. అనిల్ కుమార్, క్రీడల గౌరవ కార్యదర్శి కె. సృజన్ పాల్, స్పోర్ట్స్ సూపర్వైజర్ చాట్ల అశోక్, కోఆర్డినేటర్ సకినాల నర్సయ్య, ఇండోర్ కెప్టెన్ టి. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం ప్రచార ఆర్భాటాల్లో నెంబర్ వన్

- ప్రజల సంక్షేమంలో బిగ్ జీరో - ఆదిలాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీకర్ గౌడ్




**గుడిహత్నూర్ మే 22, (ప్రజా జ్యోతి) :** కేంద్ర ప్రభుత్వం ప్రచార ఆర్భాటాల్లో నెంబర్ వన్ గా ఉన్నదని, ప్రజల సంక్షేమం, మౌలిక వసతులను కల్పించడంలో మాత్రం పూర్తిగా బిగ్ జీరో గా నిలిచిపోయిందని ఆదిలాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీకర్ గౌడ్ ధ్వజమెత్తారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. దేశంలో సామాన్యుడి పరిస్థితి మరింత దిగజారిపోతోందని, సంపాదన పెరగడం లేదనీ, ఖర్చులు మాత్రం నింగిని తాకుతున్నాయనీ అన్నారు. గతంలో రూ. 400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర నేడు రూ.1000 దాటిపోయిం దనీ, సామాన్యుల బతుకు బండి పట్టాలు తప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్ ధర పెరిగితే కేవలం వాహనాలు ఉన్నవాళ్లకు నష్టం అనుకుంటే పొరపాటేనని, వీటి ధరలు పెరగడం వల్ల కూరగాయ లు, పప్పులు, నిత్యావసర వస్తువులు, రవాణా ఖర్చులు పెరిగి, నిరుపేద వర్గాల ప్రజలు ఆర్థికంగా నలిగిపోతున్నారనీ స్పష్టం చేశారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం, దేశ యువతను దారుణంగా మోసం చేసిందనీ మండిపడ్డారు. చదువుకున్న యువత పగలు, రాత్రి కష్టపడి కోచింగ్‌ల కోసం తల్లిదండ్రుల సొమ్మును తగలేసి పరీక్షలు రాస్తే, చివరకు పేపర్లు లీక్ అయి, పరీక్షలు రద్దై విద్యార్థుల జీవితాలు సంక్షోభం లో ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే, బ్యాంకింగ్, వంటి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు సకాలంలో రావడం లేదన్నారు. మన దేశానికి రక్షణగా, సామాన్యుడికి తక్కువ ధరలో ప్రయాణాన్ని అందించే రైల్వేలు, ఎల్ఐసీ, ఎయిర్ పోర్టులను ప్రైవేట్ సంస్థలకు కేంద్రం విక్రయిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంస్థలు ఉంటేనే సామాన్యు డికి, వెనుకబడిన అన్ని వర్గాలకు ఉద్యోగాల్లో రిజ ర్వేషన్లు అందుతాయన్నారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ చేస్తే చదువుకున్న పేద బిడ్డలకు ఉద్యోగాలు ఎలా వస్తాయనీ, ఇది సామాన్యుడి హక్కులను కాల రాయడమేనని అన్నారు. పెద్ద పెద్ద వ్యాపారవేత్తలు వివిధ బ్యాంక్ ద్వారా రూ. వేలకోట్ల రుణాలు తీసు కున్న, వాటిని సకాలంలో చెల్లించక ఎగ్గొట్టిన వ్యాపా రుల రుణాలను మాఫీ చేస్తున్నారని, సామాన్యుడు బ్యాంకు ఖాతాలో మినిమం బ్యాలెన్స్ లేకపోతే ఫైన్లు వేయడం ఎంతవరకు సమంజసమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేయాలన్నారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువులపై పెంచిన ధరలను తగ్గించాలనీ ఆయన డిమాండ్ చేశారు.

## గెర్రె కాలనీలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం





**మంచిర్యాల, 22, మే (ప్రజా జ్యోతి) :** కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు మున్సిపల్ ఛైర్పర్సన్ పెద్దింటి పద్మ-శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం 6వ వార్డు గెర్రె కాలనీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఎన్నో రోజులుగా కాలనీ ప్రజలు ఎదురుచూస్తున్న రోడ్డు పనులు ప్రారంభం కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ, రోడ్డు పనులు ప్రారంభం కావడం కాలనీ అభివృద్ధికి మంచి ఆరంభమని తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే స్పందించిన మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామికి, మున్సిపల్ ప్రజాప్రతినిధు లకు, అధికారులకు కాలనీ ప్రజల తరపున హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నాయకపు వినయ్ కుమార్, కౌన్సిలర్లు అంబటి శంకర్, సుంకరి శిరీష-సంతోష్, నజ్మా-ఆమేర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కుర్మ అశోక్ గౌడ్, గడ్డం రంజిత్, చింతకింది ప్రశాంత్, అట్టెం లక్ష్మణ్, ముదిరాజ్ కుల పెద్దమనిషి రేండ్ల శంకర్, పిట్టల తిరుపతి, రేండ్ల లక్ష్మణ్, రేండ్ల సమ్మయ్య, చింతల సమ్మయ్యతో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఎండలతో అలమటిస్తున్న నిరాశ్రయులకు నిర్మల్ పోలీసుల అండ

### కమ్యూనిటీ పోలీసింగ్‌తో భిక్షాటనదారులకు ఆశ్రయం కల్పించిన నిర్మల్ పోలీసులు



**నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 22, (ప్రజాజ్యోతి) :** గత నాలుగు ఐదు రోజులుగా తీవ్ర ఎండల కారణంగా నిర్మల్ పట్టణంలో రోడ్లపై,బస్టాండ్లలో నివసిస్తున్న నిరాశ్రయ భిక్షాటనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఎండ వేడిని తట్టుకోలేక పలువురు మృతి చెందిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ విషయాన్ని గమనించిన నిర్మల్ పోలీసులు, జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ ఆదేశాల మేరకు నిన్న రాత్రి నిర్మల్ పట్టణంలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా బస్టాండ్లు మరియు ప్రజా ప్రదేశాల్లో ఆశ్రయం లేకుండా జీవిస్తున్న భిక్షాటనదారులను గుర్తించి, వారికి అవసరమైన సహాయం అందించారు.డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్మల్ టౌన్ పోలీసులు కొంతమంది నిరాశ్రయులను ఓల్డ్ ఏజ్ హోంకు తరలించి, వారికి ఆహారం, ఆశ్రయం అవసరమైన సంరక్షణ కల్పించేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, పట్టణ ఇన్‌స్పెక్టర్ సమ్మయ్య, ఎస్ఐ జ్యోతిమణి,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికతో జిల్లా అభివృద్ధికి బాటలు

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 22, (ప్రజాజ్యోతి) :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి, తెలంగాణ రాష్ట్ర గీతం ఆలపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, కార్యక్రమానికి సంబంధించిన ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. అనంతరం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళికతోనే జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు ప్రజలకు మెరుగ్గా అందించడమే ఈ ప్రణాళిక ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే గ్రామీణ, నియోజకవర్గ స్థాయిలలో సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో 99 రోజుల ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ్యం, పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్, విద్య, వైద్యం, 'అరైవ్ అలైవ్', రైతు వారోత్సవాల కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామని కలెక్టర్ వివరించారు.ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాల వివరాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని, వివిధ శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్లు దత్తాద్రి, అంకం మౌనిక, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వారసత్వ కట్టడాల సంరక్షణకు ప్రజల సహకారం అవసరం : అధికారులు

– పిల్లలమర్రిలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహణ

మహబూబ్‌నగర్, మే 22 ( ప్రజా జ్యోతి బ్యూరో ) ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పిల్లలమర్రి వద్ద జిల్లా పర్యాటక శాఖ, వారసత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పరిశుభ్రత




కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలమర్రి పరిసర ప్రాంతాలను శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో వారసత్వ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగలక్ష్మి, పిల్లలమర్రి మ్యూజియం సిబ్బంది, జిల్లా పర్యాటక శాఖ అధికారులు, టూరిజం సిబ్బంది పాల్గొన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వారసత్వ కట్టడాల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, వారసత్వ ప్రదేశాల పరిశుభ్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు.

# రానున్న వర్షాల నేపథ్యంలో వేగంగా సేకరణ చేపట్టాలి

రైతులకు ఆలస్యం లేకుండా చెల్లింపులు జరగాలి

వనపర్తి ప్రతినిధి, మే 22 (ప్రజాజ్యోతి): ధాన్యపు కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టీ. వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పాన్గల్ మండలంలోని దవాజీపల్లి, పాన్గల్ ధాన్య కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల్లో జరుగుతున్న కొనుగోలు తీరును, ధాన్యం నిల్వలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వర్ష సూచనలు ఉన్న నేపథ్యంలో కొనుగోలు



కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వీలైనంత త్వరగా సేకరించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన ట్రక్ షీట్లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, తద్వారా రైతుల బ్యాంక్ ఖాతాల్లో సకాలంలో నగదు జమయ్యేలా చూడాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు తగినన్ని లారీలు అందుబాటులో ఉంచాలని వాహన కాంట్రాక్టర్లను ఆదేశించారు. రవాణాలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని హెచ్చరించారు. అనంతరం వనపర్తి పరిధిలోని బసవేశ్వర రైస్ మిల్, మహాలక్ష్మి రైస్ మిల్‌లను సందర్శించి నిల్వ సామర్థ్యాన్ని పరిశీలించారు. ధాన్యం వేగంగా దించుకుని మిల్లింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని మిల్లుల యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, పౌరసరఫరాల శాఖ అధికారి కాశీ విశ్వనాథ్, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# కష్టపడితే విజయం ఖాయం:మెరిట్ విద్యార్థులకు ఎస్పీ శ్రీనివాసరావు అభినందనలు

గద్వాల మే 22(ప్రజా జ్యోతి ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీసు కుటుంబాలకు చెందిన పదో తరగతి,ఇంటర్మీడియట్ విద్యార్థులు సాధించిన ప్రతిభను అభినందిస్తూ జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు తెలిపారు.ఈ





సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,ప్రతిభతో మెరిసిన విద్యార్థులందరికీ జిల్లా పోలీస్ శాఖ తరపున హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. విద్యార్థి దశ జీవితాన్ని మలిచే కీలక సమయమని,ఈ సమయంలో కష్టపడి చదివిన వారే భవిష్యత్తులో ఉన్నత స్థానాలు అధిరోహిస్తారని పేర్కొన్నారు.విద్యార్థులు చెడు అలవాట్లు,అనవసర వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.సెల్‌ఫోన్ వినియోగంపై తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని,పిల్లలను ఒత్తిడికి గురి చేయకుండా బాధ్యతతో తీర్చిదిద్దాలని అన్నారు.90 శాతానికి పైగా మార్కులు సాధించడం వెనుక విద్యార్థుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారం,ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఉన్నాయని కొనియాడారు. చిన్న వయస్సులోనే పిల్లల ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే వారు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని తెలిపారు.

పోలీసు విధుల్లో నిమగ్నమై కుటుంబానికి తగిన సమయం ఇవ్వలేకపోయినా,ప్రజల భద్రత కోసం తల్లిదండ్రులు చేస్తున్న త్యాగాలను గుర్తించాలని విద్యార్థులకు సూచించారు.తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.అదనపు ఎస్పీ కె.శంకర్ మాట్లాడుతూ,విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ,సమయపాలన,నాయకత్వ లక్షణాలను అలవరుచుకోవాలని సూచించారు.పట్టుదలతో కృషి చేసే వారిని విజయం తప్పక వరిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.శంకర్,అడ్మినిస్ట్రేటివ్ అధికారి సతీష్ కుమార్,డీసీఆర్‌బీ ఎస్సై సుకుర్,స్పెషల్ బ్రాంచ్ ఎస్సై వెంకటస్వామి, విద్యార్థులు,వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికతో సంక్షేమ ఫలాలు ప్రతి పేద కుటుంబానికి చేరాలి

– అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి : ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

మహబూబ్‌నగర్, మే 22 ( ప్రజా జ్యోతి బ్యూరో ) ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు అర్హులైన ప్రతి పేద






కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే "ప్రజల వద్దకే పాలన" లక్ష్యంతో ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రారంభించామని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ప్రభుత్వం 99 రోజుల కార్యాచరణ ద్వారా మహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాలు, పట్టణాల్లో ప్రజలను నేరుగా కలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించి, అర్హులైన వారికి పారదర్శకంగా ఫలాలు అందిస్తున్నారని పేర్కొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల వల్ల ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరిగిందన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌తో ప్రతి కుటుంబానికి నెలకు సుమారు రూ.1,136 ఆదా అవుతోందని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా ద్వారా రుణమాఫీ, రైతు బీమా కింద రైతు మరణిస్తే కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతంగా అమలవుతోందని, ప్రతి గ్రామంలో 10 నుంచి 15 మంది పేదలు ఇళ్లు నిర్మించుకుంటున్నారని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. జిల్లాలో కొత్తగా 1,06,000 రేషన్ కార్డులు మంజూరు చేసి, 96,000 క్వింటాళ్ల సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రతి మండలం, నియోజకవర్గ స్థాయిలో 50 పడకల, 100 పడకల ఆసుపత్రులను నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. విద్యా రంగంలో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన, సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ క్లాసులు, డిజిటల్ బోర్డులు, ఆన్‌లైన్ తరగతులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

ప్రైవేట్ పాఠశాలల్లో వేలాది రూపాయలు ఖర్చు చేయకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రీ–ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం అందించే పథకాన్ని జూన్ 12 నుంచి అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో "బడిబాట" కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచాలని అధికారులను ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ప్రారంభిస్తున్నామని చెప్పారు. జూన్ 2 తర్వాత రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు, కొత్త పెన్షన్లు, ఇందిరమ్మ ఇన్సూరెన్స్ వంటి పథకాలు అమల్లోకి వస్తాయని తెలిపారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, బ్యాంక్ లింకేజీలు అందిస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సులు ఇవ్వడం ద్వారా ఆర్థికంగా బలోపేతం చేసే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

పోలీస్ శాఖ రాష్ట్రంలో శాంతిభద్రతలను సమర్థవంతంగా నిర్వహిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారం అవసరమన్నారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు బానిసై అతివేగంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. రైతులు పండించే ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు.

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, విద్య, వ్యవసాయం తదితర శాఖల పథకాల వివరాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో నిర్వహించే ప్రజా పాలన సమావేశాల ద్వారా ప్రభుత్వ పథకాలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. జిల్లా ఎస్పీ దరావత్ జానకి మాట్లాడుతూ, జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా ప్రజలందరూ సహకరించాలని కోరారు.

మేయర్ గుమ్మాల మమత మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ చారిత్రాత్మక కార్యక్రమమని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా కలిగిందన్నారు. సమావేశంలో మూడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బి. అనిత మధుసూదన్ రెడ్డి, భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బాల్‌కోటి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డీఆర్వో రామ్‌రెడ్డి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**స్టాళ్ల ప్రదర్శన :**

సమావేశానికి ముందు ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి కలెక్టరేట్ ప్రాంగణంలో వైద్య ఆరోగ్యం, గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయం, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాళ్లను సందర్శించి ప్రారంభించారు. ఆయా శాఖలు అమలు చేస్తున్న పథకాలు, ప్రభుత్వం అందిస్తున్న సేవలు, సబ్సిడీ పరికరాల వివరాలను స్టాళ్లలో ప్రదర్శించారు. గ్రామీణ అభివృద్ధి శాఖ ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి స్టాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు.

# బీఆర్ఎస్ పాలనపై యెన్నం శ్రీనివాస్ రెడ్డి విమర్శలు

ఫ్యూచర్ సిటీతో 20 లక్షల ఉద్యోగాల లక్ష్యం సాధిస్తామని వెల్లడి

మహబూబ్‌నగర్, మే 22 ( ప్రజా జ్యోతి బ్యూరో ) సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్, యెన్నం శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. పదేళ్లపాటు అధికారాన్ని అనుభవించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని వెనక్కి నెట్టిందని ఆరోపించారు. అమెరికాకు వెళ్లి అక్కడ కూడా తెలంగాణ పరువును దిగజార్చేలా బీఆర్ఎస్ నేత హరీష్ రావు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రైజింగ్ విజన్–2047లో భాగంగానే భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి అద్భుత నగర నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. ముంబై–నవీ ముంబై తరహాలో హైదరాబాద్‌కు సమీపంలో ఆధునిక ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని చెప్పారు. నోయిడా, గురుగ్రామ్‌ల తరహాలో అత్యాధునిక టెక్నాలజీ మహానగరంగా దీనిని అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఫార్మా సిటీ కోసం సేకరించిన 13,500 ఎకరాల భూమికి అదనంగా మరో 30 వేల ఎకరాలతో భారీ ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటోందని



తెలిపారు. ఏఐ, డిజిటల్ సర్వీసెస్, హెల్త్ అండ్ లైఫ్ సైన్సెస్, గ్రీన్ ఫార్మా, ఈవీ మ్యానుఫ్యాక్చరింగ్, టూరిజం, ఎడ్యుకేషన్ నాలెడ్జ్ హబ్‌లతో పాటు మొత్తం 12 ప్రత్యేక జోన్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఫ్యూచర్ సిటీ ద్వారా 20 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. గ్రామీణ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ అందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని, స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీతో పాటు జిల్లాల్లో శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.మచిలీపట్నం పోర్టును అనుసంధానించే గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం సీఎం రేవంత్ రెడ్డి దూరదృష్టికి నిదర్శనమన్నారు.

250 కిలోమీటర్ల హైవేతో రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశ లభిస్తుందని పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును రద్దు చేస్తామని హరీష్ రావు చేసిన వ్యాఖ్యలు తెలంగాణ భవిష్యత్తును అడ్డుకునే ప్రయత్నమని విమర్శించారు. కల్వకుంట్ల కుటుంబ రాజకీయ ప్రయోజనాల కోసం యువత భవిష్యత్తుతో ఆడుకుంటున్నారని ఆరోపించారు. పెట్టుబడిదారులను భయపెట్టి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని అన్నారు.

తెలంగాణ ప్రజలు ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీని తిరస్కరించారని, పాదయాత్రలు, మోకాల యాత్రలు చేసినా ఆ పార్టీకి మళ్లీ ప్రజల్లో ఆదరణ రాదని యెన్నం శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# ప్రజల అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు: మంత్రి జూపల్లి కృష్ణారావు

– వనపర్తిలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్: ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి, మే 22 (ప్రజాజ్యోతి): ప్రజల అర్జీలను అధికారులు బాధ్యతాయుతంగా, వేగంగా పరిష్కరించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి



జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం వనపర్తి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సునీత రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ దళారీ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజల దరఖాస్తులపై నిర్లక్ష్యం ప్రదర్శించకుండా వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. భూభారతి, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన అర్జీలను వేగంగా పరిష్కరించాలని పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. యువత డ్రగ్స్ వైపు వెళ్లకుండా క్రీడలను ప్రోత్సహించాలని సూచించారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. వనపర్తి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. గృహజ్యోతి, మహిళా శక్తి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్ల వంటి పథకాల ద్వారా ప్రజలకు మేలు జరుగుతోందన్నారు. వనపర్తిలో రూ.203 కోట్లతో జిల్లా ఆసుపత్రి నిర్మాణం, రూ.70 కోట్లతో తాగునీటి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ రైతు రుణమాఫీ ద్వారా 61 వేల మందికి పైగా రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. జిల్లాలో 73 వేల కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. గృహజ్యోతి పథకం కింద వేలాది కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా బాల భరోసా కార్యక్రమం కింద చిన్నారులకు వినికిడి పరికరాలు పంపిణీ చేయగా, మహిళా



సంఘాలకు బస్సులు అందజేశారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి, ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమం లో జిల్లా గ్రంథాలయం చైర్మెన్ గోవర్దన్ సాగర్, వనపర్తి మున్సిపాలిటీ ఛైర్పర్సన్ మాధవి, పెబ్బేరు మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కొత్తకోట మునిసిపల్ ఛైర్పర్సన్ అరుణ, ఆత్మకూరు మునిసిపల్ ఛైర్పర్సన్ నాగమణి, అమరచింత మునిసిపల్ ఛైర్పర్సన్ సువర్ణ, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ శ్రీనివాస్ గౌడ్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు నాయకుడిని పరామర్శించిన నాగుర్ల



**పరకాల, మే 22, (ప్రజా జ్యోతి):** నడికూడ మండలం నర్సక్కపల్లి గ్రామ రైతు సంఘం ( రైతు రక్షణ సమితి) నాయకులు సూరావు బాపూరావు పుత్రుడు సూరావు ప్రవీణ్ ఇటీవల అనారోగ్యంతో పరమపదించగా వారి నివాసానికి వెళ్లి చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు. వారితో పాటు తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్,సుకినే సుధాకర్, చౌల రామారావు, నాగుర్ల ధర్మారావు,సురావు కిషన్ రావు,ప్రభాకర్,రామారావు, రాజీరు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

### - గోడ పత్రిక ఆవిష్కరణ



**నర్సంపేట మే 22 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట స్వచ్ఛంధ సంస్థల ఆధ్వర్యంలో "అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం, 22,మే సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవికిరణ్ స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు జీవ వైవిధ్య పరి రక్షణ కు సంబంధించిన వాల్ పోస్టర్లు(గోడ పత్రికలు) ఆవిష్కరించినారు.ఈ సందర్భంగా నర్సంపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎఫ్.ఆర్.ఓ.రవి కిరణ్ మాట్లాడుతూ, జీవ వైవిధ్యం తోనే మానవ జాతి మనుగడ సాధ్యమని, అలాంటి జీవ వైవిధ్య పరి రక్షణ కొరకు సమాజం లోని ప్రతీ ఒక్కరూ పాటు పడాలని పిలుపు నిచ్చారు.

భూమి పై జీవరాశి మనుగడకు వైవిధ్యం అవసరం ఉన్నందున రోజు రోజుకు పెరుగుతున్న వాతావరణ కాలుష్యం వలన అనేక జీవ రాశులు తమ మనుగడను కోల్పోతున్నాయని, భూమి పై జీవాల మధ్య భేదాన్నే "జీవ వైవిధ్యం" అంటరాని తెలిపారు.పర్యావరణం కాలుష్యం చెందడంతో భూగోళం వేడెక్కి జీవ వైవిధ్యం దెబ్బతిని ఎన్నో జీవజాతులు, అంతరించిపోతున్నాయనీ అన్నారు. ప్రతిభ సంస్థ నిర్వాహకుడు గిరగాని సుదర్శన్ మాట్లాడుతూ, రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం వలన మేలుచేసే కీటకాలు నశిస్తున్నవి. భూమి సారం కోల్పోతున్నది.పక్షులు, కీటక జాతులను పరిరక్షించు కోవాలి అన్నారు. ఏఎస్ఆర్ సంస్థ నిర్వాహకులు ఎర్రబోయిన రాజశేఖర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ విచ్చలవిడి వినియోగం వలన కూడా జీవజాతులు అంతరించి పోతున్నాయని ప్లాస్టిక్ వాడకాన్ని విడనాడి జీవ జాతులను రక్షించాలని,అలాగే ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని అన్నారు. స్వయంకృషి సంస్థ నిర్వాహకులు బెజ్జంకి ప్రభాకర్ మాట్లాడుతూ భూమి పైన జీవ వైవిధ్యం ఉండాలంటే భూమి పైన కనీసం 33శాతం అడవులు ఉండాలి.అడవులు ఉంటేనే భూమి పైన జీవ జాతులు అయిన మానవ జాతి, జంతు జాతి, క్రిమి కీటక జాతులు, పక్షి జాతులు పరిరక్షించబడతాయని అందుకొరకు సామాజిక బాధ్యత గా ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి అటవీ శాతాన్ని పెంచాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ ఆఫీసర్ రవికిరణ్, స్వచ్ఛంధ సంస్థల బాధ్యులు గిరగాని సుదర్శన్ గౌడ్, బెజ్జంకిప్రభాకర్, ఎర్రబోయిన రాజశేఖర్,బోయిని వెంకటస్వామి, స్వచ్ఛంధ వాలంటీర్ కాసుల వెంకటాచారి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు సోమ్లానాయక్, ధర్మ, ఫారెస్ట్ సిబ్బంది రవి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల వేతనాల పెంపులో పారదర్శకత లేదు

### -పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా పెంపు లేదు
### - బిఆర్టియు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు



**నర్సంపేట మే 22 (ప్రజా జ్యోతి) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన వేతనాల పెంపులో శాస్త్రీయత లేదని పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెరగలేదని బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు గోనే యువరాజు అన్నారు. కార్మికులు-కార్మిక సంఘాలు చేసిన డిమాండ్లను పట్టించుకోకుండా వేతన పెంపుదల కోసం క్యాబినెట్ సబ్ కమిటీ వేశామని దేశానికి ఆదర్శంగా ఉండేలా శాస్త్రీయ పద్ధతిలో కనీస వేతనాల పెంపుదల చేస్తామని సీఎం ప్రకటించి ఆచరణలో చిత్తశుద్ధి లోపించిందని అన్నారు. కనీస వేతనాల పెంపుదల సందర్భంగా కరువు భత్యం గురించి ప్రస్తావించకపోవడం దారుణమని పెరిగిన వేతనాలు నాలుగు కేటగిరీలలో అన్ స్కిల్డ్ వర్కర్లకు 16000/-, సెమీస్కిల్ వర్కర్లకు 17000/-, స్కిల్ వర్కర్లకు 18500/-, హై స్కిల్డ్ వర్కర్లకు 20000/- పెంచినట్లు సీఎం ప్రకటించారు. ఇందులో ఒక్క అన్ స్కిల్డ్ వర్కర్ల తప్ప మిగతా వారికి బేసిక్ కరువు బత్యం కలుపుకొని ఇప్పటికే వస్తున్న జీతానికి, పెరిగిన దానికి పెద్ద తేడా లేదని తెలిపారు. కాంట్రాక్టు లేబర్ జీవో 11 ప్రకారం ఇప్పటికే రాష్ట్రంలో కార్మికులకు 13098 నుంచి 23,683 వరకు వేతనాలు పొందుతున్నారని దీన్ని బట్టి చూస్తే ప్రభుత్వం పెంచింది పెద్దగా ఏమీ లేదని విమర్శించారు. జీవో నాలుగులో స్కిల్డ్ కార్మికునికి 19572 ఉండగా సీఎం ప్రకటించిన వేతనం 18,500 మాత్రమేనని గతంతో పోలిస్తే 1072 రూపాయల తగ్గిందని తెలిపారు. బి ఆర్ ఎస్ అధికారంలో ఉండగా కనీస వేతనాల సలహా మండలి బోర్డు అన్ స్కిల్డ్ కార్మికుడికి కనీస వేతనం 18009 రూపాయలు కరువుభాత్యాన్ని ఒక్కొక్క పాయింట్ కు 12 రూపాయలు సిఫార్సు చేశారని గుర్తు చేశారు. దీనితోపాటు 2021 జూన్ 25న బిఆర్ఎస్ ప్రభుత్వం 5 జీవోలను జారీ చేసిందని వాటికి కాంగ్రెస్ ప్రభుత్వం గెజిట్ కూడా విడుదల చేయలేదని పేర్కొన్నారు.వేతనాల పెంపు విషయంలో ఏప్రమాణికాన్ని కూడా పరిగణంలోకి తీసుకోలేదని విమర్శించారు. కార్మిక సంఘాలు కనీస వేతన సలహా మండలి బోర్డ్ సిఫార్సులను కూడా పరిగణంలోకి తీసుకోకుండా మంత్రివర్గ ఉప సంఘం పేరిట కనీస వేతనాలు ప్రకటించడం ఏంటని ప్రశ్నించారు.1948 కనీస వేతనాలు చట్టం ప్రకారం పెరిగిన ధరలకు అనుగుణంగా డాక్టర్ అట్రాయి ఫార్ములా ప్రకారం శాస్త్రీయంగా లెక్కగడితే కనీస వేతనం నెలకు 32,000 ఇవ్వాలని దేశ అత్యున్నత న్యాయస్థానం ఒక వైపు చెబుతున్న దేశంలో ఉన్న కార్మిక సంఘాలు కనీస వేతనం 26,000 అయినా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న సీఎం పెడచెవిన పెట్టారని అన్నారు. రాష్ట్రంలో స్కీం వర్కర్లుగా అంగన్వాడి, ఆశ , ఎన్ఆర్ఈజీఎస్ ,ఎన్ ఆర్ హెచ్ ఎం, సర్వ శిక్ష అభియాన్ కింద 3 లక్షల కు పైన కార్మికులు పనిచేస్తున్నారని విరు ఏ కేటగిరి కిందికి వస్తారో స్పష్టత లేదని వేతన సవరణను పునసమక్షించాలని డిమాండ్ చేశారు.

# వడ్డేపల్లి చెరువుకట్టపై స్వచ్ఛత

### - ప్రతి పౌరుడు పరిశుభ్రతలో భాగస్వామి కావాలి - కలెక్టర్ చాహత్ బాజ్ పాయి






**హనుమకొండ జిల్లా ప్రతినిధి, మే 22, (ప్రజా జ్యోతి) :** 99 రోజుల "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక"లో భాగంగా వడ్డేపల్లి చెరువుకట్ట వద్ద శుక్రవారం నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పాల్గొన్నారు. జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో, జీడబ్ల్యూఎంసీ సహకారంతో జరిగిన కార్యక్రమంలో అధికారులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, పర్యాటక ప్రాంతాల సంరక్షణ, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడమే కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ప్రతి పౌరుడు వారంలో కనీసం ఒకరోజు "క్లీన్ అండ్ గ్రీన్" కార్యక్రమాల్లో పాల్గొని నగరాన్ని హరిత, పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. వ్యర్థాలను రోడ్లపై వేయకుండా నిర్దేశిత ప్రదేశాల్లో వేయడం ద్వారా పారిశుద్ధ్య కార్మికులకు సహకారం అందించవచ్చని సూచించారు. ప్రజలకు ఆహ్లాదాన్ని కలిగించే ప్రాంతాలను పరిశుభ్రంగా, సురక్షితంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వడ్డేపల్లి ట్యాంక్‌బండ్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి శివాజీ, జిడబ్ల్యూఎంసీ సిహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కిట్స్‌లో ఘనంగా జిల్లా బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం





**హసన్‌పర్తి, మే 22(ప్రజాజ్యోతి) :** కాకతీయ సాంకేతిక విజ్ఞాన విద్యాసంస్థ ప్రాంగణంలోని ఇండోర్ స్టేడియంలో వరంగల్ జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బాలురు, బాలికలు, పురుషులు, మహిళల విభాగాల్లో నిర్వహిస్తున్న ఈ పోటీలు మూడు రోజుల పాటు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘానికి అనుబంధంగా ఉన్న వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీలను విద్యాసంస్థ ప్రధానాచార్యులు ఆచార్య కె.అశోక్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో ఏకాగ్రత, క్రమశిక్షణ, జట్టు భావన పెంపొందిస్తాయని తెలిపారు. బ్యాడ్మింటన్ ఆరోగ్యాన్ని పెంపొందించే చైతన్యభరిత క్రీడ అని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడలను ప్రోత్సహించడం ద్వారా విద్యార్థుల మేధో వికాసం సాధ్యమవుతుందని అన్నారు. వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ సంఘ ప్రధాన కార్యదర్శి, విద్యాసంస్థ పరిపాలనాధికారి డాక్టర్ పి.రమేష్‌రెడ్డి మాట్లాడుతూ పోటీల్లో ఏకల, జంట, మిశ్రమ జంట విభాగాల్లో 245 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. ఈ పోటీల విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని చెప్పారు. 11 ఏళ్లలోపు నుంచి వయోజన విభాగాల వరకు పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. సంఘ అధ్యక్షులు డాక్టర్ ఎస్.రమేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులను అభినందించారు. క్రీడలు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడతాయని తెలిపారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభ కనబరుస్తున్న వరంగల్ క్రీడాకారులను ప్రశంసించారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి డి.నాగకిషన్, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.మోహన్‌రావు, శారీరక విద్య విభాగాధిపతి డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, కిషోర్, భాస్కర్, డాక్టర్ శ్రీధర్, శ్యామ్, ఎం.శైలజ, డాక్టర్ డి.ప్రభాకరాచారి, సంఘ సభ్యులు, క్రీడాకారులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి - ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి





**పరకాల, మే 22 (ప్రజాజ్యోతి) :** పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. పరకాల టౌన్, పరకాల, నడికూడ, ఆత్మకూరు, దామెర మండలాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు ఈ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 58 మంది లబ్ధిదారులకు రూ.24 లక్షల 27 వేల 750 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. పేదరికంతో బాధపడుతూ అనారోగ్యాల బారిన పడిన వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తూ భరోసాగా నిలుస్తోందన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా మహిళా డైరీ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ చీరల పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు బీమా, సన్న వడ్లకు రూ.500 బోనస్, సన్న బియ్యం పంపిణీ, మహాలక్ష్మి పథకం, గ్యాస్ సబ్సిడీ, వడ్డీ లేని రుణాలు, శ్రీనిధి రుణాలు, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

### హైటెక్ సిటీ యశోదా హాస్పిటల్స్‌లో అత్యాధునిక 'రోబోటిక్ సర్జరీ', "ఎంఆర్ లినాక్" సాంకేతికతతో

## చిన్న రంధ్రాల ద్వారానే క్లిష్టమైన క్యాన్సర్ శస్త్రచికిత్సలు..

- ఆరోగ్యకరమైన కణాలకు హాని లేకుండా రేడియేషన్ థెరపీ.. - క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పులు..
- పర్మనెంట్ కొలోస్టమీ అవసరం లేని సరికొత్త విధానం...- హన్మకొండ ప్రెస్ మీట్‌లో యశోదా హాస్పిటల్స్ వైద్య నిపుణుల వెల్లడి



**హనుమకొండ జిల్లా ప్రతినిధి మే 22 (ప్రజాజ్యోతి) :** క్యాన్సర్ చికిత్సా రంగంలో వస్తున్న సాంకేతిక ఆవిష్కరణలు రోగులకు కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయని యశోదా హాస్పిటల్స్ (హైటెక్ సిటీ) నిపుణులు వెల్లడించారు. ముఖ్యంగా రోబోటిక్ సర్జరీ, "ఎంఆర్ లినాక్" రేడియేషన్ టెక్నాలజీలు క్యాన్సర్ వైద్యంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చాయని పేర్కొన్నారు. శుక్రవారం హన్మకొండలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీనియర్ రేడియేషన్ ఆంకాలజీ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సునీత, రోబోటిక్ సర్జన్ డాక్టర్ ఇ. రాజేష్ గౌడ్ ఈ అత్యాధునిక చికిత్సా విధానాల వివరాలను వెల్లడించారు. 8 ఎంఎం చిన్న రంధ్రాలతోనే రోబోటిక్ సర్జరీ గతంలో లాగా పెద్ద కోతలు లేకుండా, కేవలం 8 ఎంఎం చిన్న రంధ్రాల ద్వారా హై-డెఫినిషన్ 3డి విజన్, మనిషి చేతి కదలికలను అనుకరించే ప్రిస్టెడ్ ఇన్‌స్ట్రుమెంట్స్ సాయంతో క్లిష్టమైన ఆపరేషన్లను అత్యంత ఖచ్చితత్వంతో చేయవచ్చని డాక్టర్ రాజేష్ గౌడ్ తెలిపారు. మహిళల క్యాన్సర్లు : గర్భాశయ, అండాశయ క్యాన్సర్లలో 'రాడికల్ హిస్టరెక్టమీ' వంటి సర్జరీలను సురక్షితంగా చేయవచ్చును. దీనివల్ల గతంలో 4--5 రోజులు ఉండాల్సిన హాస్పిటల్ స్టే, ఇప్పుడు ఖచ్చితంగా 24 గంటలకే పరిమితమైంది. యూరాలజీ, కిడ్నీ క్యాన్సర్లు : ప్రోస్టేట్, బ్లాడర్ క్యాన్సర్లలో నరాలు దెబ్బతినకుండా కాపాడటం ద్వారా రోగి జీవన నాణ్యత మెరుగవుతుంది. కిడ్నీ క్యాన్సర్లలో పూర్తి కిడ్నీ తీసేయకుండా కేవలం ట్యూమర్‌ను మాత్రమే తొలగించే (పార్టీల నేఫ్రెక్టోమి) సదుపాయం లభిస్తుంది. మంచి ప్రయోజనాలతో పాటు తక్కువ నొప్పి, తక్కువ రక్తనష్టం, చిన్న మచ్చలు ఏర్పడటంతో పాటు రోగులు అత్యంత వేగంగా కోలుకుని తమ పనుల్లో చేరిపోవచ్చును. కోలోరెక్టల్ క్యాన్సర్ చికిత్సలో స్మార్ట్ సాంకేతికత కోలోరెక్టల్ (పెద్దపేగు) క్యాన్సర్లలో కూడా ఈ టెక్నాలజీ పెద్ద మార్పు తీసుకొచ్చిందని వైద్యులు తెలిపారు. ట్యూమర్‌ను ఖచ్చితంగా గుర్తించి తొలగించడం వల్ల చాలాసార్లు రోగులకు పర్మనెంట్ కొలోస్టమీ (కృత్రిమ మలద్వారం) అవసరం లేకుండా చేయగలుగుతున్నామని వివరించారు. ఇందులో వాడే 'స్మార్ట్ స్టాప్లర్' టెక్నాలజీ ద్వారా పేగు చివరలను (బౌల్ ఎండ్స్) మరింత సురక్షితంగా కలపవచ్చని, దీనివల్ల లీకేజ్ ప్రమాదం తప్పుతుందని పేర్కొన్నారు. అలాగే మెరుగైన నాడుల రక్షణ యూరినరీ, సెక్సువల్ క్వాలిటీ ఆఫ్ లైఫ్ కూడా బాగుంటుందని వెల్లడించారు.

**రేడియేషన్ రంగంలో సరికొత్త యుగం "ఎంఆర్ లినాక్" :** వైద్య నిపుణులు డాక్టర్ ఎం. సునీత మాట్లాడుతూ.. రేడియేషన్ అనగానే రోగుల్లో ఉండే సైడ్ ఎఫెక్ట్స్ భయాలను దూరం చేసేందుకు దేశంలోనే తొలిసారిగా యశోదా హాస్పిటల్స్ హైటెక్ సిటీలో "ఎంఆర్ లినాక్"" టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. ప్రతిరోజు రేడియేషన్ ఇచ్చే ముందు రోగికి ఆటోమేటిక్‌గా ఎమ్మారై స్కాన్ జరిగి, ట్యూమర్ సైజు, స్థానాన్ని బట్టి మిల్లీమీటర్ స్థాయిలో ఖచ్చితత్వంతో రేడియేషన్ ఇస్తారు. సైడ్ ఎఫెక్ట్స్ లేవు, పక్కన ఉండే ఆరోగ్యకరమైన అవయవాలకు ఎలాంటి హాని జరగదు. సాధారణ రేడియేషన్‌లో వచ్చే వాంతులు, అలసట, చర్మ సమస్యలు ఇందులో ఉండవు. తక్కువ కాలంలో చికిత్స: ప్రోస్టేట్, బ్రెయిన్, లంగ్, ప్యాంక్రియాస్ వంటి కష్టమైన క్యాన్సర్లకు కొన్ని సందర్భాల్లో కేవలం 5 రోజుల్లోనే చికిత్స పూర్తవుతుంది. ఈ అత్యాధునిక సాంకేతికతలు క్యాన్సర్ రోగులకు ఆర్థిక, శారీరక, మానసిక ఒత్తిడిని తగ్గించి మెరుగైన ఫలితాలను ఇస్తున్నాయని వైద్యులు తెలిపారు. ఈ మీడియా సమావేశంలో యశోదా హాస్పిటల్స్ హైటెక్ సిటీ టీమ్ లీడర్ సాయి వెంకట, డిప్యూటీ మేనేజర్ విజయ్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

## సమయస్ఫూర్తితో స్పందించిన హసన్‌పర్తి సీఐ

### గాయపడిన దంపతులకు వెంటనే చికిత్స



**హసన్‌పర్తి, మే 22 (ప్రజాజ్యోతి) :** హసన్‌పర్తి మండలం గంటూరుపల్లి గ్రామపంచాయతీలో రైతులతో సమావేశం ముగించుకుని తిరిగి వస్తున్న సమయంలో హసన్‌పర్తి సీఐ మహేందర్ సమయస్ఫూర్తితో స్పందించి ప్రమాదంలో గాయపడిన దంపతులను వెంటనే ఆస్పత్రికి తరలించారు. గంటూరుపల్లి గ్రామానికి చెందిన మడిపల్లి పద్మ, ఆమె భర్త వెంకటస్వామితో కలిసి ఏనుమాముల మార్కెట్‌కు వెళ్లి మిర్చి కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంపై గ్రామానికి తిరుగు ప్రయాణం అవుతుండగా గ్రామ శివారులోని ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ప్రమాదం చోటుచేసుకుంది. వాహనం చక్రంలో చీర ఇరుక్కుపోవడంతో ఇద్దరూ కిందపడిపోయి గాయాలపాలయ్యారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న సీఐ మహేందర్ ప్రమాదాన్ని గమనించి వెంటనే స్పందించారు. గాయపడిన దంపతులను పోలీసు వాహనంలో హసన్‌పర్తి ఆస్పత్రికి తరలించి చికిత్స అందేలా చర్యలు చేపట్టారు.సీఐ మహేందర్ చూపిన మానవత్వం, సమయస్ఫూర్తిపై స్థానికులు ప్రశంసలు వ్యక్తం చేశారు.

## వడదెబ్బతో మహిళ మృతి



**పర్వతగిరి, మే 22 (ప్రజాజ్యోతి) :** పర్వతగిరి మండలంలో విషాద ఘటన చోటుచేసుకుంది. దీక్షకుంట్ల గ్రామానికి చెందిన చిర్రబోయిన అరుణ (45), భర్త మల్లయ్య, జీవనోపాధి కోసం కొంతకాలం క్రితం పర్వతగిరికి వలస వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. రోజువారీ కూలి పనులతో కుటుంబాన్ని పోషిస్తున్న ఆమె, రోజులాగే కూలి పనులకు వెళ్లారు. అయితే తీవ్ర ఎండల కారణంగా పని ముగించుకొని వస్తుం డగా వడదెబ్బకు గురైన అరుణ అస్వస్థతకు లోనయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం. అరుణ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. గ్రామంలో కూడా విషాద ఛాయలు అలుముకున్నాయి.

## వరి కొయ్యలను కాల్చవద్దు

### - ఏఈవో కమలహాసన్



**భీమదేవరపల్లి మే 22 ప్రజాజ్యోతి :** వరి కొయ్యలకు నిప్పుపెడితే భూసారం కోల్పోయి పంట దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ వ్యవసాయ విస్తరణాధికారి కమలహాసన్ తెలిపారు. హార్వెస్టర్ మిషన్లతో వరి కోత తర్వాత మిగిలే కొయ్యలను రైతులు తగలబెట్టడం వల్ల నేలలోని సూక్ష్మజీవులు, వానపాములు నశించి సేంద్రియ కర్బనం తగ్గుతుందని చెప్పారు. అలాగే నత్రజని, భాస్వరం, పొటాషియం వంటి పోషకాలు నశించి భూమి గట్టిపడటంతో నీటిని నిల్వ ఉంచే శక్తి తగ్గుతుందని వివరించారు. కొయ్యలను కాల్చడం వల్ల వాయు కాలుష్యం పెరిగి ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని పేర్కొన్నారు. రైతులు వరికొయ్యలను కాల్చకుండా కల్టివేటర్, రోటావేటర్లతో నేలలో కలియదున్నితే భూమి సారవంతమై నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. కొయ్యలు త్వరగా కుళ్లేందుకు ఎకరానికి 50 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 15 కిలోల యూరియా వేయాలని సూచించారు.

## తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి



**భీమదేవరపల్లి మే 22 ప్రజాజ్యోతి :** భీమదేవరపల్లి మండలంలో వడ్ల కొనుగోళ్ల సమస్యలపై బీజేపీ నాయకులు ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీరామోజు శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. వడ్ల కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేసి, తరుగు--తేమ పేరుతో కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని, ఐకేపీ కేంద్రాల్లో సరిపడా లారీలు ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం అమ్మిన రైతులకు నెలలు గడిచినా డబ్బులు ఖాతాల్లో జమ కాలేదని, ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. రైస్‌మిల్లుల్లో 8 నుంచి 10 కిలోల వరకు తరుగు తీస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కల్లాలు లేక రోడ్డుపైనే ధాన్యం ఆరబెడుతున్న పరిస్థితి నెలకొందని, భూమి ఉన్న ప్రతి రైతుకు కల్లాలు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకుని ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని, సమస్యలు పరిష్కరించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దొంగల కొమురయ్య, మాచర్ల కుమారస్వామి, జిల్లా నాయకులు దొంగల వేణు, గుండెల్ని సదానందం, పోడేటి బిక్షపతి, ముద్దసాని వీరన్న, బొల్లంపల్లి శ్యామ్, గద్ద రాజేందర్, బొజ్జపురి పృథ్వీరాజ్, అయిత సాయి తేజ, రాజు, బోడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర పోలీస్ అథారిటీ డైరెక్టర్ వర్రె వెంకటేశ్వర్లుకు సన్మానం

మోత్కూరు, మే 22 (ప్రజా జ్యోతి): తెలంగాణ రాష్ట్ర పోలీస్ అథారిటీ డైరెక్టర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమాచార హక్కు చట్టం పూర్వ ప్రధాన కార్య కమిషనర్ బర్రె



వెంకటేశ్వర్లు శుక్రవారం మోత్కూర్ కి విచ్చేసిన సందర్భంగా మోత్కూర్ గెస్ట్ హౌస్ లో కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు గుండగోని రామచంద్ర గౌడ్, గ్రంథాలయ చైర్మన్ కోమటి మత్స్య గిరి ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎడ్ల శ్రీనివాస్, గ్రంథాలయ డైరెక్టర్ పోలోజు శేఖరా చారి, సజ్జనం పాండు, గడ్డం అనిల్ కుమార్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రంలో విషాదం..

### స్పందించిన ఎమ్మెల్యే మందుల సామెల్ పదివేల ఆర్థిక సహాయం అందజేసిన సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు

తుంగతుర్తి, మే 22,(ప్రజా జ్యోతి): తుంగతుర్తి మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం



ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో పనిచేస్తున్న హమాలీ చర్లపల్లి సోమయ్య (69) గురువారం వడదెబ్బకు గురై మృతి చెందారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ ఆదేశాల మేరకు సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు, తాహసిల్దార్ దయానందం, ఎస్సై క్రాంతి కుమార్ తో కలిసి సోమయ్య పార్థివదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం రైతు సేవా సహకార సంఘం తరఫున కుటుంబ సభ్యులకు దహన సంస్కారాల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే వడదెబ్బతో మరణించిన సోమయ్య కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## రాష్ట్ర స్థాయి ఎక్సలెన్సీ అవార్డు అందుకున్న టీచర్ వీరశేఖర్

### రవీంద్ర భారతి లో పురస్కారం అందజేసిన మాజీ గవర్నర్ దత్తాత్రేయ. త్రిపుర మాజీ సి ఎస్ వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ, మే 22,( ప్రజాజ్యోతి ): రాష్ట్రస్థాయి ఎక్సలెన్సీ అవార్డు అందుకున్నాడు ఉపాధ్యాయుడు మచ్చలకూరి వీరశేఖర్. నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం వెంకటాద్రి పాలెం గ్రామంలో సామాన్య నిరుపేద కుటుంబంలో జన్మించిన వీరశేఖర్ ఉస్మానియా యూనివర్సిటీలో ఎకనామిక్స్ మరియు సోషియాలజీ లో రెండు పిజీ లను పూర్తి చేసి వేములపల్లి మండలం సల్కనూర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఉషోదయపు పల్లె ప్రకృతి అనే సంస్థ స్థాపించి ఆ వేదిక ద్వారా ఆరోగ్యం వ్యాయామం పై చైతన్యం కలిగిస్తున్నారు.గ్రామంలోని తన స్నేహితుల ద్వారా పల్లె అందాలు వీక్షిస్తూ వ్యాయామం డాన్స్ మరియు యోగ జీవన నియమాలు పాటించే విధంగా అవగాహన



కల్పిస్తున్నారు. ప్రతి ఉదయం జరిగే ఈ కార్యక్రమాన్ని సోషల్ మీడియా ద్వారా అనేక గ్రామాలలో యువత వీక్షించి ప్రేరణ పొంది ఆరోగ్య భారత నిర్మాణంలో నేటి యువత భాగస్వాములు అవుతున్నారన్నారు. వీరశేఖర్ ప్రారంభించిన ఈ కార్యక్రమం చుట్టు పక్కల గ్రామాలలో విస్తరించి కొన్ని శాఖలుగా ఏర్పడిందన్నారు.గ్రామాలలో జరుగుతున్న ఉషోదయం పల్లె ప్రకృతి కార్యక్రమాన్ని సోషల్ మీడియా ద్వారా వీక్షించిన ఫౌండేషన్ సభ్యులు ఆరోగ్యం యోగవైపు గ్రామ యువతకు శిక్షణ ఇస్తున్న వీరశేఖర్ కు మాజీ గవర్నర్ దత్తాత్రేయ చేతుల మీదుగా రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్రస్థాయి ఎక్సలెన్స్ అవార్డు తో సత్కరించడం జరిగింది. అవార్డు అందుకున్న వీర శేఖర్ ను గ్రామస్తులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ ప్రవీణ్ కుమార్. త్రిపుర మాజీ చీఫ్ సెక్రటరీవెంకటేశ్వర్లు, సినీ నేపథ్య గాయకుడు మను. సినీ నటి కవిత,సి ఐ సైదులు గౌడ్, ఏడుకొండలు, జర్నలిస్ట్ షేక్ ఆరిఫ్,టీచర్స్ నీలం శేఖర్, సత్తయ్య,మచ్చ వెంకటేశ్వర్లు, సైదా, హుస్సేన్,గోవర్ధన్ చారి, జేఎల్ఎం రాగ్య నాయక్, వ్యాయామ నిపుణుడు రాఘవ, మాజీ సర్పంచ్ అశోక్ రెడ్డి,రమావత్ రాజా,హేమంత్, నాగభూషణం పాల్గొన్నారు.

# "ఫ్రెండ్లీ పోలీసింగ్" ప్రజల నమ్మకానికి నాంది పలకాలి !

**ప్రజల విశ్వాసమే పోలీసుల బలం**

**పోలీస్ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి**

**వేగంగా చర్యలు చేపట్టాలి**

**చట్టాలపై సామాన్యులకు అవగాహన కల్పించాలి**

**స్టేట్ పోలీస్ కంప్లెంట్ అథారిటీ డైరెక్టర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు**

మోత్కూరు, మే 22 (ప్రజా జ్యోతి): ఫ్రెండ్లీ పోలీసింగ్ అనేది పోలీసులు మాటల్లో కాకుండా చేతల్లో చూపించి పోలీస్ వ్యవస్థ అంటే ప్రజలలో నమ్మకానికి నాంది పలకాలని తెలంగాణ స్టేట్ పోలీస్ కంప్లెంట్ అథారిటీ డైరెక్టర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన మోత్కూరులోని గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలీసులు ప్రజలతో ఫ్రెండ్లీగా ఉంటే మంచి స్నేహ సంబంధాలు ఏర్పడి భయం అనేది పోయి ప్రజలు తమ సమస్యలను చెప్పుకోవడానికి నేరుగా పోలీస్ స్టేషన్కు వచ్చి సమస్యలు చెప్పుకుంటారనేది వాస్తవమని అన్నారు. ప్రజలు సహకరిస్తేనే పోలీసులు నేరాల నియంత్రణలో విజయవంతం అవుతారని తెలిపారు. పోలీస్ అధికారులు



వివిధ సమస్యలపై పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితుల పట్ల నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, బాధితుల సమస్యలను తమ సమస్యలుగా భావించి వేగంగా చర్యలు తీసుకుంటే ప్రజల్లో పోలీస్ అధికారులకు మంచి గుర్తింపు లభిస్తుందని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో పోలీస్ అథారిటీ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. పోలీసులు ఇబ్బంది పడ్డా అథారిటీ వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తుందని తెలిపారు. పోలీసులు మంచి వారితో మంచిగా ఉండాలని, క్రిమినల్స్ తో కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల విశ్వాసమే పోలీసుల బలం అన్నారు. చట్టాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. చట్టాలపై సామాన్యులకు అవగాహన కల్పించడంలో జర్నలిస్టులు, మేధావులు, విద్యావంతులు కృషి చేయాలని కోరారు. సమాచార హక్కు చట్టం ద్వారా 50% అవినీతి నిరోధించడం జరిగిందని తెలిపారు. తాను సమాచార హక్కు చట్టం కమిషనర్ గా పని చేసిన కాలంలో పదివేల నుండి 12000 కేసులు పరిష్కరించగలిగానని తెలిపారు. సమాచార హక్కు చట్టం వల్ల అధికారులు క్రమశిక్షణతో పని చేసే పరిస్థితులు ఏర్పడతాయని, దీనివల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.

జర్నలిస్టులకు కూడా ఈ చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. జర్నలిస్టులు ఏదైనా సమస్యపై వార్త రాస్తే పూర్తి వివరాలు ఈ చట్టం ద్వారా అధికారుల నుండి , ప్రభుత్వ కార్యాలయాల నుండి లభించడం జరుగుతుందని తెలిపారు. మోత్కూరు పాత తాలూకా పరిధిలో పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని, డివిజనల్ సూపరింటెండెంట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయుటకు కృషి చేయాలని కోరుతూ మోత్కూరు నియోజకవర్గ సాధన సమితి ఆధ్వర్యంలో జర్నలిస్టులు వినతి పత్రం అందజేశారు.

అనంతరం పోలీస్ అథారిటీ డైరెక్టర్ గా నియామకమైన సందర్భంగా జర్నలిస్టులు వెంకటేశ్వర్లు ను శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఎస్ ఎన్ చారి, కాయితాల నర్సిరెడ్డి, గుంటి ఐలయ్య, ఆకవరం శ్రీనివాస్ చారి, గాదెనబోయిన నాగరాజు, బుర్ర శ్రీను, వారాల రాకేష్, కూరెళ్ళ వెంకన్న, అవిశెట్టి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ తీరంలో సరికొత్త హంగులు

నాగార్జునసాగర్ మే 22 ప్రజా జ్యోతి : ప్రపంచ ప్రసిద్ధి గాంచిన నాగార్జునసాగర్ జలాశయం,చారిత్రక నేపథ్యం ఉన్న నందికొండ పట్టణం త్వరలోనే సరికొత్త రూపురేఖలను సంతరించుకోనున్నాయి. నాగార్జునసాగర్ పరిసర ప్రాంతాలను అంతర్జాతీయ స్థాయి పర్యాటక హబ్‌గా, అలాగే విదేశీ తరహా డెస్టినేషన్ వెడ్డింగ్స్ వేదిక గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికలను సిద్ధం చేస్తోంది.కేంద్ర ప్రభుత్వ స్వదేశీ దర్శన్ 2.0 పథకంలో భాగంగా నందికొండలోని



బుద్ధవనం ప్రాజెక్టును అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక కేంద్రంగా మార్చే పనులు వేగంగా సాగుతున్నాయి. సుమారు రూ. 25 కోట్ల వ్యయంతో ఇక్కడ అత్యాధునిక డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్,గ్రీన్ టూరిజం ప్రాజెక్టులను నిర్మిస్తున్నారు.ఇటీవల బుద్ధవనంలో ప్రతిష్ఠించిన భగవాన్ బుద్ధుని పవిత్ర అస్థికలు అంతర్జాతీయ పర్యాటకులను, ముఖ్యంగా ఆగ్నేయాసియా దేశాల బౌద్ధ భిక్షువులను భారీగా ఆకర్షిస్తున్నాయి.

తెలంగాణ పర్యాటక శాఖ నందికొండ, సాగర్ బ్యాక్ వాటర్స్ పరిసరాలను అంతర్జాతీయ వివాహ వేదికలుగా మార్చాలని నిర్ణయించింది,ప్రకృతి రమణీయత,కృష్ణా నది అందాలు కలగలిసిన నందికొండ హిల్ కాలనీ పరిసర ప్రాంతాల్లో ప్రైవేట్ భాగస్వామ్యంతో లగ్జరీ రిసార్టులు,టెంట్ సిటీలు,ఫ్లోటింగ్ డెక్స్ (నీటిపై తేలియాడే వేదికలు) ఏర్పాటు చేయనున్నారు.ఇది స్థానిక యువతకు వందలాది ఉపాధి అవకాశాలను తెచ్చిపెట్టనుంది,అలాగే నందికొండ మున్సిపాలిటీ పరిధిలో పర్యాటక రంగం అభివృద్ధి చెందితే స్థానిక వ్యాపారాలు ఊపందుకుంటాయి.స్థానిక ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి నాయకత్వంలో నందికొండ పట్టణ మౌలిక వసతుల కల్పనకు, పర్యాటక ప్రాజెక్టుల వేగవంతమైన పూర్తికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం అని మున్సిపల్ వర్గాలు తెలిపాయి.సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం పెరిగినప్పుడు నందికొండ నుంచి శ్రీశైలానికి నడిచే లగ్జరీ క్రూయిజ్ (లాంచీ) ప్రయాణం ఇప్పటికే పర్యాటకు






లను అలరిస్తోంది.రాబోయే రోజుల్లో ఈ పర్యాటక హంగులు పూర్తిగా అందుబాటులోకి వస్తే,నందికొండ పట్టణం గ్లోబల్ టూరిజం మ్యాప్‌లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవడం ఖాయం అని స్థానిక ప్రజలు పర్యాటక ప్రేమికులు ఆశిస్తున్నాను.

# ప్రభుత్వ ఆసుపత్రిపై పెరుగుతున్న విశ్వాసం

### వరుసగా 6 సాధారణ ప్రసవాలు

### వైద్య సిబ్బంది సేవలకు ప్రశంసలు

నూతనకల్... మే 19 (ప్రజా జ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న మెరుగైన వైద్య సేవలపై ప్రజల్లో విశ్వాసం రోజురోజుకు పెరుగుతోందని మండల వైద్యాధికారిని డాక్టర్ కీసర ఆశిత రెడ్డి అన్నారు మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పెద్దనేమీల గ్రామానికి చెందిన కనకం త్రిష పురిటి నొప్పులతో ఈరోజు సుమారు 11 గంటలకు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని సాయంత్రం ఐదు గంటలకు సాధారణ డెలివరీ అయినట్లు వారు తెలిపారు తల్లి బిడ్డ క్షేమంగా ఉంటారని వారు తెలిపారు. ప్రజలు



ప్రభుత్వ ఆస్పటల్ మీద విశ్వాసానికే నిదర్శనంగా ఆసుపత్రిలో వరుసగా ఆరు సాధారణ ప్రసవాలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు.

గర్భిణులకు సమయానికి వైద్య పరీక్షలు, తగిన సూచనలు, ప్రసవ సమయంలో వైద్యుల పర్యవేక్షణతో పాటు సిబ్బంది అంకితభావంతో పనిచేయడం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సురక్షిత ప్రసవాలకు అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులపై ఆధారపడకుండా ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. వరుసగా ఆరు నార్మల్ డెలివరీలు నిర్వహించడం ఆసుపత్రి వైద్య బృందం పనితీరుకు నిదర్శనమని అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ప్రసూతి వైద్యులు, స్టాఫ్ నర్సులు మరియు ఇతర సిబ్బందిని అభినందించారు.

"తల్లి, శిశువు ఆరోగ్యాన్ని కాపాడటం మా ప్రధాన లక్ష్యం. సాధారణ ప్రసవాలపై ప్రజల్లో అవగాహన పెరగడం సంతోషకరం" అని వైద్య సిబ్బంది తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణల డెలివరీలు చేస్తున్న వైద్య సిబ్బందిని స్థానిక సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్ అభినందించారు

# వడదెబ్బలపై అప్రమత్తంగా ఉండాలి

### సూర్యాపేట డిప్యూటీ డీఎంహెచ్ఓ గాజుల చంద్రశేఖర్

తుంగతుర్తి, మే 22,(ప్రజా జ్యోతి): వడదెబ్బ పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డిఎంహెచ్ఓ గాజుల చంద్రశేఖర్ సూచించారు.తుంగతుర్తి



మండలం కేంద్రానికి చెందిన చర్లపల్లి సోమయ్య వడదెబ్బతో మృతి చెందిన నేపథ్యంలో, జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓ గాజుల చంద్రశేఖర్ మృతుని కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, వేసవి కాలంలో ప్రజలు వడదెబ్బల నివారణపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అధిక ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున అత్యవసర పరిస్థితులు మినహా మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఉండేందుకు తరచూ నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణాలు వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు మరియు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు మరింత అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. తలనొప్పి, అధిక చెమటలు, నీరసం, తల తిరగడం, శరీర



ఉష్ణోగ్రత పెరగడం వంటి వడదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి వైద్య సేవలు పొందాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వడదెబ్బల నివారణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఆరోగ్య శాఖ నిరంతరం చర్యలు చేపడుతోందని తెలిపారు. వేసవి కాలంలో అప్రమత్తంగా ఉండటం ద్వారా వడదెబ్బలను నివారించి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రావులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ లింగమూర్తి, జిల్లా ఎపిడెమియాలజిస్ట్ సతీష్ కుమార్, సీహెచ్ఓ శ్రీనివాస్ రాజ్, హెచ్ఈఓ రవికుమార్, హెల్త్ అసిస్టెంట్లు కృష్ణమూర్తి, గాజుల సోమన్న, యాదగిరి, చారి, ఏఎన్ఎంలు భారతి, శైలజతో పాటు ఆశా కార్యకర్తలు ఉమ, సునీత పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలంటూ వి ఏ ఓ ల ధర్నా

మిర్యాలగూడ,మే 22, ( ప్రజాజ్యోతి ): ఐకెపి వివోఏలకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, పనిభారం తగ్గించాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ ఆవరణలో శుక్రవారం వివోఏ జెఏసి పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు . అధ్యక్ష కార్యదర్శులు కప్పల లక్ష్మి , బంటు చంద్రకళలు మాట్లాడుతూ కనీస



వేతనం రూ. 20వేలు ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, హెచ్ఆర్ పాలసీ వర్తింప చేయాలని, వివోఏ లకు సీసీలుగా పదోన్నతి కల్పించాలని, సాధారణ ఆరోగ్య భీమా రూ.20లక్షలు కల్పించాలని, ట్యాబ్ సౌకర్యం కల్పించాలని, జిఓ నెంబర్ 58 సవరించాలని డిమాండ్ చేశారు.తమ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని లేకుంటే సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి జానీ, లక్ష్మీపార్వతీ, విజయలక్ష్మి ,సావిత్రి, సుహాసిని, మంగమ్మ,, రజిని తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో దుక్కులు లోతుగా దున్నితే రైతుకు మేలు

### –ఇంచార్జ్ ఏ డి ఏ ఋష్యేంద్రమణి

మిర్యాలగూడ మే 22:– రైతులు వేసవిలో లోతుగా దుక్కులు దున్నితే భూసారం పెరిగి, మేలు జరుగుతుందని మిర్యాలగూడ ఇంచార్జి అసిస్టెంట్ డైరెక్టర్, ఎంఎఓ ఎం.ఋష్యేంద్రమణి అన్నారు. శుక్రవారం విలేఖరులతో మాట్లాడుతూ ఈ మేరకు వేసవి దుక్కి చేసే విధానంపై ప్రభుత్వ కార్యాలయాల వద్ద వాల్ పోస్టర్స్ అంటించడం తోపాటు,రైతులకు క్షేత్ర స్థాయి ఉద్యోగులతో అవగాహనా కల్పిస్తున్నామని ఆమె తెలిపారు. దుక్కి చేయడం వల్ల నేలల్లో పురుగుల గుడ్లు నశిస్తాయని, కలుపు మొక్కలు తగ్గుతాయన్నారు.నేల గాలి ప్రసరణ



మెరుగు పడుతుందని, నేలలో హానికర శిలీంధ్రాలు తగ్గుతాయన్నారు.నేల సారవంతం మెరుగవుతుందని, ఎరువుల వినియోగం తగ్గుతుందని, నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు.ఖరీఫ్ సీజన్ దిగుబడి పెరుగుతుందన్నారు. కాబట్టి రైతులు దుక్కిదున్నే విధానంపై అవగాహన పెంచుకొని వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు.

### సిరికొండ తూంపల్లి

## సొసైటీల ఆధ్వర్యంలో జీలుగు విత్తనాల పంపిణీ





**సిరికొండ( ప్రజా జ్యోతి )మే 22** తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా సిరికొండ మండల రైతులకు సబ్సిడీ పైన జిలుగ విత్తనాలు పంపిణీ సిరికొండ మరియు తుంపల్లి సొసైటీలో పరిధిలో అందించడం జరిగినది. జిలుగు విత్తనాలు పొలంలో చల్లుకొని నీటిని ఇవ్వాలి. మొలకెత్తిన తర్వాత 40 నుంచి 45 రోజులలో మొక్క పూత దశలో ఉన్నప్పుడు పొలంలో నీరు పెట్టుకుని కలియ దున్నుకోవాలి. ఇలా చేయడం వల్ల జీలుగ మొక్కలు నీళ్లలో కుళ్ళిపోయి నెలకు సేంద్రియ కార్బన్, మరియు గాలిలోని యూరియాను స్థిరీకరించి మొక్కకు అందే విధంగా చేయును. యూరియా వాడకం సుమారు సగ బ్యాగు నుంచి ఒక బ్యాగ్ వరకు తగ్గును. 30 కిలోల బ్యాగు వచ్చేసి రెండు నుంచి మూడు ఎకరాల వరకు వాడుకోవచ్చు. 30 కిలోల బ్యాగు ధర 2453 రూపాయలు. ఈ కార్యక్రమంలో సిరికొండ సొసైటీ చైర్మన్ గంగాధర్ మరియు డైరెక్టర్లు, తుంపల్లి సొసైటీ చైర్మన్ రాములు నాయక్, వైస్ చైర్మన్ అబ్బాస్ మరియు డైరెక్టర్లు, జజూా గిరి, దేవిలాల్. హీరా నర్సయ్య మరియు రైతులు పాల్గొనారు.

## అత్యవసర సమయంలో అండగా సీఎం సహాయనిధి

### – 5లక్షల ఎలఓసి లెటర్‌ను అందజేసిన ఎమ్మెల్యే డాఆర్ భూపతి రెడ్డి



**సిరికొండ (ప్రజా జ్యోతి) మే 22** నిరుపేదలకు అత్యవసర సమయంలో కొండంత అండగా ముఖ్యమంత్రి సహాయనిధి ఉపయోగపడుతుందని నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి పేర్కొన్నారు. సిరికొండ మండలం చింతల్ తండాకు కు చెందిన లి కే.నికిత్ లి అనారోగ్య సమస్యలతో.. హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శస్త్ర చికిత్స నిమిత్తం రూ.5 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు సూచించారు. దీంతో రూ.5లక్షలకు సంబంధించి ఎల్.ఓ.సి లెటర్ ను బాధిత కుటుంబ సభ్యులలకు ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రన్న ఎమ్మెల్యే కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## తిరుమన్‌పల్లిలో దొంగతనం






**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) మే. 22** ఇందల్వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన బొడ్డు పెద్ద రాజన్న, వయస్సు 55 సంవత్సరాలు, వృత్తి వ్యవసాయం, తాటిపాముల శ్రీనివాస్ గౌడ్ ఇంటిలో జరిగిన చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ప్రకారం, ఫిర్యాదుదారుల ఇంటి గుర్తు తెలియని వ్యక్తులు తలుపు గడియ కత్తిరించి తలుపులు తెరిచి ఇంట్లోకి ప్రవేశించి బీరువా లు పగులగొట్టి అందులో ఉంచిన బంగారు-7.5 తులల, వెండి ఆభరణాలు-26 తులలు నగదు దొంగిలించబడినట్లు గుర్తించారు. బొడ్డు పెద్ద రాజన్న తాటిపాముల శ్రీనివాస్ గౌడ్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు

## ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి: పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి సురేష్



**కామారెడ్డి ప్రతినిధి మే 22. (ప్రజాజ్యోతి)** పిడిఎస్యు రాష్ట్రకమిటి పిలుపులో భాగంగా ప్రైవేట్,కార్పొరేటు విద్యాసంస్థల్లో ప్రభుత్వాలు పీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పిడిఎస్‌యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్యు రాష్ట్ర కార్యదర్శి జి సురేష్ మాట్లాడుతూ, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలలో రోజురోజుకూ పెరుగుతున్న అధిక ఫీజులను నియంత్రించేందుకు ప్రభుత్వం వెంటనే కఠినమైన ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థులు, తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్న కార్పొరేట్ మరియు ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలలు మరియు ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య ప్రతి ఒక్కరి హక్కు అని, దానిని ధనికులకు మాత్రమే పరిమితం చేసే విధానాలను ప్రభుత్వం అరికట్టాలని కోరారు. ఫీజుల నియంత్రణ చట్టం ద్వారా జిల్లా స్థాయిలో ఫీజుల నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేసి, ప్రతి విద్యాసంస్థ ఫీజు నిర్మాణాన్ని పారదర్శకంగా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే అధిక ఫీజులు వసూలు చేసే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు, తల్లిదండ్రుల సమస్యల పరిష్కారానికి పిడిఎస్యు విద్యార్థి సంఘం ఎల్లప్పుడూ పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ఈ ఉద్యమంలో తల్లితండ్రులు, విద్యార్థులు, యువతీ యువకులు, మేధావులు, ముందుకు రావాలని కోరినారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా నాయకులు రాకేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో

## సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

### – పాటలు, సందేశాత్మక ప్రదర్శనల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించిన పోలీస్ కళాబృందం





**కామారెడ్డి ప్రతినిధి మే 22. (ప్రజాజ్యోతి)** కామారెడ్డి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మద్నూర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో కళాబృందం ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు మద్నూర్ ఎస్ఐ శ్రీ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రజలకు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీలు, బ్యాంక్ ఖాతా వివరాలు, ఏటీఎం పిన్‌లు ఎవరికీ తెలియజేయవద్దని తెలిపారు. బ్యాంక్ అధికారులు గానీ, పోలీస్ అధికారులు గానీ ఎప్పటికీ ఓటీపీలు అడగరని స్పష్టం చేశారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్-100ను సంప్రదించాలని సూచించారు. పోలీస్ కళాబృందం ఇన్‌చార్జ్ హెడ్ కానిస్టేబుల్స్ రామంచ తిరుపతి, శేషరావు, పీసీలు ప్రభాకర్, సాయిలు పాటలు, సందేశాత్మక ప్రదర్శనల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో బాన్స్వాడ షీ టీమ్ పీసీ అనిల్, డబ్ల్యూపీసీ పార్వతి, బ్లూ కోట్స్ మేనేజర్ నవీన్, బ్యాంక్ సిబ్బంది మరియు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బ్యాంక్ వినియోగదారులు పాల్గొన్నారు.

### జిల్లా సెంట్రల్ జైలులో

## "మూలాఖత్ లీగల్ ఎయిడ్ హెల్ప్ డెస్క్" ప్రారంభం




**నిజామాబాద్ ప్రజాజ్యోతి మే 22** జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్ర కారగారంలో మూలాఖత్ లీగల్ ఎయిడ్ హెల్ప్ డెస్క్ ను సంస్థ డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జి ఉదయ కృష్ణ, సబ్ జైలర్ మన్మధ రావు తో కలిసి ప్రారంబించారు. ఈ సందర్బంగా ఉదయ కృష్ణ మాట్లాడుతూ జైలులో ఉన్న ఖైదీలను కలవడానికి వచ్చే వారి కోసం హెల్ప్ డెస్క్ హెల్ప్ ఫుల్ గా తెలిపారు. జ్యూడిషియల్ రిమాండ్ ఉన్న ఖైదీలు, కోర్టుల ద్వారా శిక్షకు గురి కాబడిన ఖైదీల బంధుమిత్రులు మూలాఖత్ కు రావడం జరుగుతుందని వారికి ఎలాంటి ఇబ్బదులు లేకుండా ఖైదీలతో మూలాఖత్ కు వీలు కల్పిస్తామని అన్నారు. ఖైదీలకు, వారిని చూడటానికి వచ్చేవారికి సందానకర్తగా ఉండి హెల్ప్ డెస్క్ పని చేస్తుందని పేర్కొన్నారు.మూలాకత్ కు వచ్చే వారిలో అత్యధికులు నిరక్షరాస్యులు ఉంటారని వారికి మూలాకత్ దరఖాస్తు నింపి సహాయం చేస్తామని ఆయన తెలిపారు.ఇంకా ఏదైనా న్యాయ సహాయం అందిచడానికి సహాయకారులుగా హెల్ప్ డెస్క్ ఉపయోగకరంగా ఉ ంటుందని అన్నారు. జైలు మూలాకత్ గదిలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.మూలాకత్ లీగల్ ఎయిడ్ హెల్ప్ డెస్క్ లో ఇద్దరు న్యాయసేవ సంస్థ ప్యానల్ న్యాయవాదులు,జైలర్, మరో ముగ్గురు పారా లీగల్ వాలంటీర్స్ సభ్యులుగా ఉంటారని ఆయన వివరించారు.హెల్ప్ డెస్క్ ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందని తెలిపారు.కార్యక్రమంలో సంస్థ డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మహమ్మద్ షాదుల్ల, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శుభం,ప్యానల్ న్యాయవాదులు లక్ష్మి నారాయణ, ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

### డ్రగ్స్, గంజాయి నిర్మూలన కోసం

## ప్రత్యేక దాడులు కొనసాగించాలి: సిపి సాయి చైతన్య

### – బోధన్ డివిజన్‌లో నేరాల నియంత్రణపై సమగ్ర సమీక్ష సమావేశం

### – బక్రీద్ బందోబస్తుపై ప్రత్యేక దృష్టి – రోడ్డు ప్రమాదాల నివారణకు స్పెషల్ డ్రైవ్‌లు








**బోధన్ ఆర్.సి మే 22 (ప్రజాజ్యోతి):** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బోధన్ డివిజన్‌లో పెండింగ్ కేసుల పురోగతి, నేరాల నియంత్రణ చర్యలపై పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య శుక్రవారం సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. బోధన్ ఏసీపీలు, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, ఎస్సైలు, ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ బక్రీద్ పండుగ నేపథ్యంలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, చెక్‌పోస్టుల వద్ద 24 గంటల తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. వాహనాల తనిఖీల్లో అలసత్వం సహించబోమన్నారు. హత్యలు, హత్యాయత్నాలు, చోరీలు, మహిళలపై నేరాలు, సైబర్ మోసాలు, డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, పేకాట, గుట్కా అక్రమ వ్యాపారాలపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. పెండింగ్ కేసులను వేగంగా పూర్తి చేసి బాధితులకు త్వరిత న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రౌడీషీటర్లు, పాత నేరస్థులు, బెయిల్‌పై విడుదలైన వారిపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పహారా బలోపేతం చేయాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల తనిఖీలను కట్టుదిట్టంగా నిర్వహించాలని తెలిపారు. బోధన్ సబ్‌డివిజన్ మహారాష్ట్ర సరిహద్దుకు ఆనుకుని ఉండటంతో సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అక్కడి పోలీసులతో సమన్వయం పెంచుకోవాలని సూచించారు. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, షీ టీమ్స్, ఈగల్ టీమ్స్, చీతా ఫోర్స్ మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో పర్యవేక్షణ పెంచాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, ఆన్‌లైన్ మోసాల బాధితులకు వెంటనే స్పందించాలని తెలిపారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలన కోసం ప్రత్యేక దాడులు కొనసాగించాలని, అవసరమైతే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే పేకాట, గుట్కా, ఇసుక తదితర అక్రమ వ్యాపారాలపై నిరంతర దాడులు నిర్వహించాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కమిషనర్ ఆదేశించారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి బ్లాక్‌స్పాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. లింకు రోడ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం, రహదారులకు అడ్డంగా ఉన్న పొదలను తొలగించడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, త్రిబుల్ రైడింగ్, మైనర్లు వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని, ప్రజల్లో రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, ఏసీపీ రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ జి. మల్లేష్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆర్. అంజయ్యతో పాటు సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, ఎస్సైలు, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రజాపాలన ప్రగతి

## ప్రణాళిక జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహణ







**కామారెడ్డి ప్రతినిధి మే 22. (ప్రజాజ్యోతి)** కామారెడ్డి పట్టణంలోని సత్య గార్డెన్‌లో ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమీక్ష సమావేశం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ హాజరయ్యారు. కార్యక్రమంలో పోచారం శ్రీనివాస్ రెడ్డి, తోట లక్ష్మి కాంతారావు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ,కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలు ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సేవలు, భవిష్యత్ కార్యాచరణపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ.రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అవసరాలను కేంద్రబిందువుగా తీసుకొని పారదర్శక పరిపాలన అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు.ప్రజలకు ప్రభుత్వ సేవలు నేరుగా చేరే విధంగా అధికారులు పని చేయాలని సూచించారు. ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం కేవలం సమీక్ష సమావేశాలకు పరిమితం కాకుండా గ్రామాలు, పట్టణాల్లో కనిపించే మార్పుగా మారాలని అన్నారు. ప్రతి శాఖకు ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించిందని, వాటి అమలులో వేగం పెంచాలని సూచించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చివరి వ్యక్తికి చేరేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని, ప్రజల సమస్యలను వినడం మాత్రమే కాకుండా వాటికి త్వరితగతిన పరిష్కారం చూపాలని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు.వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, తాగునీరు, రోడ్లు, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో జిల్లా స్థాయిలో మరింత మెరుగైన ఫలితాలు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు ప్రభుత్వంపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే బాధ్యత ప్రతి అధికారిపై ఉందని తెలిపారు.ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమం ప్రజల జీవన ప్రమాణాలను పెంచే దిశగా ఉండాలని, సమయపాలనతో పనులు పూర్తి చేసి జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపాల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, అదనపు కలెక్టర్ గిరి, డీఎస్పీ మధుసూదన్, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్లు లక్ష్మి, పాత రాజు, పట్టణ అధ్యక్షులు సందీప్, కౌన్సిలర్లు అంజాద్, వాజీద్, మజీద్, కాళ్ళ గణేష్, గడ్డమీది మహేష్, లడ్డు, సత్యం, షేరు, జిల్లా నాయకులు అశోక్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గొనె శ్రీనివాస్, సుదర్శన్, మండల అధ్యక్షులు రాజగోడ్, శ్రీనివాస్, నౌసిలాల్, కృష్ణ రావు, మాజీ మండల అధ్యక్షులు సుతారి రమేష్, అనంత్ రెడ్డి, గూడెం శ్రీనివాస్, యాదవ రెడ్డి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భాగ్యరెడ్డి వర్మ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహణ



**కామారెడ్డి ప్రతినిధి మే 22. (ప్రజాజ్యోతి)** సామాజిక సంస్కర్త, దళితోద్యమ ప్రముఖ నాయకుడు భాగ్యరెడ్డి వర్మ జయంతి ఉత్సవాలను శుక్రవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ జ్యోతి ప్రజ్వలన గావించి, భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భాగ్యరెడ్డి వర్మ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారని అన్నారు. విద్య, సామాజిక సమానత్వం, హక్కుల సాధన కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు విద్యే ప్రధాన ఆయుధమని భావించి, వారికి చైతన్యం కల్పించేందుకు ఆయన నిరంతరం కృషి చేశారని తెలిపారు.భాగ్యరెడ్డి వర్మ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమానత్వ భావనతో సమాజ అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఎస్సీ డెవలప్మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో మరణించిన సాయిలు



**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి) మే. 22** ఇందల్వాయి మండల కేంద్రంలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన సంబారి సాయిలు గత కొన్ని రోజులుగా నల్లవెల్లి గ్రామం నుంచి బోర్గం బి గ్రామంలో ఉంటున్న అతనికి అనుకోకుండా హాట్ స్టాక్ రావడంతో నిన్నటి రోజున చ ని పో ం ు ు న ట్ట బంధువులు తెలిపారు సాయిలు వయసు 45. ఇతనికి ఒక కుమారుడు కూతురు భార్య ఉన్నారు ఇతను ఆత్మీయంగా అందరితో కలిసి మెలిసి తిరిగేవాడని బంధువులు అన్నారు.

# కార్మికోద్యమ కెరటం పర్స సత్యనారాయణ

- ఘనంగా 11వ వర్ధంతి వేడుకలు
- నివాళులర్పించిన సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం



**నర్సాపూర్ మే 22 (ప్రజాజ్యోతి)** కార్మికోద్యమమే ఊపిరిగా, శ్రామిక లోకం సమస్యలపై అసెంబ్లీలో ప్రజా గొంతుకను వినిపించిన మహోన్నత నేత పర్స సత్యనారాయణ అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం కొనియాడారు. నర్సాపూర్ ఎల్లంకి కళాశాలలో శుక్రవారం నిర్వహించిన సీఐటీయూ ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబంలో జన్మించిన పర్స సత్యనారాయణ, 19 ఏళ్ల ప్రాయంలోనే కార్మికరంగంలోకి అడుగుపెట్టి సీఐటీయూ ఆవిర్భావంలో కీలక పాత్ర పోషించారన్నారు. ప్రజా పక్షాన పోరాటాలు చేస్తూ ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో కార్మికుల గొంతుకగా నిలిచారని స్మరించుకున్నారు. 2015లో ఆయన మరణించినా.. ఆయన చేసిన పోరాటాలు చరిత్రలో సదా నిలిచి ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కడారి నాగరాజు, నర్సింలు, చంద్రయ్య, రుబ్లీ, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

# తూప్రాన్ మున్సిపాలిటీలో కో-ఆప్షన్ ఎన్నికల సందడి



**తూప్రాన్ (ప్రజాజ్యోతి), మే 22:** మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీలో జరుగనున్న కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికలకు సంబంధించి శుక్రవారం నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. శుక్రవారం నామినేషన్ల ప్రక్రియ ఉత్సాహంగా కొనసాగగా, వివిధ రాజకీయ, సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులు భారీగా బరిలోకి దిగడంతో ఎన్నికల సందడి మరింత ఊపందుకుంది. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, నాచారం దేవాలయ కమిటీ చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్తా ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్లు రామునిగారి శ్రీశైలం గౌడ్, మామిడి వెంకటేష్‌లు కో-ఆప్షన్ సభ్యత్వానికి తమ నామినేషన్లు దాఖలు చేశారు. ఇక బీఆర్ఎస్ పార్టీ తరపున మన్నే శ్రీనివాస్, తలారి మల్లేష్ కూడా తమ నామినేషన్ పత్రాలను సమర్పించి పోటీలో నిలిచారు. దీంతో కో-ఆప్షన్ ఎన్నికల్లో రాజకీయ పోటీ మరింత రసవత్తరంగా మారింది. ప్రస్తుతం వరకు మొత్తం 10 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచినట్లు సమాచారం.

# ప్రజాపాలనలో వడ్లతో ఇబ్బందులు పడుతున్న రైతులు

- వడ్ల కొనుగోలులో నిర్లక్ష్య ధోరణి వీడి కొనుగోళ్లు వేగవంతం చేయాలి
- సిపిఎం మండల కార్యదర్శి తాడూరి రవీందర్ డిమాండ్



**కొమురవెల్లి, మే 23 (ప్రజాజ్యోతి):-** ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని సిపిఎం పార్టీ కొమురవెల్లి మండల కార్యదర్శి తాడూరి రవీందర్ విమర్శించారు. శుక్రవారం కొమురవెల్లి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు మార్కెట్లలో వడ్ల బస్తాలు రోజుల తరబడి పేరుకుపోయి లారీలు సకాలంలో రాకపోవడంతో బస్తాలకు చెదలు పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి వడ్ల గింజను కొనుగోలు చేస్తామని గొప్పలు చెబుతున్నప్పటికీ, మండలంలోని మార్కెట్లలో కనీసం 40 శాతం ధాన్యం కూడా కొనుగోలు కాలేదని విమర్శించారు. రోహిణి కార్తె ప్రారంభమై వర్షాలు కురిస్తే మార్కెట్లలో ఉన్న వడ్లు తడిసి రైతులకు తీవ్ర నష్టం కలుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మాటలు మాని ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి సారించి, లారీలు సకాలంలో వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైస్ మిల్లుల యాజమాన్యాలు వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో తాలు, ముక్క పేర్లతో బస్తాకు రెండు నుంచి నాలుగు కిలోల వరకు కోత విధిస్తూ రైతులను నష్టపరుస్తున్నాయని ఆరోపించారు. ఎలాంటి కొర్రీలు లేకుండా ధాన్యం కొనుగోలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే హమాలి కార్మికులు ఎండల్లో పనిచేసి అనారోగ్యానికి గురవుతున్నారని, వారికి ప్రభుత్వం గుర్తింపు కార్డులు జారీ చేసి హెల్త్ ఇన్సూరెన్స్, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి, మండల నాయకులు సార్ల యాదయ్య, మ్యాకల మల్లేశం, తాడూరి ప్రశాంత్, నూకల శ్రీనివాస్, పాకనాటి బాలు, తాడూరి భరత్ కుమార్, పుట్ట అంజయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి
- కనీస వేతనాల అమలు పట్ల సీఎం రేవంత్, మంత్రి వివేక్ చిత్రపటాలకు పాలాభిషేకం





**తొగుట, మే 22 (ప్రజాజ్యోతి):** కార్మికుల హక్కుల పరిరక్షణ ఉపాధి భద్రత, సామాజిక భద్రత కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కార్మికుల కనీస వేతనాల అమలుపై సీఎం రేవంత్ రెడ్డి తీసుకొన్న నిర్ణయంపై శుక్రవారం తొగుట మండల కేంద్రంలో సంబరాలు నిర్వహించి రాష్ట్ర ముఖ్యమంత్రి, రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామిల చిత్రపటాలకు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి కార్మిక సంఘాలు పరిశ్రమల ప్రతినిధులతో విస్తృతంగా చర్చించి జూన్ 1 నుంచి కొత్త కనీస వేతనాలను అమలు చేయాలని నిర్ణయించిందని, కార్మికుల సంక్షేమంతో పాటు పరిశ్రమల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఉభయ పక్షాలకు ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం అన్ స్కిల్డ్, సెమీస్కిల్డ్ , స్కిల్డ్, హైలీ స్కిల్డ్ గా నాలుగ విభాలుగా విభజించి కనీస వేతనాల అమలుపై నిర్ణయం తీసుకుందన్నారు. గత ప్రభుత్వంలో కార్మికుల సంక్షేమాన్ని, కనీస వేతనలా పెంపును పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగానే కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి వర్గ ఉపసంఘం సమావేశంలో కార్మికుల పట్ల సానుకూలంగా నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల రాష్ట్రంలో ఒక కోటి పదకొండు లక్షల కార్మిక కుటుంబాలకు లబ్ది చేకూరుతుందన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరల వల్ల నిరుపేద కుటుంబాలు ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సీఎం నిర్ణయం వల్ల కార్మికుల కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్), మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు పిట్ల సత్తయ్య, సర్పంచులు పాగాల శోభా కొండల్ రెడ్డి, రాంపురం రమేష్, లచ్చోళ్ళ రవీందర్, ఉపసర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు ఉపేందర్, ఉపసర్పంచ్ లు గౌస్, తిరుపతి, డైరెక్టర్లు బాలమల్లు, అన్సర్, నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు భూపాల్ రెడ్డి, శ్రీనకర్ రెడ్డి, మల్లారెడ్డి, మహిపాల్ రెడ్డి, భరత్ తేజ, పోచయ్య, రవీందర్, బాల్ రెడ్డి, నరసింహులు, రమేష్ గౌడ్, నర్సింలు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల తప్పిదం వల్లే నా పట్టా భూమి సమస్య

- అమెరికా నుంచి వచ్చిన రైతు
- రవి శంకర్ 14 గుంటల భూమిని మరొకరి పేరు పై నా మార్చిన రెవిన్యూ అధికారులు
- ఐదు నెలలుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతు
- గ్రీన్ కార్డు గడువు సమీపిస్తున్నా న్యాయం లేకపోవడంతో జిన్నారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా
- సంగారెడ్డి ఆర్డీఓ హామీతో దీక్ష విరమింపజేసిన రవిశంకర్





**జిన్నారం/ప్రజాజ్యోతి** అమెరికాలో స్థిరపడిన ఓ రైతు తన స్వగ్రామం శివనగర్ లో ఉన్న తన పట్టా భూమి కోసం స్వదేశానికి పరుగెత్తుకొచ్చరు ఐదు నెలలుగా అధికారుల చుట్టూ తిరిగినా న్యాయం దక్కకపోవడంతో విసుగెత్తిపోయి చివరకు జిన్నారం తహశీల్దార్ కార్యాలయం ఎదుటే దీక్షకు దిగారు, మండల పరిధిలోని శివనగర్ గ్రామానికి చెందిన రైతు రవి శంకర్ (82)కు చెందిన సర్వే నంబర్ 172లోని 14 గుంటల పట్టా భూమి ఉన్నది దీనిని సంబంధం లేని మరో వ్యక్తి పేరుపై రెవెన్యూ అధికారులు మార్చారు, ఈ విషయం తెలుసుకున్న రవి శంకర్ అమెరికా నుంచి హుటాహుటిన స్వగ్రామానికి చేరుకుని, గత ఐదు నెలలుగా రెవెన్యూ అధికారులను కలిసి తన భూమి హక్కుల కోసం పోరాడుతున్నారు. అయితే ఎవరూ తన సమస్యను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా, ఆధారాలు చూపించినా అధికారులు స్పందించలేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జిన్నారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతు రవి శంకర్(82) ధర్నాకు దిగారు. "నా భూమిని తిరిగి నా పేరుపై నమోదు చేసే వరకు ఇక్కడి నుంచి కదిలేది అంటూ స్పష్టం చేశారు. మరోవైపు జూన్ మొదటి వారంతో తన అమెరికా గ్రీన్ కార్డు గడువు ముగియనుందని, తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ న్యాయం కోసం ఇక్కడే ఉండాల్సి వస్తోందని కన్నీటి పర్యంతమయ్యారు. రైతు చేస్తున్న దీక్షకు స్థానికులు, రైతు సంఘాల నాయకులు మద్దతు తెలుపుతున్నారు. రెవెన్యూ శాఖ నిర్లక్ష్యంపై మండిపడుతూ, వెంటనే విచారణ జరిపి బాధిత రైతుకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. విషయం తెలుసుకున్న సంగారెడ్డి ఆర్డీవో రైతు రవిశంకర్ తో సెల్ ఫోన్ లో మాట్లాడి పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడంతో రవిశంకర్ దీక్ష నిర్మింప చేశారు.

# ఇస్నాపూర్ మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి.. సంక్షేమ కార్యక్రమం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి - వివిధ కాలనీలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన








**పటాన్ చెరు/ప్రజాజ్యోతి** ఇస్నాపూర్ మున్సిపాలిటీ ప్రజలు ఎంతో నమ్మకంతో బిఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టారని.. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి కాలనీలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని పాశమైలారం, ఇస్నాపూర్, చిట్కుల్ వార్డులలో అంతర్గత మురుగునీటి కాలువలు, సిసి రోడ్ల నిర్మాణ పనులకు పాలకవర్గం సభ్యులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డు శరవేగంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. పారిశ్రామికవాడగా ఉండడంతో పెద్ద ఎత్తున ప్రజలు ఉపాధి పొందుతూ ఇక్కడే స్థిర నివాసం ఏర్పరచుకుంటున్నారని పేర్కొన్నారు.. ఇందుకు అనుగుణంగా ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వ సహకారం.. పరిశ్రమల సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుమలత, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, సీనియర్ నాయకులు, కౌన్సిలర్ పాండు, మాజీ ఎంపీటీసీ నరేందర్ రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్ లు మమత, వెంకటేష్, ఆంజనేయులు, రాహుల్ రెడ్డి, ఈశ్వరమ్మ, కిషోర్ రెడ్డి, మంజుల, సంధ్య నవీన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, లత, అరుణ్, రాజు, కో ఆప్షన్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, నిజాముద్దీన్ బాబా, సోనియా రాజు, ఆసియా బేగం, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలే భరోసా

- ఎల్కేజీ నుంచి 5వ తరగతి వరకు అడ్మిషన్లపై ప్రత్యేక అవగాహన
- ఉచిత సదుపాయాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్య









**తూప్రాన్ (ప్రజాజ్యోతి) మే 22:** మెదక్ జిల్లా తూప్రాన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమం భాగంగా తూప్రాన్ ఎంపీపీఎస్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పట్లూరి లక్ష్మణ్ అధ్యక్షతన అంగన్వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న విద్యా సదుపాయాలను గ్రామ ప్రజలకు, తల్లిదండ్రులకు విస్తృతంగా తెలియజేయాలని నిర్ణయించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు పట్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ, తూప్రాన్ గ్రామంలోని మూడు సంవత్సరాలు పైబడిన చిన్నారులకు ప్రభుత్వ పాఠశాలలో ప్రీ ప్రైమరీ (ఎల్కేజీ, యూకేజీ) తరగతులను ప్రారంభించినట్లు తెలిపారు. టిటిసి పూర్తి చేసిన ప్రత్యేక ఉపాధ్యాయురాలి ద్వారా ఇంగ్లీష్ మీడియంలో బోధన అందిస్తున్నారని చెప్పారు. చిన్నారుల కోసం ప్రత్యేక తరగతి గది, ఆట వస్తువులు, సబ్జెక్టులకు సంబంధించిన విద్యా చిత్రాలతో గదిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దినట్లు వివరించారు. అదేవిధంగా విద్యార్థుల సంరక్షణ కోసం ఆయాను కూడా నియమించినట్లు తెలిపారు. పాఠశాలలో అన్ని తరగతుల విద్యార్థులకు ఫర్నిచర్, ఫ్యాన్లు, గ్రీన్ చాక్ బోర్డులు, కంప్యూటర్ శిక్షణ వంటి సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, రెండు జతల యూనిఫాంలు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాగిజావ అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అంగన్వాడీ టీచర్లు, ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలలో ఎల్కేజీ నుంచి 5వ తరగతి వరకు పిల్లలను చేర్పించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పద్మ, ఉమారాణి, ఇందిర, శ్రీలత, ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయురాలు రేఖ, ఆయా మౌనిక, సిఆర్పి కన్యాలాల్, తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# జిన్నారం ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త పరీక్షల సేవలు అస్తవ్యస్తం

- నెల రోజులుగా ల్యాబ్ సిబ్బంది గైర్హాజరు - పరీక్షలు లేక వెనుదిరుగుతున్న రోగులు - ప్రైవేట్ ఆసుపత్రుల బాట పడుతున్న పేద ప్రజలు



**జిన్నారం/ప్రజాజ్యోతి** ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. జిన్నారం ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త పరీక్షలు నిర్వహించే సిబ్బంది నెల రోజులుగా విధులకు హాజరుకాకపోవడంతో, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజూ వందల సంఖ్యలో వచ్చే పేషెంట్లకు వైద్యులు రక్త పరీక్షలు రాస్తున్నప్పటికీ, పరీక్షలు చేసే సిబ్బంది లేకపోవడంతో ల్యాబ్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆసుపత్రిలో రక్త నమూనాలు సేకరించే గది ఎప్పుడూ ఖాళీ కుర్చీలతోనే కనిపిస్తోందని రోగులు వాపోతున్నారు. "సిబ్బంది సెలవులో ఉన్నారు", "ఆసుపత్రి పనిమీద వెళ్లారు" అంటూ అధికారులు సమాధానాలు చెబుతున్నారని, కానీ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జ్వరం, షుగర్, వైరల్ ఇన్ఫెక్షన్ , రక్తహీనత వంటి అనారోగ్యాలతో వచ్చే రోగులకు పరీక్షలు అత్యవసరం అయినప్పటికీ, ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు అందకపోవడంతో ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తున్నదని బాధితులు చెబుతున్నారు. దీంతో పేద కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. "ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే ఉచిత వైద్యం అందుతుందని భావిస్తున్నాం. కానీ పరీక్షలు లేక బయటకు పంపించడం దారుణం. ప్రైవేట్ కేంద్రాల్లో పరీక్షలకు వందల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది" అంటూ పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, విధులకు నిర్లక్ష్యంగా దూరంగా ఉంటున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఆసుపత్రిలో నిరంతరం అందుబాటులో ఉండే ల్యాబ్ సిబ్బందిని నియమించి, రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని కోరుతున్నారు.

## షీ టీం ఆధ్వర్యంలో ఇటుక బట్టీల కార్మికులకు విస్తృత అవగాహన





**పరిగి, మే 22 (ప్రజా జ్యోతి) :** జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని గోవిందాపూర్ శివారులో ఉన్న ఇటుక బట్టీల వద్ద పరిగి సబ్ డివిజన్ షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షీ టీం ఇంచార్జ్ నర్సింహులు హాజరై కార్మికులకు పలు ముఖ్యాంశాలపై అవగాహన కల్పించారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం, షీ టీం సేవలు, 100 డయల్, 181 హెల్ప్‌లైన్, సీసీ కెమెరాల ప్రాధాన్యత, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం మరియు సైబర్ నేరాలపై (1930 హెల్ప్‌లైన్) ప్రజలకు వివరించారు. షీ టీం మహిళల భద్రత కోసం నిరంతరం పనిచేస్తూ వేధింపులు, బాల్య వివాహాలు, మహిళలపై నేరాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తోందని నర్సింహులు తెలిపారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసులను లేదా షీ టీంను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీం సభ్యురాలు సావిత్రి తోపాటు ఇటుక బట్టీల కార్మికులు పాల్గొన్నారు.

## ఆసరా పెన్షన్ల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలి

**- కౌన్సిలర్ మీర్ సమీనా తాహేర్ అలీ**



**పరిగి, మే 22 (ప్రజాజ్యోతి) :** పరిగి మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆసరా పెన్షన్ పథకాలపై అవగాహన కల్పిస్తూ వార్డు ప్రజాప్రతినిధులు వివరాలు వెల్లడించారు. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, చేనేత, కల్లుగీత అలాగే బీడీ కార్మికుల పెన్షన్లకు సంబంధించిన అర్హతలు, అవసరమైన పత్రాల వివరాలను 13వ కౌన్సిలర్ మీర్ సమీనా తాహేర్ అలీ తెలియజేశారు. వృద్ధాప్య పెన్షన్‌కు కనీసం 57 సంవత్సరాలు నిండి ఉండాలని, వితంతు పెన్షన్‌కు 18 సంవత్సరాలు పూర్తి అయి ఉండాలని తెలిపారు. దివ్యాంగుల పెన్షన్‌కు వయోపరిమితి లేకపోయినా కనీసం 40 శాతం వైకల్యం ఉండాలని తెలిపారు. చేనేత, కల్లుగీత కార్మికులు అలాగే బీడీ కార్మికులు సంబంధిత గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని సూచించారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డు, ఓటర్ ఐడి, రేషన్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం, బ్యాంక్ పాస్‌బుక్‌తో పాటు సంబంధిత ప్రత్యేక పత్రాలను సమర్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా 13వ వార్డు కౌన్సిలర్ మీర్ సమీనా తాహేర్ అలీ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం మున్సిపల్ కార్యాలయం లేదా 13వ వార్డు ఆఫీసర్ మౌనిక ను సంప్రదించాలని సూచించారు.

## ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కొరడా

- పోలీస్ బందోబస్తు మధ్య అక్రమ నిర్మాణాలు నేలమట్టం
- 100 కోట్ల ప్రభుత్వ భూమిని కాపాడిన రెవెన్యూ అధికారులు
- ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు



**- శంషాబాద్ తహసిల్దార్ అమర్ లింగం గౌడ్**



**రాజేంద్రనగర్, మే 22 (ప్రజా జ్యోతి) :** ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని శంషాబాద్ తహసిల్దార్ అమర్ లింగం గౌడ్ హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ లోని సర్వేనెంబర్ 162/1 లో ప్రభుత్వ భూమి ఉంది, ఈ భూమి ఔటర్ రింగ్ రోడ్డుకు పక్కనే ఉండడంతో అందులో 5 ఎకరాల 15 గుంటల ప్రభుత్వ భూమిపై కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కన్నేసి ఏలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ప్రహరీ నిర్మించి, అక్రమ నిర్మాణాలు చేశారు. అయితే గతంలో అనేకసార్లు రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చిన ఏమాత్రం లెక్క చేయకపోవడంతో రెవెన్యూ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకుపోవడంతో పై అధికారుల ఆదేశానుసారం శుక్రవారం శంషాబాద్ తహసిల్దార్ అమర్ లింగం గౌడ్ ఆధ్వర్యంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ కృష్ణ, రెవెన్యూ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య జెసిబిలతో అక్రమ నిర్మాణాన్ని నేలమట్టం చేశారు. రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న 5 ఎకరాల 15 గుంటల ప్రభుత్వ భూమి విలువ బహిరంగ మార్కెట్లో దాదాపు 100 కోట్లు ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంగా తహసిల్దార్ అమర్ లింగం గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఎవరు ఆక్రమించిన, ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన చట్టరీత్యా నేరమన్నారు అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ప్రభుత్వ భూమిలో కూల్చివేసిన స్థానంలో మరోసారి అక్రమ నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసు నమోదు చేస్తామన్నారు మండలంలోని ప్రభుత్వ భూమిలో ఎక్కడైనా ఆక్రమణలు అక్రమ నిర్మాణాలు



# రేణుక ఎల్లమ్మను దర్శించుకునేందుకు పోటెత్తిన భక్తులు

- మేకలు, కోళ్లతో అమ్మవారి మొక్కులు తీర్చుకున్న భక్తులు - గంటకు పైగా ట్రాఫిక్ జామ్
- ట్రాఫిక్‌ను మలించేందుకు శ్రమించిన చైర్మన్ ప్రవీణ్ రెడ్డి, కరణ్ కోట్ పోలీసులు
- భక్తులకు ఏలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నాం - దేవాలయ కమిటీ చైర్మన్ ప్రవీణ్ కుమార్ రెడ్డి





**తాండూరు మే 21 ప్రజా జ్యోతి :** తాండూరు మండలం కొత్లాపూర్ గ్రామ సమీపంలో కొలువుతీరిన శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం, శుక్రవారంతో పాటు అమావాస్య, పౌర్ణమి నాడు శ్రీ రేణుక ఎల్లమ్మ మాతను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలి వస్తారు. ఈనెల ఒకటి నుండి ప్రారంభమైన జాతర ఉత్సవాలలో భాగంగా కర్ణాటక తెలంగాణ రాష్ట్రాల నుండి భక్తులు వేల సంఖ్యలో తరలివస్తున్నారు. శుక్రవారం రోజు కర్ణాటక రాష్ట్రం నుండి ఆటోలు ద్విచక్ర వాహనాలు వివిధ వాహనాలలో భారీగా తరలివచ్చిన భక్తులతో గంటకు పైగా ట్రాఫిక్ జామ్ అయింది. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు తండలుగా తరలిరావడంతో అటు ట్రాఫిక్ నియంత్రణతో పాటు ఆలయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు. రేణుక ఎల్లమ్మ మాతను దర్శించుకునేందుకు భక్తులు ఆలయం వద్ద బారులు తీరాలు, కొందరు భక్తులు మేకలు కోళ్లతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి ప్రత్యేక పూజలు అనంతరం నైవేద్యాలు సమర్పించారు. కొందరు మహిళలు వేప కొమ్మల వస్త్రాలు ధరించి అమ్మవారి పూనకాలతో సందడి చేశారు. ప్రస్తుతం వేసవికాలం అధికంగా ఉండడంతో భక్తులకు మంచినీటి సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. ఈ వేడుకలలో దేవదాయ శాఖ కమిటీ సభ్యులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి





**పరిగి, మే 22 (ప్రజాజ్యోతి) :** వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారీతో పాటు వివిధ శాఖల అధికారులు ఈ సమావేశంలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించాలనే లక్ష్యంతో ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ప్రజాపాలన -- పట్టణ ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో పారిశుధ్యం, ఫైళ్ల క్లియరెన్స్, ఆరోగ్యం, "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత, సంక్షేమం, పిల్లల రక్షణ, డ్రగ్స్ నిర్మూలన, రైతు సంక్షేమం, వ్యవసాయం, విద్య, యువత, క్రీడలు, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో అధికారులు మరింత శ్రద్ధ వహించి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాళ్లను ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అలాగే అధికారులు పరిశీలించారు. స్టాళ్లలో ప్రదర్శించిన ఉత్పత్తులు, అవగాహన కార్యక్రమాలు, ప్రభుత్వ సేవలపై వివరాలు తెలుసుకున్నారు.

# నవ కంటోన్మెంట్ నిర్మాణ బాటలో వార్డు-4 పర్యటన







**- ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే శ్రీగణేష్ క్షేత్రస్థాయి పరిశీలన**

**బోయిన్ పల్లి, మే 22 (ప్రజా జ్యోతి) :** కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా నవ కంటోన్మెంట్ నిర్మాణ బాట కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శ్రీగణేష్ వేగవంతం చేస్తున్నారు. శుక్రవారం వార్డు-4 పరిధిలోని విజయ్ నగర్ కాలనీ, ఆకుల నారాయణ కాలనీ, ఎంఎస్ కాలనీలలో ఆయన సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీల్లో కాలినడకన తిరుగుతూ ప్రజలను నేరుగా కలిసి రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తెలిపిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే తన విధానమని ఎమ్మెల్యే శ్రీగణేష్ పేర్కొన్నారు. అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేసి అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. నవ కంటోన్మెంట్ నిర్మాణంలో ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# శ్రీరాముని పోస్టర్లపై అన్యమత ప్రచార పోస్టర్ల కలకలం






**అబ్దుల్లాపూర్ మెట్టు మే 22 (ప్రజాజ్యోతి) :** హిందూ సమాజం ఎంతో భక్తిశ్రద్ధలతో ఉగాది శ్రీరామనవమి పర్వదినాల సందర్భంగా ఏర్పాటు చేసిన శుభాకాంక్షల ఫ్లెక్సీలు పోస్టర్లపై ఉద్దేశపూర్వకంగా అన్యమత ప్రచార పోస్టర్లు అంటించడం తీవ్ర దుమారం రేపుతోంది. పవిత్రమైన దైవ స్వరూపమైన శ్రీరాముని చిత్రం,స్థానిక నాయకుల ఫోటోలను పూర్తిగా కప్పివేస్తూ సువార్త ఉజ్జీవ సభలు అనే పోస్టర్లను కావాలనే హిందూ మతాన్ని కించపరిచేలా ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని జై భారత్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. హిందూ సమాజం యొక్క మనోభావాలను తీవ్రంగా గాయపరిచి సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించి మత సామరస్యాన్ని దెబ్బతీయాలనే ఒక పద్ధతి ప్రకారం జరిగిన కుట్రగా స్థానికులు దీనిని అభివర్ణిస్తున్నారు. ఈ విషయంపై తీవ్రంగా స్పందించిన జైభారత్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక డివిజన్ యువత కాలనీవాసులు కలిసి ఇందుకు సంబంధించిన ఫోటో ఆధారాలతో సహా పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేయడం జరిగింది. 53వ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో హిందూ పోస్టర్లపై కావాలనే ఈ విధమైన దుశ్చర్యకు పాల్పడిన అపరిచిత వ్యక్తులను ఆ సభల నిర్వాహకులను అదుపులోకి తీసుకొని విచారించాలని, శాంతియుతంగా ఉండే డివిజన్‌లో మతపరమైన ఉద్రిక్తతలు సృష్టించడానికి ప్రయత్నించిన వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోవాలని హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా పవిత్రమైన దైవ చిత్రాలను అవమానించేలా ప్రవర్తించే ఇలాంటి శక్తుల పట్ల అధికారులు తక్షణమే కఠినంగా వ్యవహరించకపోతే, స్థానిక ప్రజల మద్దతుతో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించడం జరిగింది.

## మానవత్వం చాటుకున్న రేషన్ డీలర్లు

**మృతి చెందిన డీలర్ కుటుంబానికి ఆర్థిక సాయం**



**కొడంగల్ మే 22 ప్రజా జ్యోతి :** కొడంగల్ మున్సిపల్ కేంద్రంలోని గాంధీనగర్ కు చెందిన డీలర్ జి. విజయలక్ష్మి గారు అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న కొడంగల్ మండల డీలర్ల సంఘం సభ్యులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం సంఘం తరపున రూ. 14,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో డీలర్లు భాస్కర్, నర్సిరెడ్డి, పూరీ శేఖర్, రాహుఫ్, మహేష్ తదితర రేషన్ డీలర్లు పాల్గొన్నారు. డీలర్ల సంఘం చూపిన ఈ సహాయ స్ఫూర్తిని పలువురు అభినందించారు.

## మహిళల స్వయం ఉపాధికి కుట్టు శిక్షణ కార్యక్రమం ప్రారంభం



**ఎల్బీనగర్ (ప్రజా జ్యోతి) ప్రతినిధి :** చంపాపేట్ డివిజన్‌లోని మోడల్ మార్కెట్ భవనం వెనుక కమ్యూనిటీ హాల్‌లో జయచంద్ర రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ప్రారంభించారు. స్థానిక మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. కుట్టు యంత్రాల వినియోగం, దుస్తుల కుట్టు విధానాలు, ఆధునిక డిజైనింగ్ పద్ధతులపై నిపుణులచే శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళా ప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నాలా పనులను పరిశీలించిన బిజెపి నాయకులు

**నాలా పనుల వల్ల కాలనీ ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేదు గుండె గణేష్ ముదిరాజ్**





**శేరిలింగంపల్లి, మే 22 (ప్రజాజ్యోతి) :** మియాపూర్ డివిజన్ పరిధిలోని వీడియో కాలనీలో ప్రజలకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా,స్థానికుల అభిప్రాయాలను పూర్తిగా పక్కనపెట్టి నాలా పనుల పేరుతో భారీ గుంతలు తవ్వడాన్ని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండించింది. కమిషన్ల కోసం చేపడుతున్న ఈ పనుల వల్ల కాలనీ ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతీయ జనతా పార్టీ నాయకత్వం రవికుమార్ యాదవ్ ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు స్థానిక కాలనీ వాసులతో కలిసి వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా మియాపూర్ డివిజన్ అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో,బీజేపీ సీనియర్ నాయకులు సమ్మెట ప్రసాద్‌తో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. నాలా పనుల వల్ల కాలనీ ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని, ప్రజలకు ఇబ్బందులు ప్రమాదాలు మాత్రమే ఎదురవుతున్నాయని నాయకులు అధికారులను నిలదీశారు. ప్రజల అభిప్రాయాలను తీసుకోకుండా,సరైన భద్రతా చర్యలు పాటించకుండా పనులు చేపట్టడం పూర్తిగా నిర్లక్ష్యపూరిత చర్య అని మండిపడ్డారు. ఈ సమస్యను త్వరలోనే భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు రవికుమార్ యాదవ్ తెలిపారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించిన తర్వాతే పనులపై నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులతో జరిగిన చర్చల అనంతరం నాలా పనులను తాత్కాలికంగా నిలిపివేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్‌కు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే దానం నాగేందర్ చేతుల మీదుగా కంట్రీ చికెన్ కో సరికొత్త ప్రీమియం స్టోర్ ప్రారంభం

- మటన్, సీఫుడ్ విభాగాల్లోకి విస్తరణ
- ఫార్మర్స్ వెబ్‌సైట్' కూడా ఆవిష్కరణ



**శేరిలింగంపల్లి,మే 22 (ప్రజాజ్యోతి):** సహజ పద్ధతులలో పెంచిన నాటు కోడి మాంసానికి ప్రసిద్ధి చెందిన స్వదేశీ బ్రాండ్ కంట్రీ చికెన్ కో బంజారా హిల్స్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రీమియం ఎక్స్‌పీరియన్స్ స్టోర్‌ను ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రారంభించారు. దేశంలోనే మొదటిసారి ఫార్మ్ టు ఫోర్క్ (పొలం నుంచి ప్లేటు వరకు) అనే ఫార్మర్స్ వెబ్‌సైట్'ను కూడా ఆవిష్కరించారు. ఐదేళ్ల విజయవంతమైన ప్రయాణంలో భాగంగా ఈ స్టోర్‌ను ఏర్పాటు చేశారు. ఇది కంట్రీ చికెన్ ఎనిమిదో అవుట్ లెట్. ఈ వేదికగా చికెన్‌తో పాటు కంట్రీ మటన్, కంట్రీ క్యాచ్' (సీఫుడ్) విభాగాలను కూడా మార్కెట్లోకి పరిచయం చేశారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ... తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 650 పైగా చిన్న, సన్నకారు రైతులకు శాస్త్రీయ విధానంలో పౌల్ట్రీ పెంపకంపై శిక్షణ ఇచ్చి, ఉత్పత్తులకు హామీతో కూడిన బై బ్యాక్ సౌకర్యం కల్పిస్తూ గ్రామీణ జీవనోపాధి అభివృద్ధికి చేస్తున్న సేవలు ప్రశంసనీయం అన్నారు. సహజసిద్ధంగా పెంచిన మాంసాహార ఉత్పత్తులు,దుర్వాసన లేని రిటైల్ స్టోర్లు,సులభంగా ఉపయోగించగల మొబైల్ యాప్ ద్వారా వినియోగదారులకు నమ్మకమైన, స్వచ్ఛమైన మాంసాహారాన్ని అందిస్తూ దేశంలోనే కొత్త ప్రమాణాలను తీసుకొచ్చిందన్నారు. మన పెద్దలు అనుసరించిన ఆరోగ్యకరమైన సంప్రదాయ ఆహార అలవాట్లను మళ్లీ ప్రజలకు చేరువ చేస్తూ.. ఆరోగ్యకరమైన, ఆర్గానిక్, సంప్రదాయ ఆహార ఎంపికలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయం అన్నారు. రసాయనాలు, కృత్రిమ వృద్ధి కారకాలు, హానికరమైన ఫీడ్‌లతో పెంచబడే కమర్షియల్ పౌల్ట్రీ ఉత్పత్తులతో పోలిస్తే కంట్రీ చికెన్ స్వచ్ఛమైన, సురక్షితమైన, పోషక విలువలున్న ఆహారాన్ని అందించడంపై దృష్టి సారిస్తుందన్నారు. జీవనశైలి వ్యాధులు, ఆరోగ్య సమస్యలు పెరుగుతున్న ఈ కాలంలో ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు,చైతన్యవంతమైన జీవనశైలిని ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా కంట్రీ చికెన్ కో. వ్యవస్థాపకుడు ఢ సీఈఓ జీ సాయికేష్ గౌడ్ మాట్లాడుతూ... ఐదేళ్ల ఈ ప్రయాణంలో కంట్రీ చికెన్ కో.నగర ప్రజలను సహజ పద్ధతుల్లో పెంచిన మాంసం వైపు నడిపించిందన్నారు. కేవలం ఒకే ఒక్క నాటుకోడి స్టోర్‌గా ప్రారంభమైన ఈ సంస్థ ఈరోజు ఆరోగ్యం, రుచి రెండింటి కోసం సహజమైన మాంసాన్ని ఎంచుకుంటున్న 50,000 పైగా కస్టమర్ల ఆదరణను పొందిందన్నారు. ఒక ప్రియమైన బ్రాండ్‌గా ఎదిగిందమ్నారు. వినియోగదారులు ఆహారంపై ఎంతో అవగాహనతో ఉన్నారన్నారు. కూరగాయలు, పండ్లు రసాయన రహితమా? మామిడి పండ్లు సహజంగా పండించబడినవేనా? హానికరమైన రసాయనాలతో పండించారా? అనే విషయాలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు. యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్, కృత్రిమ గ్రోత్ హార్మోన్లు, అనారోగ్యకరమైన ఫీడ్‌తో పెంచుతున్నారా? లేదా? అనే విషయాన్ని విస్తరిస్తున్నారన్నారు. కంట్రీ చికెన్ సహజ, ఆర్గానిక్ పద్ధతుల్లో పెంచిన ఉత్పత్తులపై దృష్టి సారించిందన్నారు. వినియోగదారులు ఈ బ్రాండ్‌పై ఉంచిన నమ్మకమే మా నిబద్ధతకు నిదర్శనమన్నారు. కంట్రీ చికెన్ అందించే కోళ్లు ఆరోగ్యకరమైన ఆర్గానిక్ ఫీడ్‌తో పెంచబడతాయన్నారు. అందువల్ల వాటి మాంసం సహజంగానే మృదువుగా,రుచికరంగా, జ్యూసీగా,పోషక విలువలతో నిండి ఉంటుందన్నారు. సహజ పద్ధతుల్లో పెంపకం కారణంగా చికెన్,మటన్‌లో మైక్రో న్యూట్రియంట్స్,ఆరోగ్యకరమైన కొవ్వుల సమతుల్యత మెరుగ్గా ఉండి, అవి కేవలం రుచికరంగానే కాకుండా ఆరోగ్యానికి మేలు చేసే ఆహారంగా నిలుస్తాయని తెలిపారు.

# సమన్వయంతో పనిచేస్తేనే ప్రజా సమస్యలకు పరిష్కారం

## పెండింగ్‌లో ఉన్న పనులను ప్రత్యేక దృష్టితో పూర్తి చేయాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి ప్రతినిధి మే-22( ప్రజా జ్యోతి): జిల్లాలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లాస్థాయి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లాలో అనేక కార్యక్రమాలు చేపట్టామని, ప్రతి వారం ఒక్కో శాఖకు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత రెండున్నర సంవత్సరాలుగా చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ వారి నుంచి ఫీడ్బ్యాక్ స్వీకరించేందుకు ప్రభుత్వం 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో గ్రామ, మండల, నియోజక వర్గ స్థాయిల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్బ్యాక్ ఆధారంగా అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తోందని, అందుకే నేడు జిల్లా స్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేలా ప్రణాళిక రూపొందించామని అన్నారు. క్లియరెన్స్ పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు.అన్ని శాఖల జిల్లా అధికారులు






ఇందులో భాగస్వామ్యం కావాలని, ప్రతి అధికారి "ఇది నా బాధ్యత" అనే భావనతో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. కాలానుగుణంగా మార్పులను స్వీకరించాలని, పనులను ఒత్తిడితో కాకుండా ఆసక్తి, బాధ్యతాభావంతో నిర్వహిస్తేనే సానుకూల ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు.గ్రామాలు, పట్టణాల్లో చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు తమదైన బాధ్యతగా స్వీకరించి ముందుకు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి గింజను కొనుగోలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వందే ..!!

## బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి... కలెక్టరేట్ ఎదుట బిజెపి ఆందోళన...

కరీంనగర్ కలెక్టరేట్, మే 22 (ప్రజాజ్యోతి ) వడ్లు, మొక్కజొన్న పంటలను తక్షణం కొనుగోలు చేయాలని , కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల ను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బిజెపి జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట బిజెపి నిరసన, ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు సకాలంలో ప్రారంభించకపోవడం, ప్రారంభించిన మందకుడిగా కొనుగోళ్లు సాగడంతో రైతులు వారాల తరబడి మార్కెట్ యార్డులలో పడిగా గాపులు కాస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని అదునుగా భావించిన దళారులు , కొంతమంది అధికారులు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా నాణ్యమైన వడ్ల పంటను సైతం ఏ గ్రేడ్ నుండి బి గ్రేడ్ కు మార్చడం, తాలూ తరుగు పేరిట కోత విధించి రైతులను నిలువ దోపిడీ చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లించకుండా , దళారులు ,ట్రేడర్లు తక్కువ ధరకే రైతు పంటను కొనుగోలు చేస్తు రైతుల పొట్టగొడుతున్నారన్నారు. అహో రాత్రులు శ్రమించి చెమటోడ్చిన పంటను అమ్ముకోవడానికి అన్నదాతలు కాంగ్రెస్ పాలనలోఅష్ట కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళారులు, ట్రేడర్లు రైతును నిలువు దోపిడీ చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూస్తుందని, రైతులను దోచుకోండని కాంగ్రెస్ ప్రభుత్వమే దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తున్నట్లు ఉందని, ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే అదే విషయాన్ని స్పష్టం చేస్తుందన్నారు. అసలు కాంగ్రెస్ సర్కార్కు రైతులపై ఇంత కక్ష సాధింపు ఎందుకు ..? ఆయన ప్రశ్నించారు. జిల్లాలో ఐకెపి సెంటర్లలో , యార్డులలో ఉన్న వడ్లు , మొక్కజొన్న ప్రతి చివరి గింజను కొనుగోలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. . కాంగ్రెస్ సర్కార్ కొనుగోలు కేంద్రాల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని, ప్రధానంగా కొనుగోలు కేంద్రాలలో కూలీల కొరత, సంచుల కొరత , రవాణా వ్యవస్థ సక్రమంగా లేవని ఆయన విమర్శించారు. దీంతోనే రైతులు పంట కొనుగోళ్ల కోసం రోజుల తరబడి కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూసే దయనీయ పరిస్తితి వచ్చిందన్నారు. రాష్ట్రాన్ని ఇప్పటికే ఆర్థికంగా దివాళా తీయించిన కాంగ్రెస్ ప్రభుత్వం, కావాలనే ఈ కొనుగోళ్లను ఆలస్యం చేస్తోందనీ,. దీని వెనుక ఒక పెద్ద కుట్ర దాగి ఉందని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా కొనుగోళ్లు ఆలస్యమైతే, వర్షాలకు తడిసిపోతాయనే భయంతో రైతులు తమ పంటను మద్దతు ధర కంటే తక్కువకే మిల్లర్లకు అమ్ముకుంటారనీ, తద్వారా రైతులకు ఇస్తామన్న రూ. 500 అదనపు బోనస్‌ను ఎగ్గొట్టవచ్చని ప్రభుత్వం కుతంత్రం చేస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతు కంట కన్నీరు పెట్టిస్తుందన్నారు. రైతులు ఈ ప్రభుత్వాన్ని క్షమించే పరిస్థితుల్లో లేరని , రైతుల ప్రయోజనాలను కాపాడటానికి భారతీయ జనతా పార్టీ క్షేత్రస్థాయిలో అలుపెరగని పోరాటం చేస్తుందని ,అన్నదాతకు న్యాయం జరిగే, వడ్లు, మొక్కజొన్న చివరి గింజ కొనే వరకు బీజేపీ విశ్రమించదని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. అనంతరం వడ్ల లో బి కేటగిరి దోపిడీని అరికట్టాలని,




సంచులు, రవాణాలో అదనపు చార్జీలు రద్దు చేయాలని , రవాణా కోసం తగిన లారీలు ఏర్పాటు చేయాలని, తాలు, తరుగు దోపిడి అరికట్టాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ రాష్ట్ర అధికార ప్రతినిధి డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ళ రమేష్ , బిజెపి సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ ,బత్తుల లక్ష్మీనారాయణ ,జిల్లా ఉపాధ్యక్షులు రంగు భాస్కర చారి, వైద రామానుజం ,కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు అన్నాడి రాజిరెడ్డి,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్స్ నాంపల్లి శ్రీనివాస్, పుప్పాల రఘు, గణపతి, దండు కొమురయ్య ,కార్పొరేటర్లు బండ రమణారెడ్డి, బండారి వేణు, ఒంటెల సత్యనారాయణ, సోమిడి వేణు, తాటికొండ ప్రభావతి ,మునీందర్ , రవీందర్ బిజెపి ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యదర్శి అడిచెర్ల రాజు ,ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు దూలం కళ్యాణ్ ,ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ ,మండల అధ్యక్షులు కంది రాజిరెడ్డి , దొంతు రమేష్ ర్యాకం శ్రీనివాస్ తూర్పాటి రాజు చింతం శ్రీనివాస్, కుంట తిరుపతి, జాడి బాల్ రెడ్డి, అవదుర్తి శ్రీనివాస్, బండారి గాయత్రి, పాదం శివరాజ్, తణుకు సాయి కృష్ణ, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి శశి, సంఘ నరేష్, సంకిటి శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ పటేల్ ,కచ్చకాయల రాజు, నాంపల్లి రమేష్ బిజెపి రాష్ట్ర జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ చౌక్‌లో బీజేపీ శ్రేణుల సంబరాలు

కరీంనగర్ కార్పొరేషన్, మే 22 (ప్రజాజ్యోతి ) కరీంనగర్ నగరాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు




చేయడంతో నగరంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' కింద కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని మూడు ప్రధాన ప్రాజెక్టులకు మొత్తం రూ.5,681 కోట్లను ఆమోదించగా, అందులో కరీంనగర్ నగరానికి ప్రత్యేకంగా రూ.840 కోట్ల ప్యాకేజీ లభించింది.

ఈ నిధుల మంజూరులో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ కీలక పాత్ర పోషించారని బీజేపీ నాయకులు తెలిపారు. నగరాభివృద్ధికి ఇది చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో బీజేపీ నేతలు, కార్యకర్తలు ఘనంగా సంబరాలు నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, మిఠాయిలు పంచుకున్నారు.

ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గొప్ప సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ

## జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ బ్యూరో,మే 22 ( ప్రజాజ్యోతి ) దళితుల అభ్యున్నతికి విశేషంగా కృషిన గొప్ప సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ అని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



కొనియాడారు. ఎం.భాగ్యరెడ్డి వర్మ 138వ జయంతి వేడుకలను శుక్రవారం కరీంనగర్లో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ మాతా శిశు సంరక్షణ కేంద్రం వద్దగల భాగ్యరెడ్డి వర్మ విగ్రహానికి జిల్లా కలెక్టర్ తో పాటు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, వివిధ ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి, దళిత మహిళల విద్యకు, ప్రగతికి భాగ్యరెడ్డి వర్మ ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. భాగ్యరెడ్డి వర్మ హైదరాబాదు సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశారని కొనియాడారు.



భాగ్యరెడ్డి వర్మ జయంతిని అధికారికంగా నిర్వహించుకోవడం గొప్ప విషయమన్నారు. మహనీయులను గౌరవించుకోవడంతో పాటు వారి స్పూర్తితో సమాజ హితం కోసం ముందుకు సాగేందుకు ఇలాంటి వేడుకలు దోహదపడతాయని అన్నారు. భాగ్యరెడ్డి వర్మ అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, రెవిన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, వివిధ శాఖల అధికారులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# అప్పుల బాధతో రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం,మే 22,ప్రజాజ్యోతి: వ్యాపార నష్టాలు,అప్పుల ఒత్తిడితో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.కరీంనగర్ రూరల్ ఇన్స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆదర్శనగర్‌కు



చెందిన గంగిశెట్టి లక్ష్మణ్ (60),గత కొన్ని సంవత్సరాలుగా రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటు ప్రైవేటుగా చిట్టీలు నిర్వహిస్తున్నాడు.వ్యాపారంలో నష్టాలు రావడంతో అప్పులపాలై, వాటిని తీర్చలేని పరిస్థితి ఏర్పడింది.అప్పులు ఇచ్చిన వారు తరచూ డబ్బులు అడుగుతుండటంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు సమాచారం.ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి వస్తానని భార్య వినోదకు చెప్పి వెళ్లిన లక్ష్మణ్ తిరిగి ఇంటికి రాలేదు. సాయంత్రం 6.30 గంటల సమయంలో భార్య ఫోన్ చేయగా పని ఉందని తర్వాత వస్తానని తెలిపాడు.రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు.అనంతరం ఓ వ్యక్తి లక్ష్మణ్ ఫోన్ నుంచే వినోదకు కాల్ చేసి తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని చెట్టుకు ప్లాస్టిక్ తాడుతో ఉరివేసుకుని వేలాడుతున్నాడని సమాచారం ఇచ్చాడు.వెంటనే అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు లక్ష్మణ్ మృతదేహాన్ని గుర్తించారు.మృతుడి భార్య గంగిశెట్టి వినోద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

# ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హుడికి అందించడమే లక్ష్యం

## అభివృద్ధికి భవిష్యత్తు ప్రణాళికలు సిద్ధం చేయాలి: జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ బ్యూరో, మే 22 ( ప్రజాజ్యోతి ) ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సమర్థవంతంగా జరిగిందని, క్షేత్రస్థాయిలో పర్యటించిన అధికారులు తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా స్థాయి సభ శుక్రవారం జరిగింది.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా 10 అంశాలతో ఈ కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అధికారులు ప్రతి గ్రామం పర్యటించి ప్రజలతో మమేకమయ్యారని, వారి సమస్యలు తెలుసుకున్నారని, అవసరాలను గుర్తించారని పేర్కొన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో సభలు, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం వంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. కొత్తగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు శిక్షణ, సంక్షేమం, అవగాహన సదస్సులు వంటివి ఏర్పాటు చేశామని తెలిపారు. అధికారులు ప్రజా సమస్యలను తెలుసుకున్నారని, వాటి పరిష్కారానికి ప్రణాళికతో ముందుకు వెళ్తామని వివరించారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలతో పాటు, ప్రజా అవసరాలను గుర్తించామని తెలిపారు. ప్రతి చివరి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు చేరేవరకు తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు.నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. అందుకు అవసరమైన నిధులు విడుదల చేయాలని కోరారు. గ్రామస్థాయిలో అభివృద్ధి పనులకునిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం అభివృద్ధిని ప్రోత్సహించాలని అన్నారు.

సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయడం చైతన్య పరచడం, భవిష్యత్తు ప్రణాళికలు సిద్ధం చేయడం వంటి కార్యక్రమాల దృశ్య ప్రజా పాలన కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలో ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. అధికారులు ప్రజలతో మమేకమై అనేక సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించారని అన్నారు. మరిన్ని పెండింగ్ సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలో ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటారని తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా నియమాలు ట్రాఫిక్ నిబంధనలపై విస్తృత అవగాహన కల్పించామని అన్నారు. సుమారు 1500 మంది డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి 500 మందికి కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ 66 డివిజన్లలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం ద్వారా సానిటేషన్ ని మెరుగుపరిచామని తెలిపారు. రానున్న రోజుల్లో కొత్తగా నగరంలో కలిసిన పరిసర ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి పెడతామని అన్నారు.






సమావేశంలో డిప్యూటీ మేయర్ సునీల్ రావు, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాసరెడ్డి, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, మున్సిపల్ చైర్మన్లు మున్సిపల్ కమిషనర్లు, కార్పొరేటర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

### సర్పంచుల సమస్యల పరిష్కారానికి హెల్ప్ డెస్క్:

గ్రామాల్లో సర్పంచులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు.కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న ఈ హెల్ప్ డేస్క్ నిర్వహణ కోసం హెల్ప్ లైన్ నెంబర్లను కేటాయించి సర్పంచులకు తెలియజేయాలని పేర్కొన్నారు.క్షేత్రస్థాయిలో సందర్శించి అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ భవనాల జాబితాను సిద్ధం చేయాలని తెలిపారు. వాటిని పూర్తి చేయించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. పంచాయతీ రాజ్ చట్టం 2018 ప్రకారం అన్ని గ్రామ పంచాయతీల జమా ఖర్చులను పర్యవేక్షించాలని, తద్వారా సిబ్బంది వేతనాలు, గ్రామపంచాయతీ విద్యుత్ బిల్లులు వంటివి సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని అన్నారు.

## గ్రామ దీపికల దీక్షకు మద్దతు ఇచ్చిన తెలంగాణ రక్షణ సేన పార్టీ



**వైరా మే 22 ప్రజా జ్యోతి** వైరా మండలంలోని గ్రామ దీపికలు తమ వేతనాలు పెంచాలని శుక్రవారం రింగ్ రోడ్డు ఇండోర్ స్టేడియం వద్ద టెంటు వేసి దీక్షకు కూర్చున్నారు విషయం తెలుసుకున్న తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ వైరా నియోజకవర్గ ఇన్చార్జ్ గౌరవరపు జగదీష్ అక్కడికి చేరుకొని, తమ పార్టీ గ్రామ దీపికలకు అండగా ఉంటుందని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆమీలను తుంగలో తొక్కిందన్నారు. గ్రామ దీపికలతో వెట్టిచాకిరి చేయిస్తూ 5 వేలు వేతనాలు ఇవ్వటం అన్యాయం అన్నారు. తక్షణమే 26 వేలు కనీస వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంత్రి సీతక్క తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రామ దీపికలకు నెలకు 20 వేల వేతనం అందిస్తామని హామీ ఇచ్చిన విషయం ఆమె మరిచిపోయారన్నారు. సీతక్క టిఆర్ఎస్ చెబుతున్న గ్రామ దీపిక న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నెరవేర్చాలని కోరారు. రెండేళ్లు ఓపిక పడితే తెలంగాణ ప్రజల కష్టాలు తీరిపోతాయని కవితమ్మ ముఖ్యమంత్రి అయిన తర్వాత గ్రామ దీపికల వేతనాలు 30 వేలకి పెంచుతామని జగదీష్ అన్నారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం, సామాజిక తెలంగాణ, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకి ఆర్థిక ప్రోత్సాహం తోపాటు పంచ జన్య పాలనతో నవతెలంగాణ నిర్మిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ విద్యార్థి విభాగం వైరా నియోజకవర్గ అధ్యక్షులు ఎస్ కె ఖాన్, టిఆర్ఎస్ వైరా అధ్యక్షులు గున్నాల సురేష్ గ్రామ దీపికల జేఏసీ మండల అధ్యక్షురాలు కడియాల పద్మావతి, ప్రధాన కార్యదర్శి గాలి శైలజ, ఉపాధ్యక్షురాలు అమర్ నేని భవిత, గుమ్మ రమాదేవి, రాధా, ఎస్.కె మైభూబీ తదితరులు పాల్గొన్నారు

## మొక్కజొన్న, ధాన్యం రైతులకుఅన్యాయం జరగకుండా చూడాలి

– పొంగులేటి సుధాకర్ రెడ్డి



**వేంసూర్ మే 22 ప్రజాజ్యోతి** మండలపరిధిలో లచ్చన్నగూడెం గ్రామ పరిధిలో మొక్కజొన్న, వరి ధాన్యం రైతులు కనీస మద్దతు ధర (మీగ్రా) అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ఖమ్మం జిల్లా భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ని వీరంరాజు ద్వారా తెలుసుకున్న భాజపా జాతీయ నాయకులు డా. పొంగులేటి సుధాకర్ రెడ్డి తక్షణమే స్పందించారు. మొక్కజొన్న రైతులు క్వింటాలుకు రూ.400 నుంచి రూ.500 వరకు నష్టపోవాల్సి వస్తోందని, సొసైటీల స్పందన లేకపోవడంతో గత్యంతరం లేక రూ.1500 నుంచి రూ.1700 ధరకు దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై ఖమ్మం జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన డా. పొంగులేటి సుధాకర్ రెడ్డి, జిల్లా వ్యాప్తంగా ధాన్యం, మొక్కజొన్న రైతులను దళారులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల నష్టపోకుండా చూడాలని, రైతులకు అన్యాయం జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్, సంబంధిత అధికారులతో మాట్లాడి రైతులకు మేలు జరిగేలా, ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు డా. పొంగులేటి సుధాకర్ రెడ్డి తెలిపారు. రైతులకు సక్రమంగా కనీస మద్దతు ధర అందేలా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

## టీఆర్ఎస్ అధినేత్రి కవితమ్మ అరెస్ట్‌ని ఖండించిన వైరా నియోజకవర్గ ఇన్చార్జ్



**వైరా మే 22 ప్రజా జ్యోతి** రైతుల పక్షాన పోరాడుతున్న తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవితమ్మని పోలీసులు అరెస్టు చేయడాన్ని ఆ పార్టీ వైరా నియోజకవర్గ ఇంచార్జ్ గౌరవరపు జగదీష్ ఖండించారు. రైతులు పండించిన పంటకి గిట్టుబాటు ధర లేదు, ప్రభుత్వం పంటని కొనుగోలు చేయడం లేదు, దిక్కు తోసని స్థితిలో అప్పులు బాధలు పడలేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రైతుల గోస చూడలేక కవితమ్మ సచివాలయం ముట్టడికి శుక్రవారం పిలుపునిచ్చారు. ప్రభుత్వం కదిలివచ్చి రైతులను ఆదుకోవాలని, ఆత్మహత్యలను ఆపాలని, ఆమె డిమాండ్ చేశారు. కవితమ్మ రాకతో కంగుతిన్న కాంగ్రెస్ ప్రభుత్వం వెన్నులో వణుకు పుట్టింది, పోలీసులను మోహరించి ఆమెని అక్రమంగా అరెస్టు చేశారని జగదీష్ తెలిపారు. కవితమ్మను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని అపోహస్యం చేయడమేనని జగదీష్ అన్నారు. ఆమె అరెస్టును తెలుసుకున్న తెలంగాణ ప్రజలు రగిలిపోతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా రైతులు పండించిన పంటను కొనుగోలు చేసి గిట్టుబాటు ధర ఇవ్వాలని, పార్టీ డిమాండ్ చేస్తుంది. రాబోవు కాలంలో టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ప్రభుత్వాన్ని కవితమ్మ నిర్మిస్తారని జగదీష్ అన్నారు.

## మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

– జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్



**కొత్తగూడెం కలెక్టరేట్, మే 22,(ప్రజా జ్యోతి)** జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసీ కార్యాలయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నివారణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగంతో వ్యక్తుల జీవితాలు దుర్భరమవుతాయని, ముఖ్యంగా యువత వీటి బారిన పడకుండా ముందస్తు అవగాహన కల్పించడం అత్యంత అవసరమన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు, యువత, కార్మికులకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో గంజాయి ,ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పటిష్ట నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్మికులు పనిచేసే ప్రాంతాల్లో గంజాయి సరఫరాపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని, మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, రవాణా వంటి చర్యలను తీవ్రంగా పరిగణించాలని అన్నారు. సంబంధిత శాఖలన్నీ ప్రణాళికబద్ధంగా సమన్వయంతో పనిచేస్తూ నిరంతర తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వివిధ శాఖలు నిర్వహించిన అవగాహన కార్యక్రమాలపై సమావేశంలో సమీక్ష నిర్వహించారు. గత సమావేశం నుండి ప్రస్తుత సమావేశం వరకు నమోదైన కేసులు, వాటి పురోగతి, మాదకద్రవ్యాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సమగ్రంగా చర్చించారు. ఆర్టీసీ ద్వారా జరుగుతున్న అక్రమ రవాణాను అరికట్టేందుకు ఆర్టీసీ కండక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, అనుమానాస్పద వస్తువులపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా నిర్మూలనకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి వి వెంకటరమణ, కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ,జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ అశ్విని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అవుట్ సోర్సింగ్ కార్మికులకు అండగా ఐఎన్ టియసీ కోటి

– తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాల భారీ పెంపు

– కార్మిక కుటుంబాల్లో సంబరాలు సీనియర్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్



**సత్తుపల్లి మే22(ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పరిశ్రమలు, సంస్థలు, సేవా రంగాల్లో పనిచేస్తున్న సుమారు 1.11 కోట్ల కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల కనీస వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెంచిందని,ఐ.ఎన్.టీ.య.సీ సీనియర్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్ తెలిపారు. కాంగ్రెస్ అధిష్టానం ఆమోదంతో కార్మిక కుటుంబాల్లో ఆనందోత్సాహాలు జరుపుకుంటున్నారని తెలిపారు.డా. బి. జనక్ ప్రసాద్ రాష్ట్ర కనీస వేతన మండలి చైర్మన్‌గా,అలాగే ఐ.ఎన్.టీ.యూ.సీ సెక్రటరీ జనరల్‌గా ప్రత్యేక చొరవ తీసుకుని రాష్ట్ర ప్రభుత్వంతో నిర్వహించిన సమావేశ ఫలితంగానే ఈ నిర్ణయం సాధ్యమైందని అన్నారు.సత్తుపల్లిలో ఐ.ఎన్.టీ.యూ.సీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న త్యాగరాజన్ మాట్లాడుతూ, గత ప్రభుత్వాలు కాంట్రాక్టర్లకే లాభాలు చేకూర్చి,కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేశాయని విమర్శించారు.సింగరేణిలో గతంలో ఎప్పుడూ లేని విధంగా లాభాల వాటా నుంచి కాంట్రాక్టు కార్మికులకు రూ.5000 అందించిన ఘనత డా. జనక్ ప్రసాద్ నాయకత్వంలోని ఐఎన్‌టీయూసీ యూనియన్‌కే దక్కుతుందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన నిలుస్తుందని, రాబోయే వేజ్ బోర్డులో సింగరేణి కార్మికులకు మరింత మెరుగైన వేతన ఒప్పందం సాధిస్తామని హామీ ఇచ్చారు. కార్మికుల అభివృద్ధి కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక యూనియన్ ఐఎన్‌టీయూసీనే అని కార్మికులు గమనించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మణుగూరు ఏరియా వైస్ ప్రెసిడెంట్ కృష్ణంరాజు, బ్రాంచ్ సెక్రటరీలు నాగప్రకాష్, మురళీకృష్ణ, పొట్టి కిరణ్, షట్రక్ బాబు, ప్రతాప్ రెడ్డి, జీవ రత్నం,శ్రీధర్, ఇక్బాల్, ఏ. శ్రీధర్,రాజేందర్,అశోక్, సది, గోపి తదితరులు పాల్గొన్నారు.

## బీటెక్ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో మిస్టు విద్యార్థుల ప్రతిభ



**సత్తుపల్లి మే22(ప్రజా జ్యోతి)** గత ఏప్రిల్ నెలలో జేఎన్టీయూ– హైదరాబాద్ వారు నిర్వహించిన బీటెక్ ఫైనల్ ఇయర్– చివరి సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో మదర్ తెరిసా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలను సాధించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చలసాని. హరి కృష్ణ తెలియజేశారు.అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల వివరములు బ్రాంచ్ ల వారిగా సిఎస్సి విభాగం నుండిగంధం నేహిత 9.55, గంధాల.ఇందు శ్రీ 9.55, కమ్మ.భువనేశ్వరి 9.55, పసుపులేటి.నాగజ్యోతి 9.55, సయ్యద్.అమీర్ సరియా 9.55,ఎలమంచి. మౌనిక 9.55,శెట్టి మల్ల. కృష్ణ కుమార్ 9.55, మానికల.శృతి 9.55, ఆదూరి.మారుతి నీరజ 9.40, కోట.మహేశ్వరి 9.40, మందలపు అమూల్య 9.40,పెద్దిని.ధనలక్ష్మి 9.25, షేక్. మోమీనా 9.25, షేక్. సమీనా 9.25,వరా. జయశ్రీ 9.25.ఎస్. జి. పి. ఏ లు,ఏఐ,ఎంఎల్ విభాగం నుండికందుల.మానస 9.70, దాసరి.దేవకి 9.55, పసుమర్తి.జాహ్నవి 9.40 ఎస్. జి. పి. ఏ లు,ఈసీఈ విభాగం నుండిమహమ్మద్.అమీరా అంజుమ్ 9.55,పానుగంటి. తేజస్విని 9.40, బొట్టు. తేజస్వి 9.40,షేక్. ఇస్రాత్ ఆరా 9.25 ఎస్.జి. పి. ఏ లు, ఈ.ఈ.ఈ విభాగం నుండికామినేని.రోహిత్ శంకర్ కుమార్ 8.55,నాదెండ్ల. నితీష్ చౌదరి 8.55,కల్లేపల్లి. గౌతమి 8.40, చక్రం. సింహాద్రి 8.00 ఎస్. జి. పి. ఏ లు,సివిల్ ఇంజనీరింగ్ విభాగం నుండినూతులపాటి. నాగ అనిత 9.10,బెజవాడ.పూర్ణిమ 8.95,జిన్నా.నవ్య 8.70 ఎస్. జి .పి . ఏ లు,మైనింగ్ ఇంజనీరింగ్ విభాగం నుండిఆదర్ల.లోకేష్ 9.40, రాచమల్ల.సాయి శివ సుందర్రావు 9.40,జక్కుల. అన్వేష్ 9.25,కీర్తి. శ్రీ బాబు 9.10 ఎస్.జి. పి. ఏ లు సాధించారు.ఈ అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థిని, విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మదర్ తెరిసా విద్యాసంస్థల ప్రెసిడెంట్ చలసాని. సాంబశివరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి. ఉదయ్ కిరణ్ భార్గవ్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.వి రామచంద్ర రావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది అభినందించారు.

## సింగరేణి జీఎం కార్యాలయంలో అన్ని డిపార్ట్ మెంట్లు ఏర్పాటు చేయాలి

– ఐఎన్టియుసీ నేత తీగల క్రాంతి కుమార్ – చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌కి జీ ఎం ద్వారా వినతిపత్రం



**సత్తుపల్లి మే22(ప్రజా జ్యోతి)** స్థానిక సత్తుపల్లి పట్టణం సింగరేణి సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ ను కలిసిన ఐఎన్టియుసి జాయింట్ జనరల్ సెక్రెటరీ తీగల క్రాంతి కుమార్ సింగరేణిలో సత్తుపల్లి ఏరియా లో ఉద్యోగులను , అధికారులను సమన్వయపరుస్తూ ఉత్పత్తి,రవాణా సాధించుటకు కృషి చేస్తున్న ఏరియా రథసారథి చింతల శ్రీనివాస్ కు శుభాకాంక్షలు తెలుపుతూ అభినందిచారు.క్రాంతి కుమార్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా నూతనంగా ఏర్పడిన సత్తుపల్లి జనరల్ మేనేజర్ కార్యాలయంలో పూర్తిస్థాయిలో అన్ని డిపార్ట్మెంట్లు ఏర్పాటు చేయాలని సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కు జనరల్ మేనేజర్ ద్వారా వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా సత్తుపల్లిలో జిఎం కార్యాలయం ప్రారంభించినప్పటికీ,వివిధ డిపార్ట్మెంట్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల సుమారు 90 కిలోమీటర్లు ప్రయాణించి కొత్తగూడెం వెళ్లాల్సి వస్తుందని ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని తెలియజేస్తూ జీ.ఎం కార్యాలయంలో పర్సనల్ డిపార్ట్మెంట్ , ఫైనాన్స్ డిపార్ట్మెంట్ వివిధ డిపార్ట్మెంట్లు పూర్తిస్థాయిలో ఏర్పాటు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా సింగరేణి సంస్థ వార్షిక లక్ష్యం ఉత్పత్తి సాధనలో అత్యధికంగా సత్తుపల్లి ఏరియా నుండి ఉత్పత్తి మరియు రవాణా జరుగుతున్న సందర్భంగా ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలని కోరుతూ స్థానికంగా ఉద్యోగులు ఉండే కాలనీ ప్రారంభించి, సంవత్సరాలు గడుస్తున్న సమస్యలు పరిష్కారం కాకపోవడం వల్ల ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని తెలియజేస్తూ పీ.వీ.ఎన్ కాలనీలో పార్కింగ్ రూఫ్ షెడ్,కమ్యూనిటీ హాల్, ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్,వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.

## దళితుల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ

– జిల్లా కలెక్టర్ అంకిత్





**కొత్తగూడెం కలెక్టరేట్, మే 22,(ప్రజా జ్యోతి)** దళితుల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భాగ్యరెడ్డి వర్మ జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ దళితుల హక్కుల సాధన, అణగారిన వర్గాల సంక్షేమం కోసం జీవితాంతం పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు బాల్య వివాహాలు, అంటరానితనం, దేవదాసి, జోగిని వంటి సామాజిక దురాచారాలను రూపుమాపేందుకు ఆయన విశేషంగా కృషి చేశారని . సమాజంలో సమానత్వం నెలకొల్పేందుకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దళిత ఉద్యమ పితామహుడిగా, సంఘసంస్కర్తగా భాగ్యరెడ్డి వర్మ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. దళితులలో చైతన్యం తీసుకురావడానికి ఆయన అహర్నిశలు శ్రమించారని , మహనీయుల చరిత్ర, ఆశయాలు, త్యాగాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని దేశ భవిష్యత్తు, ప్రజల సంక్షేమం కోసం మహనీయులు చూపిన మార్గాలను యువత ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, కలెక్టరేట్ ఏవో అనంత రామకృష్ణ, బీసీ సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు సిబ్బంది సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాలినడకన వెళ్లి మొక్కు తీర్చుకున్న నల్ల సురేష్ రెడ్డి





**పాల్వంచ, మే 22, ప్రజాజ్యోతి:** శ్యామల గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఫౌండర్ కమ్ చైర్మన్ నల్ల సురేష్ రెడ్డి ఆధ్యాత్మిక భావనతో కాలినడకన వెళ్లి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా కేశవాపురంలోని పెద్దమ్మ గుడి లో కనకదుర్గ అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం అక్కడి నుంచి కాలినడకన బయలుదేరి గుడిపాడు గ్రామ సమీపంలోని తాను నిర్మించిన మోక్ష వేంకటేశ్వర స్వామి దేవాలయం కు చేరుకుని స్వామివారిని దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. భక్తి శ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమం తో ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో నల్ల సురేష్ రెడ్డితో పాటు రామకృష్ణారెడ్డి, కొడుపుగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మార్గమధ్యంలో భక్తులు ఆయనకు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

# అవినీతి విచారణ పై అధికారుల మౌనమేల

**అవినీతిపై పంచాయతీ అధికారుల చర్యలు శూన్యం**

**విచారణకే పరిమితమైన పంచాయితీ అధికారులు**

**జిల్లా కలెక్టర్ పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకోవాలి**

కొండాపూర్ ప్రజా జ్యోతి: మండల పరిధిలోని మునిదేవునిపల్లి గ్రామంలో 15వ ఆర్థిక పంచాయతీ నిధులు 7లక్షలు గ్రామపంచాయతీ ఖాతాలో నుండి


ప్రజాజ్యోతి

22 Apr 2026 - Page 5

ప్రజా జ్యోతి కథనానికి స్పందన

పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, ఉప సర్పంచ్,పనిచేయకుండానే పంచాయతీ డబ్బులు విత్ డ్రా అనే కథనం ప్రజా జ్యోతి దినపత్రికలో ఏప్రిల్ 22న ప్రచురించడంతో స్పందించిన పంచాయితీ అధికారి డిఎల్పిఓ ఏప్రిల్ 22న విచారణ చేసి నివేదిక పై అధికారులకు అందిస్తామని తెలిపి నెల రోజులు కావస్తున్న అవినీతిపై అధికారుల చర్యలు శూన్యమయ్యాయి. అధికారుల బదిలీల తర్వాత చర్యలు ఉంటాయని వికిరికి అధికారులు బదిలీపోతే వెళ్ళిపోతే చర్యలు ఎలా తీసుకుంటారు? విచారణ జరిపి జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని అక్రమాలు చేస్తున్న పంచాయతీపై చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో వేరే గ్రామాలు కూడా అవినీతికి పాల్పడే అవకాశం ఉంటాయి దీనిని దృష్టిలో పెట్టుకుని జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, ప్రజలు కోరుతున్నారు.

# స్కాలర్స్ విద్యార్థుల ప్రతిభకు జిల్లా స్థాయిలో ప్రశంసలు

## ఇంటర్ టాపర్లను సన్మానించిన జిల్లా కలెక్టర్

వనపర్తి, మే 22 (ప్రజాజ్యోతి): ప్రజా పాలన – ప్రగతి ప్రస్థాన విద్యా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్



(ఐపిఈ)–2026లో అత్యధిక మార్కులు సాధించిన స్కాలర్స్ కళాశాల విద్యార్థిని బి. మహాలక్ష్మిని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సన్మానించారు. మహాలక్ష్మి 993 మార్కులు సాధించి జిల్లాలో ప్రతిభ కనబరిచినందుకు అభినందనలు తెలిపారు. అలాగే స్కాలర్స్ కళాశాలకు చెందిన ఎలిషా షాజీ – 992, కె. నర్మద – 992, కె. శిరీష – 991, టి. సుష్మిత – 991, జి. బంధవి – 990, కె. లలిత – 990 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడి యట్ విద్యాధికారి నరేంద్ర కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ అభివృద్ధికి రూ.840 కోట్ల నిధులు మంజూరు చేయడం హర్షణీయం

## సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్ బ్యూరో,మే 22 (ప్రజాజ్యోతి ): అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) పథకం కింద కరీంనగర్ పట్టణ అభివృద్ధికి రూ.840 కోట్ల నిధులు మంజూరు చేయడం పట్ల సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ నిధుల మంజూరుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రులు, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని, కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో పట్టణాభివృద్ధి పనులను వేగవంతం చేస్తోందని అన్నారు. కరీంనగర్ పట్టణాభివృద్ధికి మంజూరైన రూ.840 కోట్లలో కేంద్ర ప్రభుత్వం వాటా మినహా మిగిలిన రూ.630 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం తన వాటాతో పాటు హడ్కో రుణం ద్వారా భరించనున్నదని తెలిపారు. పట్టణ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చొరవను ప్రజలు అభినందించాలని కోరారు.గత స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా మిగిలిన రూ.140 కోట్లలో రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.70 కోట్లు విడుదల చేసిందని, ప్రాజెక్ట్ గడువు ముగియడంతో కేంద్ర ప్రభుత్వం తన వాటా విడుదల చేయలేకపోయిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఈ నిధులతో మల్టీ స్టోర్ పార్కింగ్ భవనాలు, వరద ప్రభావిత ప్రాంతాల్లో భారీ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు



తెలిపారు.యూసీఎఫ్ నిధులతో కరీంనగర్ నగరం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని పట్టణాల అభివృద్ధికి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలుమార్లు ప్రధాని, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రికి లేఖలు రాశారని, వాటి ఫలితంగానే ఈ నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఈ సమావేశంలో వైద్యుల అంజన్ కుమార్, కాంతాల జగన్ రెడ్డి, పాడిశెట్టి భూమయ్య, చాడగొండ బుచ్చిరెడ్డి, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, పెద్దిగారి తిరుపతి, బషీర్, సుదర్శన్, హనీఫ్, జిల్కర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక:అదనపు కలెక్టర్లు

గద్వాల మే 22(ప్రజా జ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించడంతో పాటు ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం దోహదపడుతుందని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మధుమోహన్ అన్నారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్‌లో భాగంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలపై శుక్రవారం గద్వాల బృందావన్ గార్డెన్‌లో జిల్లాస్థాయి ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం తెలంగాణ గీతాన్ని ఆలపించి ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు.ఈ సందర్భంగా మధుమోహన్ మాట్లాడుతూ,అధికారులు, ప్రజా ప్రతినిధులు క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడమే కాకుండా ప్రభుత్వం అమలు చేస్తున్న,అమలు చేయబోయే సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించామని తెలిపారు.గ్రామ,మండల,నియోజకవర్గ,జిల్లా స్థాయిలో సమావేశాలు నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు.ఒక ప్రణాళికా బద్ధమైన విధానంతో ముందుకెళ్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని భావించి ప్రభుత్వం 99 రోజులపాటు వివిధ శాఖల కార్యక్రమాలను వారోత్సవాల రూపంలో నిర్వహించిందన్నారు.శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల క్లియరెన్స్, పరిశుభ్రత కార్యక్రమాలు కూడా చేపట్టినట్లు వివరించారు.అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని పేర్కొంటూ,ఈ కార్యక్రమం అనంతరం కూడా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక స్ఫూర్తిని కొనసాగిస్తామని తెలిపారు.జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ,పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'అరైవ్ అండ్ అలైవ్'కార్యక్రమాల ద్వారా ప్రజలకు రహదారి భద్రతపై విస్తృత అవగాహన కల్పించామని చెప్పారు.రోడ్డు ప్రమాదాల నివారణ కోసం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా ప్రభుత్వం అవగాహన కల్పించడమే కాకుండా సమాచారం అందించే వారికి ప్రోత్సాహకాలు అందిస్తున్నదన్నారు.అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నర్సింగరావు మాట్లాడుతూ,ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో 10 ప్రధాన అంశాలపై 99 రోజులపాటు





కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించామని తెలిపారు.గృహజ్యోతి,కొత్త రేషన్ కార్డులు,ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం, జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం వంటి పథకాలపై ప్రజలకు వివరించామని చెప్పారు.వరి,మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు,సన్నరకం వరికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లింపు వంటి అంశాలను కూడా ప్రస్తావించారు.జిల్లాలో నిరక్షరాస్యత, మూఢ నమ్మకాలు,బాల్యవివాహాల నిర్మూలనలో సర్పంచులు కీలకపాత్ర పోషించాలని కోరారు.అనంతరం వివిధ శాఖల అధికారులు ప్రభుత్వ పథకాలపై పవర్‌పాయింట్ ప్రదర్శనలు నిర్వహించారు.బాల భవన్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకోగా,తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గీతాలను ఆలపించారు.వివిధ శాఖల స్టాల్స్‌ను ముఖ్య అతిథులు సందర్శించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు,గద్వాల మున్సిపల్ చైర్‌పర్సన్ జయలక్ష్మి,వైస్ చైర్మన్ శంకర్,మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ప్రభావతమ్మ,వివిధ శాఖల జిల్లా అధికారులు,సర్పంచులు,కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విద్యా రంగంలో సంచలనం

మొదటిపేజీ తరువాయి..

విద్యా రంగంపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన అనంతరం ఆకునూరి మురళి ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. విద్యా సంస్కరణల నివేదిక పూర్తి కావడంతో తన బాధ్యత ముగిసిందని పేర్కొంటూ, తన రాజీనామా లేఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమర్పించారు. విద్యా సంస్కరణల కోసం ఏర్పాటు చేసిన తొలి విద్యా కమిషన్ చైర్మనే ఇలా అర్ధాంతరంగా తప్పుకోవడంతో, రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ విద్యా విధానాలు, నూతన విద్యా చట్టాల రూపకల్పన ఏ మలుపు తిరుగుతుందనేది ఆసక్తికరంగా మారింది.ఇంకా నాలుగు నెలల పదవీ కాలం మిగిలి ఉండగానే ఆయన ఈ పదవి నుంచి తప్పుకోవడం గమనార్హం. ఈ సందర్భంగా తనకు అవకాశం కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలుపుతూ.. తన రాజీనామా విషయమై సీఎం కార్యదర్శికి కూడా ముందస్తు సమాచారం పంపారు. ఆకునూరి మురళి నేతృత్వంలోని విద్యా కమిషన్ ఇటీవల ప్రభుత్వానికి సమర్పించిన కొన్ని సిఫార్సులు తీవ్ర వివాదానికి దారితీశాయి. ముఖ్యంగా రాష్ట్రంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది వేతనాలు మార్కెట్ ప్రమాణాల కంటే చాలా ఎక్కువగా ఉన్నాయని, వాటిని సమీక్షించి 'హేతుబద్ధీకరించాలని' కమిషన్ చేసిన వ్యాఖ్యలపై ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమన్నాయి. దీనికి తోడు ఇంటర్మీడియట్ బోర్డును రద్దు చేసి, ఇంటర్ విద్యను కూడా పాఠశాల విద్యలోనే విలీనం చేయాలనే ఆలోచనలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ సిఫార్సులపై ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలతో పాటు ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టాయి. ఏసీ రూమ్‌లలో కూర్చుని క్షేత్రస్థాయి పరిస్థితులు తెలియకుండా ఇలాంటి నివేదికలు ఇచ్చారంటూ ప్రతిపక్ష నేతలు కమిషన్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్థాయికి ధీటుగా మార్చాలనే పట్టుదలతో ఉండే ఆకునూరి మురళి.. గతంలో ఏపీ విద్యాశాఖలోనూ కీలక బాధ్యతలు నిర్వహించారు. అయితే తెలంగాణ విద్యా కమిషన్ సిఫార్సుల చుట్టూ ముసిరిన రాజకీయ జగడం, ఉపాధ్యాయ లోకం నుంచి వచ్చిన తీవ్ర వ్యతిరేకత, అంతర్గత ఒత్తిళ్ల వల్లే ఆయన ఈ పదవి నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

# పదేపదే కొందరికే రిజర్వేషన్లు ఇస్తే ఎలా?

మొదటిపేజీ తరువాయి..

ఆందోళన వ్యక్తం చేసింది.దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది. వెనుకబడిన వర్గాల్లోని 'క్రీమీలేయర్' పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుందని పేర్కొన్నారు. 'రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం కోటాను ఆశించడం సరికాదు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించు కుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం ఓబీసీలకే పరిమితమైన 'క్రీమీలేయర్' నిబంధనలను, మరింత శాస్త్రీయంగా అమలు చేయడంపై న్యాయస్థానం దృష్టి సారించింది. 1992 నాటి చారిత్రాత్మక 'ఇంద్ర సాహ్ని' కేసులో సుప్రీంకోర్టు ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను సమర్థిస్తూనే, వారిలో 'క్రీమీలేయర్' వర్గాలను మినహాయించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం వార్షిక ఆదాయం రూ. 8 లక్షలు దాటిన వారితో పాటు.. ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు, ఐఏఎస్, ఐపీఎస్ వంటి సీనియర్ బ్యూరోక్రాట్లు, మిలిటరీలో టాప్ ఆఫీసర్ల పిల్లలను ఆదాయంతో సంబంధం లేకుండా క్రీమీలేయర్ కింద పరిగణించి కోటా నుంచి మినహాయిస్తున్నారు. అయితే, ఈ మినహాయింపులను సవాల్ చేస్తూ కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఇక, ఈ కేసులో సుప్రీంకోర్టు.. కేంద్ర ప్రభుత్వానికి, ఇతర సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

# హైదరాబాద్‌లో టెస్లా ఈవి కార్ల షోరూం

## మంత్రి శ్రీధర్ బాబుతో కంపెనీ ప్రతినిధుల భేటీ

హైదరాబాద్,మే22(ప్రజాజ్యోతి): ఇవి వాహనాల దిగ్గజ సంస్థ టెస్లా త్వరలో హైదరాబాద్‌లో విక్రయ, సేవల కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. శుక్రవారం నాడు ఆ సంస్థ ఇండియా ప్రతినిధులను ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో బేటీ అయిన సందర్భంగా తాము ఇక్కడ అమ్మకాలు ప్రారంభించేందుకు ఆసక్తితో ఉన్నటు వెల్లడించారు. విద్యుత్తు వాహనాలు, ఇంటెలిజెంట్ మొబిలిటీ వ్యవస్థలకు అవసరమైన అత్యాధునిక సాంకేతికతలతో కూడిన ఎకోసిస్టంను తెలంగాణాలో అభివృద్ధి చేసినట్టు




ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ సందర్భంగా తెలిపారు. సెమీ కండక్టర్ డిజైన్, ఆటోమొబైల్ సాఫ్ట్ వేర్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, డీప్ టెక్నాలజీ రంగాలకు ప్రధాన కేంద్రంగా రాష్ట్రం ఎదిగిందని చెప్పారు. హైదరాబాద్ లో టెస్లా విద్యుత్తు వాహనాల సేల్స్, సర్వీసు సెంటర్లను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చిన టెస్లా ఇండియా జనరల్ మేనేజర్ శరద్ అగర్వాల్, లీడ్ పబ్లిక్ పాలసీ, బిజినెస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రజత్ లను శ్రీధర్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. టెస్లా ఇప్పటి వరకు దేశంలో నాలుగు సేల్స్ షోరూంలను ఏర్పాటు చేయగా తదుపరి కేంద్రంగా హైదరాబాద్ ను ఎంపిక చేసుకోవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేసారు. టెస్లా కేవలం ఇవి కార్ల కంపెనీ మాత్రమే కాదని, ఎలక్ట్రిక్ వాహనాల సాఫ్ట్‌వేర్, సెమీకండక్టర్లు, కృత్రిమ మేధస్సు (ఏఐ), రోబోటిక్స్, బ్యాటరీ టెక్నాలజీలు, అధునాతన తయారీ రంగాల్లో నూతన ఆవిష్కరణలను పరిచయం చేసిన సంస్థగా ఎదిగిందని మంత్రి పేర్కొన్నారు. టెస్లా దీర్ఘకాలిక సాంకేతిక లక్ష్యాలకు తెలంగాణలో ఉన్న ఎకోసిస్టం బాగా సరిపోతుందని ఆయన తెలిపారు.

### డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్‌లో రోల్ మోడల్ గా

# తెలంగాణ

మొదటిపేజీ తరువాయి..

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ప్రస్తుతం గ్లోబల్ ఎకానమీ ఊహించని వేగంతో డిజిటల్ వైపు దూసుకుపోతోందని, సంప్రదాయ పద్ధతుల స్థానంలో వ్యవస్థను రీ–డ్గి÷న్ చేసే సరికొత్త డిజిటల్ ఈక్వేషన్స్ తెరపైకి వచ్చాయన్నారు.

ఈ గ్లోబల్ డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ కు అనుగుణంగా మార్పుల్ని అందిపుచ్చుకునే దేశాలకే భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రపంచం లోనే అతిపెద్ద డిజిటల్ ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందన్నారు. డిజిటల్ పేమెంట్స్ నుంచి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వరకు... మనం సాధిస్తున్న పరివర్తనను ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోందన్నారు. ఈ గ్లోబల్ డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ లో భారత్ సాధిస్తున్న ప్రగతికి తెలంగాణ ఒక గ్రోత్ ఇంజన్ లా మారిందన్నారు. భావితరాల అవసరాలకు అనుగుణంగా నెక్స్ట్ జనరేషన్ ఇన్నోవేషన్స్, టాలెంట్, ఎకనామిక్ గ్రోత్.. ఈ మూడింటినీ నడిపించే ఒక బలమైన ఎకోసిస్టంను ఇప్పటి నుంచే అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2047 నాటికి దేశ జీడీపీలో మన వాటాను10 శాతానికి చేర్చాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నామన్నారు. ఒకప్పుడు కేవలం సంప్రదాయ బుక్ కీపింగ్, అకౌంట్స్ ఆడిటింగ్‌కే పరిమితమైన సీఏలు.. నేడు కార్పొరేట్ సంస్థలకు 'స్ట్రాటజిక్ బిజినెస్ అడ్వైజర్స్'గా రూపాంతరం చెందారన్నారు. ఏఐ, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ తదితర ఎమర్జింగ్ టెక్నాలజీస్ వల్ల ÷నాన్స్ రంగంలో సరికొత్త అవకాశాలు... అదే స్థాయిలో సైబర్ మోసాలు, డీప్‌ఫేక్స్, సైబర్ అరెస్ట్, క్రిఎ÷–టో ఫ్రాడ్స్ తదితర సవాళ్లు కూడా తెరపైకి వచ్చాయన్నారు. ఇలాంటి తరుణంలో సీఏలు కేవలం ÷నాన్షియల్ ఆడిటింగ్‌కే పరిమితం కాకుండా... 'సైబర్ అష్యూరెన్స్'కూ ప్రాధాన్యమివ్వాల్సిన అవసరముందన్నారు. మారుతున్న ట్రెండ్స్ కు స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్ పై దృష్టి సారించాలని సూచించారు. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఅండ్ఏజీ ఆనంద్ మోహన్ బజాజ్, సెర్ట్ ? ఇన్ జాయింట్ డైరెక్టర్ అభిషేక్ సోలంకి, ప్రిన్సిపల్ డైరెక్టర్ ఆఫ్ ఇన్ కం ట్యాక్స్ ఇన్వెస్టిగేషన్ రాజగోపాల్ శర్మ, సెబీ సీజీఎం సాహిల్ మాలిక్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీ హర్షవర్ధన్, ఆర్బీఐ సీజీఎం శైలజా రాణి జంపాల, ఎన్ ఎస్ ఈ సీఐఎస్వో రాజేష్ థాపర్, డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సీఈవో వినాయక్ గాడ్సే తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ వ్యాపారం

## బిఆర్ఎస్ రాగానే ఫ్యూచర్ సిటీ రద్దుచేస్తాం

## మాజీమంత్రి హరీష్ రావు హెచ్చరిక

హైదరాబాద్,మే22(ప్రజాజ్యోతి): బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న మాజీ మంత్రి.. కాంగ్రెస్ సర్కార్ చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్‌పై



కీలక వ్యాఖ్యలు చేశారు. ఫార్మా సిటీకి మాత్రమే కేంద్ర పర్యావరణశాఖ అనుమతి ఇచ్చిందని తెలిపారు. డీవియేషన్ ఉంటే రైతుల భూములు వెనక్కి ఇవ్వాలని చట్టంలో ఉందని వెల్లడించారు. ఫార్మా సిటీని కొనసాగిస్తామని ఓ వైపు కోర్టుకు చెబుతూ.. రేవంత్ ప్రభుత్వం జిమ్మిక్కు చేస్తోందని విమర్శించారు. ఫార్మా సిటీ వస్తే దానికి అనుబంధంగా కనీస సౌకర్యాలు ఎడ్యుకేషన్, హౌసింగ్ రావాలని ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. 75శాతం ఫార్మా సిటీ ఉండి... మిగతా 25శాతం మిగతావి ఉండాలని అన్నారు. కానీ..75శాతం మిగతా వ్యాపారం చేసి.. కేవలం 25శాతమే ఫార్మా వచ్చేలా చేస్తున్నారని విమర్శించారు. ఇది చట్ట ప్రకారం చెల్లదన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో కాంగ్రెస్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని మాజీ మంత్రి ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని.. ఫార్మా సిటీని రీస్టోర్ చేస్తామని స్పష్టం చేశారు. 'ఇది నా మాట కాదు.. పార్లమెంట్ చట్టం. ఫార్మా సిటీ వస్తే లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని మేము ప్రారంభించాం. మన దగ్గర నుంచి ఒక్క ఫార్మా కంపెనీ బయటికి వెళ్లొద్దని చేశాం. ఇప్పటికే రెండున్నరేళ్లు గడిచిపోయింది. లాస్ట్ వన్ ఇయర్ ఎలక్షన్ ఉంటుంది. రేవంత్ సర్కార్ ఏమీ చేయలేదు. భూములు పంచి పెడితే బ్యాక్ ఎండ్ ఏదో లబ్ధి పొందాలని ఎ÷–÷–లాన్ చేశారు. ఫార్మా సిటీ అభివృద్ధి చెందితే బీఆర్ఎస్‌కు పేరు వస్తుందని ఇలా చేశారు. ఉన్నది ఉన్నట్టుగా అక్కడ ఫార్మా సిటీనే వస్తుంది' అని హరీశ్ రావు స్పష్టం చేశారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967